తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

సచిత్రమాసపత్రిక

జనవరి 2020. వెల రూ.5/-



అంతయు నీవే
హరి పుండరీకాక్ష
- అన్నమయ్య

జనవరి 06
వైకుంఠ ఏకాదశి.



23-11-2019 నుండి
01-12-2019 వరకు జరిగిన

# తిరుచానూరు శ్రీపద్మావతీఅమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవ దృశ్యమాలిక

















# గీతాశ్లోకార్థసారం

శ్లో : యుధామన్యు శ్చ విక్రాన్త ఉత్తమౌజా శ్చ వీర్యవాన్ ।
సౌభద్రో ద్రౌపదేయా శ్చ సర్వ ఏవ మహారథాః ॥

(శ్రీమద్భగవద్గీత 01వ అధ్యాయం-06వ శ్లోకం)

ప్రతిపదార్థం: విక్రాన్తః= పరాక్రమశాలియగు; యుధామన్యుశ్చ= యుధామన్యుడును; వీర్యవాన్= శౌర్యవంతుడగు; ఉత్తమౌజాశ్చ= ఉత్తమౌజుడును; సౌభద్రః= అభిమన్యుడును; ద్రౌపదేయాశ్చ= ద్రౌపదీతనయులగు ఉపపాండవులును; సర్వ= వీరందఱున్ను; మహారథాః ఏవ= మహారథులే (అయి ఉన్నారు.)

భావం: శౌర్యవంతుడగు యుధామన్యుడు, పరాక్రమశాలియగు ఉత్తమౌజుడు, అభిమన్యుడు, ఉపపాండవులు, వీరందరునూ మహారథులే అయి ఉన్నారు.

## వేంకటాచల వల్లభునకును మహామంగళం!!

మంగళం గోవిందునకు జయ - మంగళం గరుడధ్వజునకును,
మంగళము సర్వాత్మునకు ధ - ర్మ స్వరూపునకూ. జయజయ

ఆదికిని నాద్యైన దేవున - కచ్యుతున కంభోజనాభున
కాదికూర్మంబైన జగ - దాధారమూర్తికిని,
వేద రక్షకునకును సంతత - వేదమార్గ విహారునకు బలి
భేదికిని సామాదిగాన - ప్రియవిహారునకు

హరికిఁ బరమేశ్వరునకును శ్రీ - ధరునకును గాలాంతకునకును
పరమ పురుషోత్తమునకును బహు - బంధదూరునకు,
సురముని స్తోత్రునకు దేవా - సురగణ శ్రేష్ఠునకు కరుణా
కరునకునుఁ గాత్యాయనీనుత - కలితనామునకు

పంకజాసన వరదునకు భవ- పంకవిచ్ఛేదునకు భవునకు
శంకరున కవ్యక్తునకు నా - శ్చర్య రూపునకు,
వేంకటాచల వల్లభునకును - విశ్వమూర్తికి నీశ్వరునకును
పంకజాకుచకుంభ కుంకుమ - పంకలోలునకు


(అన్నమాచార్య సంకీర్తనలు సంపుటం-01, సంకీర్తనం-46)

గోవిందునకు మంగళము. గరుడకేతనునకు జయ మంగళము. సర్వమునకు ఆత్మయైనవానికి శుభమంగళము. ధర్మమే స్వరూపముగా గలవానికి నిత్యమంగళము.

మూలమునకు మూలమైన దేవునకు, చ్యుతిలేని వానికి, పద్మనాభునకు, తొలికూర్మమై లోకమునకెల్ల ఆధార మైనమూర్తి గలవానికి, వేదమును కాపాడువానికి, ఎల్లవేళల వేదమార్గముననే విహరించువానికి, సామవేదగానమునందు ప్రీతి గలవానికి సదా మంగళము.

శ్రీహరికి, పరమేశ్వరునకు, లక్ష్మీధరునకు, కాలా తీతునకు, శ్రేష్ఠుడైన పురుషోత్తమునకు, బంధములకెల్ల దూర మైన వానికి, దేవతలు, మునులు గావించు స్తోత్రములు గలవానికి, దేవాసురసమూహములో శ్రేష్ఠుడైనవానికి, దయకు నిలయమైనవానికి, పార్వతి వినుతించు మంగళ కరమైన నామములు గలవానికి పరమమంగళము.

బ్రహ్మకు వరము లిచ్చినవానికి, సంసారమాలి న్యమును కడిగివేయువానికి, భవునకు, శంకరునకు, వ్యక్తము గాని వానికి, అచ్చెరువుగొల్పు రూపము గలవానికి, విశ్వా కారునకు, ఈశ్వరునకు లక్ష్మీదేవియొక్క కుచకుంభముల మీది కుంకుమపు కలపమునం దాసక్తుడైన వానికి, శ్రీవేంకటాద్రీశ్వరునకు మహామంగ ళము.



– డా॥ సముద్రాల లక్ష్మణయ్య

# మీ మాట

**Dr. K.Anjanappa,** M.Sc., Ph.D., FMS
Member (Retd.)
A.P.Public Service Commission

Plot No. 11, Phase III
Kamalapuri Colony,
Hyderabad-500 073.
Tel: 040-23550005.

Dt. 5/9/19

11 SEP 2019
తి.తి. దేవస్థానములు, తిరుపతి

S.E. (Telugu)

మహాశయా,

[illegible] (1960s) [illegible] Electrical Engg Head [illegible] వందనాభి వందనాలు.

భవదీయుడు
డా|| [illegible] అంజనప్ప
Former Registrar, S.V. University, Tirupati

To
The Chief Editor Dr. Radha Ramana
TTD Press, Tirupati - 517507.

**Member:** Board of Management & Finance Committee
Babasaheb Bhimrao Ambedkar University, Lucknow.
**Formerly:** Executive Council and Finance Committee, Pondicherry University, Pondicherry.
Registrar, Sri Venkateswara University, Tirupathi.
Registrar, Nagarjuna University, Guntur.
Registrar, Indira Gandhi National Open University, New Delhi.

## ధన్యవాదములు

అక్టోబరు నెల 'సప్తగిరి'లో అష్టదిక్పాలురను గురించి వివరంగా తెలియజేసినారు. చాలా సంతోషము. ఎం.వి. రమణ గారికి ధన్యవాదములు.


తర్వాత. శ్రీదేవిభూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయం, తొండమనాడు యొక్క పుట్టుపూర్వోత్తములు సవివరంగా తెలియజేసినందులకు చాలా సంతోషము. తెలియజేసినటువంటి శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణీగారికి ధన్యవాదములు.

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవం చిత్రములు చాలా బాగున్నాయి. పంచబేరాలు వివరంగా తెలియపరచినందులకు ధన్యవాదములు.

–అక్కల కొండయ్య, నెల్లూరు.


పాఠకులకు, రచయిత(త్రు)లకు, ఏజెంట్లకు అందరికీ....

**నూతన ఆంగ్ల సంవత్సర 2020 మరియు సంక్రాంతి శుభాకాంక్షలు!**



దేవదేవుడైన శ్రీవేంకటేశ్వరుని కరుణాకటాక్షవీక్షణాలు అందరిపై అనవరతం ప్రసరించాలనీ మరియు ఆయురారోగ్య ఐశ్వర్యాలు ప్రసాదించాలనీ స్వామివారిని ప్రార్థిస్తూ...

మీ... ప్రధానసంపాదకుడు



తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 50 జనవరి, 2020 సంచిక : 08



వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి ॥

గౌరవ సంపాదకుడు
శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

ప్రచురణకర్త-ప్రధాన సంపాదకుడు
డా॥ కె.రాధారమణ, ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

సంపాదకుడు
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

ఉపసంపాదకురాలు
శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి,
ఎం.ఏ., ఎం.ఇడి., ఎం.సి.జె., ఎల్.పి.టి.,

ముద్రాపకుడు
శ్రీ ఆర్.వి.విజయకుమార్, బి.ఏ., బి.ఇడి.,
ఉపకార్యనిర్వహణాధికారి (ప్రచురణలు & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

ఫోటోలు
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

సప్తగిరి మాస పత్రిక

ఇతర వివరాలకు
ఫోన్ నెంబర్లు
0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-

## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| సంక్రాంతి సంప్రదాయం | డా॥ దేవులపల్లి పద్మజ | 07 |
| సందేహాలు - సమాధానాలు | డా॥ సముద్రాల లక్ష్మణయ్య | 11 |
| శ్రీకృష్ణభగవద్విజయం | డా॥ వుయ్యూరు లక్ష్మీనరసింహారావు | 12 |
| శ్రీవైకుంఠవాసా గోవిందా!! | శ్రీమతి ఈతకోటి మునెమ్మ ముత్తుక్రిష్టన్ | 14 |
| ముక్తిప్రదతీర్థం! స్వామిపుష్కరిణి!! | శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి | 18 |
| అంతా దేవుని లీల!! | శ్రీ దండుబోయిన రవికుమార్ | 22 |
| తిరుమలకు తొలిగడప దేవుని కడప | శ్రీ పంతుల నాగాంజనేయులు | 23 |
| దివ్యక్షేత్రం... తిరుమల | శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం | 31 |
| కైంకర్యమే తనువు దాల్చితే... | డా॥ కంపల్లె రవిచంద్రన్ | 33 |
| అపార ఔషధ గుణాల నిధులు వ్యర్థ పదార్థాలు | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 35 |
| తిరుమల శ్రీవారికి శాత్తుమొఱసేవ | ఆచార్య కోదండరామయ్య | 37 |
| ఏకలవ్యుడు | మాస్టర్ కె.సాయిజయంత్ | 42 |
| గురుదక్షిణ | శ్రీ బలిజేపల్లి సుబ్బారావు | 43 |
| నాయకత్వ లక్షణాలు | డా॥ వైష్ణవాంఘ్రిసేవకదాస్ | 45 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ టి.వి.కె.పూర్ణప్రసాద సిద్ధాంతి | 47 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 49 |
| తిరుపతిలో గీతాజయంతి ఉత్సవాలు | డా॥ వైష్ణవాంఘ్రిసేవకదాస్ | 50 |


ముఖచిత్రం : శ్రీమహావిష్ణువు
వెనుక చిత్రం : శ్రీహరిహృదయనివాసిని

ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

24 గంటలూ పనిచేసే
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 - 2277777 / 2233333



వెబ్‌సైట్- www.tirumala.org, www.tirupati.org; ఆన్‌లైన్ సేవలు/వసతిసౌకర్యం కొరకు- www.ttdsevaonline.com
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు-
sapthagiri_helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

## సంపాదకీయం

# ఉత్తరాయణ పుణ్యకాలం ఉత్తమగతులకు ఆలవాలం!!

మకరసంక్రమణం వచ్చింది. మనుషుల్లో, మనసుల్లో సందడి హెచ్చింది. పర్వం పరమార్థం ఎలా ఉన్నా సంక్రాంతి అంటే కనపడేది చలిమంటలు, గోవిందదాసరులు, వీథిముంగిటి గొబ్బెమ్మలు, కొత్త అల్లుళ్లకొలువులు, కోడి పందాలు, ఇంటింటి ముగ్గులు, ఇంపైన భోజనాలు, ఒకటేమిటి అదొక కొత్త కల. నిజానికి ఈ పండుగ ఏమిటా అని ఆలోచిస్తే ఆలోచనల చేలల్లో కొత్తపంట కావల్సినంత లభిస్తుంది.

సకలదేవతాస్వరూపుడు, సర్వలోకాల ప్రత్యక్షదైవం అయిన సూర్యభగవానుడు ధనూరాశినుండి మకరరాశి లోనికి ప్రవేశించినరోజే మకరసంక్రాంతి పర్వదినం ప్రారంభమౌతుంది. అనారోగ్యం, అతివృష్టి, అనావృష్టి మొదలైన ఈతిబాధలతో సాగిన దక్షిణాయనం ముగిసి; ఆరోగ్యం, పాడీపంటా, ఆనందం అంతటా వెల్లివిరిసే ఉత్తరాయణం ఈ మకరసంక్రమణంతో ప్రారంభమౌతుంది. అంతేగాక సంక్రాంతి పర్వదినం నుండి సూర్యుడు ఉత్తరదిక్కున ఉన్న ఊర్ధ్వలోకవాసులకు చీకటిని(అజ్ఞానం) తొలగించి, వెలుగును(జ్ఞానం) ప్రసాదిస్తూ సంచరిస్తాడనీ, కనుకనే ఉత్తరాయణం పరమ పవిత్రమైందనీ అంటారు. అందువల్లే భీష్మాచార్యులు ఉత్తరాయణ పుణ్యకాలం వచ్చేదాకా ప్రాణాలు నిలుపుకున్నా డని భారతం చెప్తోంది. సారాంశమేమంటే ఈ మకరసంక్రాంతి సమయం పాడిపంటలతో సిరులు పొంగిపొరలే కాలం! రైతన్నల ఈతిబాధలు తొలగి శాంతినిచ్చేకాలం! ఆరోగ్యసౌభాగ్యాలు కలిగి ఆనందం వెల్లివిరిసేకాలం! పిల్లా-పెద్దా.... ఇలా అందరిలో నవచైతన్యాన్ని పంచిపెట్టే పర్వదినమే మకరసంక్రాంతి.


ఇక ఈ పండుగలో కనుమపండుగ ప్రత్యేకించి గోమాతలకు, పాడిపంటలకు సంబంధించింది. సృష్టికి ప్రధానకారణం గోవు. ఇది పరమపవిత్రమైనది. ప్రజలను కష్టాలనుండి రక్షిస్తుంది. గోవును తాకితేనే చాలు. సకల తీర్థాల్లో స్నానమాడి, సకలదేవతలకు సేవచేసినట్టి భాగ్యం కల్గుతుంది. అలాంటి గోసంతతి పరిరక్షణలో తి.తి.దేవ స్థానం ఎన్నో ప్రణాళికలు చేపట్టి, గోసంపదను కాపాడుతోంది. మనమందరం కూడా భారతీయ సంస్కృతీ పరిరక్షణలో భాగమైన గోసంపదను, పశుజాతిని కాపాడుకుందాం. పెంచి పోషిద్దాం. తద్వారా మనలను మనం ఉద్ధరించుకుందాం.

\- - - - - - - -

ఇప్పటికి **'సప్తగిరి'** మాసపత్రిక ప్రారంభించి 50 వసంతాలు 2020 సం॥ 'మే' నెలకి పూర్తి చేసుకోంటోంది. ఈ సందర్భంగా 2020 జనవరి సంచిక నుండి సప్తగిరి మాసపత్రికలో అనేకమార్పులు తీసుకురావడం జరిగింది. ఈనాడు నాటిన విత్తనాలు... రాబోవు రోజుల్లో వృక్షాలవుతాయి. దేశభవిష్యత్తు ఉజ్వలంగా వెలుగొందాలంటే... పిల్లలు మానవీయవిలువలతో ఎదగడం ఎంతో అవసరం. తిరుమల తిరుపతి దేవస్థానం ఈ దిశగా అడుగులు వేస్తోంది. పిల్లలకోసం ప్రత్యేకంగా **'బాలసప్తగిరి'** అని ఇరవైపుటల అనుబంధాన్ని ప్రతినెలా తీసుకురావాలని తిరుమల తిరుపతి దేవస్థానం నిర్ణయం తీసుకుంది. దాససాహిత్యం, ఆళ్వార్లసాహిత్యం, హిందూ దేవుళ్లు, బాలనీతి, చిత్రకథ, క్విజ్, చిత్రలేఖనం మొ॥ పిల్లలభాషలో **'బాలసప్తగిరి'** వస్తున్నది. బాలబాలికల్లో మన సంస్కృతిపట్ల, ధర్మంపట్ల, పురాణాలపట్ల, భగవంతుని పట్ల, పెద్దలపట్ల చక్కని అవగాహన కలిగించటానికి, ఆధ్యాత్మిక ఆలోచనల్ని పెంపొం దించటానికి ఈ **'బాలసప్తగిరి'**ని ప్రారంభించింది. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల్లో మన పురాణ, ఇతిహాసాలపట్ల జ్ఞానాన్ని పెంపొందించడానికి వారికి సప్తగిరి మాసపత్రికలో వస్తున్న పిల్లలపుటలను చదివేలా ప్రోత్సహించండి. మీరూ చదివి... వారికి ఆధ్యాత్మిక విలువల పట్ల అభిరుచి పెంచండి!

సప్తగిరిమాసపత్రికలో సరికొత్త శీర్షిక 'సంస్కృతం నేర్చుకుందాం!!' అనే ధారావాహికను కూడా ప్రారంభిస్తున్నాం.

పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకుని ప్లాస్టిక్ కవర్లను నిషేధించి పేపరు కవర్లలో **'సప్తగిరి'**ని భక్తులకు అందిం చడం జరుగుతుంది. పాఠకులు ఈ మార్పును స్వాగతించాలని ఆకాంక్ష!





# సంక్రాంతి సంప్రదాయం

- డా॥ దేవులపల్లి పద్మజ, 98496 92414

**2020, జనవరి 15వ తేదీన సంక్రాంతి పండుగ సందర్భంగా...**

సూర్యుని గతిని మార్చేది సంక్రమణం–అదే మనకు "సంక్రాంతి". యావద్భారతదేశంలోనూ వేదకాలం నుంచీ ఎంతో ఆనందోత్సాహాలతో జరుపుకునే ఆధ్యాత్మిక పర్వదినం. కాలచక్రంలోని రాసులన్నింటిలోకి 'మకరం' ఉత్తమమైన రాశి. కారణం ఏమంటే ఈ మకరం ప్రపంచం యొక్క కర్మస్థానం. కాలపురుషుడియొక్క రాశిచక్రంలో మకరరాశి పదవది. అంటే మనిషికి శిరస్సువంటిది. ఈ బ్రహ్మాండానికి అటువంటి శిరస్సు ఈ మకరరాశి.



ఈ కల్పం ప్రారంభంలో ప్రళయం వచ్చి ఈ ప్రపంచమంతా జలమయమైనప్పుడు ఈ భూమి సముద్రంలో మునిగిపోయి కొన్ని కోట్ల సంవత్సరాలు అలాగే నీళ్ళలో ప్రళయస్థితిలో ఉన్నప్పుడు విష్ణుమూర్తి ఆదివరాహావతారంలో ఈ భూమిని ఉద్ధరించినదీ ఈ మకర సంక్రాంతిరోజునే.



శ్వేతవరాహకల్పం ఆరంభంలో యజ్ఞవరాహమూర్తి భూమిని ఉద్ధరించినందుకు సంకేతంగా ఈ పండుగరోజున కూష్మాండదానం చేస్తారు. ఈ రోజు గుమ్మడిపండును దానం చేస్తే సకలబ్రహ్మాండం విష్ణుమూర్తికి దానం చేసినట్టవుతుంది.

విష్ణురాశి మకరం. ఈ పవిత్రమైన మకర రాశిలోనే విష్ణునక్షత్రమైన శ్రవణం ఉంది. సృష్ట్యారంభంలో శ్రీమన్నారాయణుడు అనంతపద్మనాభస్వామిగా బ్రహ్మకు సాక్షాత్కరించినది శ్రవణ నక్షత్రంలోనే. ఈ కారణంచేత మకరరాశి విష్ణురాశి.

మకరరాశియే తనకు కుండలములుగా కలిగినవాడు, మకరసూర్యుడే తన కిరీటముగా గలిగినవాడు అయి సూర్యాంతరవర్తియే, ఆదిత్యుని మధ్యలో ఉన్న శ్రీమన్నారాయణమూర్తి. మనకి... ప్రత్యక్షంగా సాక్షాత్కరించేది మకరసంక్రమణ పర్వకాలంలోనే. ఈ మకరరాశిలో ఆత్మస్వరూపుడైన సూర్యుడు ప్రవేశించే రోజు కాబట్టి విష్ణుమూర్తియొక్క ధ్యానానికి, విష్ణు ఆరాధనకూ ఒక మహత్తర పర్వదినం. వామనావతారఘట్టంలో వామనుడికి బలిచక్రవర్తి



మూడడుగుల నేలను దానం చేసినదీ ఈ పర్వదినంనాడే. రెండడుగులతో భూలోకం, భువర్లోకం, సువర్లోకం వ్యాపించి బ్రహ్మాండమంతా కొలిచి, తన మూడవపాదాన్ని బలిచక్రవర్తి శిరస్సున మోపి అతనిని పాతాళానికి పంపినది ఈ రోజే.

ఈ సంక్రాంతి పండుగను మూడురోజులపాటు చేసుకోవటం అనాదిగా మనకు వస్తున్న ఆచారం. అవి భోగి, సంక్రాంతి, కనుమ. భోగిపండుగ అనగానే మనకు స్ఫురించేవి భోగిపళ్ళు, భోగిమంటలు. ఆవుపేడతో పిడకలను చేసి యజ్ఞదేవతలను తలుస్తూ, యజ్ఞకుండంగా భావిస్తూ, మా పాపాలను పరిహరించి ప్రక్షాళనగావించి మా జీవితాలను ధర్మమార్గంలో నడిపించమని వేడుకుంటూ, హారతికర్పూరం వేసి వెలిగించి మంట వేస్తారు. ఈ నెగడు వేదకాలం ఋషులు తాము సంవత్సరారంభంలో వ్రేల్చిన ఆగ్రహాయణి– హోమాగ్నికి ప్రతిరూపమే. ఎందువల్ల నంటే యజ్ఞం పూర్తయిన తరువాత యజ్ఞవిభూతిని సమిధ నుంచి తీసి నుదుట, గుండెలమీద భక్తితో రాసుకుంటూ సకల దోషాలు నివారించటానికి ఉపయోగిస్తారు. అలానే ఈ భోగి మంటల మసి పిల్లలకు, పెద్దలకూ కూడా దైవప్రసాదంగా భావించి నుదుట ఉంచుతారు.



అంతేకాకుండా ఈ “భోగి” అన్నపేరుకు అర్థం ఏమిటి అని ఆలోచిస్తే సకల భోగములను ఇచ్చే యజ్ఞాగ్నియే ఈ భోగిమంట అని తెలుస్తుంది. భోగములను కోరువారు అగ్నిని పూజించాలని సూచించే ఈ శ్లోకం గమనించదగినది.

ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్
శ్రియమిచ్ఛేత్ హుతాశనాత్

శ్రియం అంటే సిరిని, సంపదనూ, భోగమును ఇచ్చే అగ్ని భోగిమంటగా వ్రేల్చి అందులో అన్నీ వేసే సర్వ సమర్పణ హెూమం. యజ్ఞార్పణంగా చేసి తిరిగి అన్నింటినీ పొందే విశ్వజిత్ (ప్రపంచాన్ని గెలుచుకునే) యాగంగా బలిచక్రవర్తి చేసిన ప్రాచీన ఇతిహాసాన్ని ఇది గుర్తుకు తెస్తుంది ఈ భోగిమంట వేడుక.

ఇక భోగిపళ్ళ వేడుక. ఇవి చిన్నారులను పెద్దలంతా దీవిస్తూ శిరస్సుపై పోసే రేగుపళ్ళ వేడుక. సంస్కృతంలో రేగుచెట్టును బదరీవృక్షం అంటారు. విష్ణువు ప్రాధాన్యమైన పండుగ కనుక రేగుపళ్ళు, పువ్వులు, శనగలు, చిల్లరపైసలు పిల్లల తలలపై పోస్తూ విష్ణువు వంటి జీవితం చిన్నారులకు రావాలని దీవిస్తూ పెద్దలంతా కలిసి చేసే పండుగ. ఏ ఇంటనైనా సంతానం లేనివారు విష్ణుమూర్తికే భోగిపళ్ళు పోస్తారు. ఈ ఉత్సవానికి సంధ్యాసమయం అనుకూలం. ముత్తైదువులకు శనగలు, తాంబూలం పంచటం జరుగుతుంది.

రెండవరోజైన సంక్రాతి నాటి ముఖ్యమైన ఆధ్యాత్మిక విధులు మూడు. అవి స్నానం, పూజ, దానం. స్నానానికి ప్రత్యేకమైన ప్రాముఖ్యత చెప్పబడినది. సంక్రాంతి పర్వదినాన సూర్యోదయానికి ముందే నల్లనువ్వులపిండితో శరీరానికి నలుగు పెట్టి, నువ్వులనూనె తలకు పట్టించి తలస్నానం చేయాలి.

నువ్వులదానం, నల్లనువ్వులతో హోమం చేయుట, తెల్లనువ్వులు పంచదారతో, పాలతో కలిపి సేవించటం వల్ల శనిదోష నివృత్తి, ఆయుర్వృద్ధి, అకాలమృత్యుదోషం నివారింపబడతాయని శాస్త్రవచనం.



మొండి పట్టుదల, వాడి వేడి చర్చ అజ్ఞానానికి తార్కాణం

నువ్వులతో శాంతిహోమం, మృత్యుంజయహోమం, నారసింహ సుదర్శనమంత్రాలతో సంక్రాంతినాడు హోమం చేయాలి. తెల్లనువ్వులతో దేవతలకు, నల్లనువ్వులతో పితృదేవతలకు తర్పణం చేయాలి. ఈ సంక్రాంతి పుణ్య దినాన శివునకు ఘృతాభిషేకం చేయుటవలన మాఘ పుణ్యం కలుగుతుంది. దీనికి గట్టిగా పేరిన నెయ్యిని ముద్ద చేసి శివలింగముపైన ఉంచాలి. దీనిపై కరిగిన నేతితో పంచసూక్తముల సహితంగా నేతితో అభిషేకం చేయాలి.

పౌష్య, మాఘమాసముల సంధిలో వచ్చే అమావాస్యనాడు సూర్యుడు మకరరాశిలో ప్రవేశం చేస్తే అట్టి సంక్రమణ కాలమే అర్థోదయకాలం. పగటిపూట వస్తే ప్రశస్తం. మధ్యాహ్నమునకు పూర్వమే సంభవించే అర్థోదయకాలమే పూర్తి ఫలితాన్నిస్తుంది. ఆ సమయంలో ఏ కొంచెం దానమిచ్చినా మేరుపర్వతమంత పుణ్యమిస్తుంది. అర్థోదయకాలంలో 'ఏ బ్రాహ్మణుడైనా బ్రహ్మతో సమానం', 'ఏ పుణ్య జలమైనా గంగతో సమానం' అని శాస్త్రవచనం, వేదవచనం.

ఈ సంక్రాంతి పుణ్యకాలంలో పాయసదానం, కాంస్యపాత్రదానం, సువర్ణలింగదానం ప్రశస్తమైనవి. బ్రహ్మ, విష్ణు, శివ ప్రతిమలను బంగారం లేదా వెండి లేదా కంచుతోగాని చేసినవి దానం చేయుట వలన సమస్త పృథ్విని దానం చేసిన ఫలితం కలుగుతుంది. పెరుగును దానం చేయుటవలన సంతానసౌఖ్యం కలిగి వంశం సక్రమ మార్గంలో పయనించి కీర్తి గడిస్తారు. వస్త్రదానం, మజ్జిగ, కంబళ్ళు దానం చేయుటవలన విశేషఫలితాలు సమకూరుతాయి. ఈ దానాలు చేసిన తరువాత సజ్జ రొట్టెలు తినటం, పేరిన నేతితో చేసిన వంటకములు తినటం, పెద్దలకు మ్రొక్కి వారి ఆశీర్వాదాలు పొందుట శ్రేయస్కరం.

ఇక స్త్రీలకు విశేష సౌభాగ్యాలనిచ్చే పుణ్యవ్రత ఆచరణ విశేషం. అఖండసౌభాగ్యాలనిచ్చే పసుపు కుంకుమల దానం ప్రశస్తం. ఉదయమే గౌరీదేవికి, లక్ష్మీదేవికి, సరస్వతికి విధిపూర్వకంగా పూజ చేసుకుని, పసుపు, కుంకుమ, పండు తాంబూలాలతో మంత్రపూర్వకంగా ధారపోసి, వాటిని సౌభాగ్యవతులకు పంచిపెడతారు. గృహమంతా నిత్యవసంతంతో సుఖసంతోషాలతో సౌభాగ్యప్రదంగా ఉండాలని త్రిశక్తిరూపిణిని ప్రార్థిస్తూ చేసే విశేషదినం.

గొబ్బిళ్ళసందడి సంక్రాంతిపండుగ వేడుకలలో మరొక ప్రధానమైనది. కన్నులు కళకళలాడే లక్ష్మీకళతో అలరారే "గొబ్బిళ్ళు" గడప గడపకూ అమర్చి శోభనిస్తూ స్వాగతం చెబుతాయి. సంధ్యాసమయంలో ఆవుపేడతో కలిపిన జలంతో వాకిలిలో కల్లాపి జల్లి రంగవల్లులు తీర్చిదిద్ది, వాటి మధ్యభాగంలో ఆవుపేడతో వృత్తాకారంలో 3, 5, 7, 9 క్రమంలో తయారుచేసి బంగారం, వెండి, రాగి పళ్ళెంలో లేదా తమలపాకులో పెట్టి పసుపు, కుంకుమలతో, గుమ్మడిపువ్వులతో అలంకరిస్తారు. మామిడితోరణాలు గుమ్మానికి కడతారు. కన్యలు అందరూ ఆ గొబ్బిళ్ళ వాకిటిలో చేరి భూదేవికి పూజ చేస్తారు. ఇది గోవర్ధన పర్వతానికి ప్రతీకగా గొబ్బిళ్ళు పేర్చి పంటలతో, పూవులతో



సస్యలక్ష్మిగా ఉన్న ఋతువును సూచించేవిధంగా గుమ్మడి పూవును, బీరపూవును అలంకరిస్తారు. గుమ్మడికాయలో శ్రీరామ తత్త్వం గోచరిస్తుంది. కనుక ఎర్రగుమ్మడిని శ్రీరామునితో పోల్చి విశేషంగా గొబ్బిళ్ళను అలంకరిస్తారు.

సంక్రాంతిరోజున బలిచక్రవర్తికి కూష్మాండదానం చెయ్యవలసినదిగా శాస్త్రం చెబుతోంది. మన ఋషులు ఈ ప్రక్రియను లక్ష్మీ అనుగ్రహంగా భావించి మనకు ఈ సంప్ర దాయాన్ని అందించారు. ఇదే తత్త్వాన్ని శ్రీసూక్తంలో "నిత్య పుష్టాం కరీషిణీం" అని చెప్పబడింది. అందరినీ కన్నతల్లిగా భావించే భూదేవిని పూజించి సంపదనీయవే అంటూ కన్యలు ఆడిపాడి వేడుకుంటే ఆ దేవి కరుణిస్తుందని నమ్మకం.

**గొబ్బియల్లో- గొబ్బీయల్లో- సఖియా వినవే**
**సుబ్బీ గొబ్బెమ్మా సుబ్బీ గొబ్బెమ్మా!**
**మొగలి పువ్వంటి మొగుడినీయవే!**
**చామంతి పువ్వంటి చెల్లెలినియ్యావే!**
**కలువ పువ్వంటి కొడుకునియ్యావే!**
**అరవింద పువ్వంటి అన్ననియ్యావే...**

అంటూ ఆనందంతో నృత్యం చేస్తూ పాట పాడుతారు. ఈ ప్రాచీన సంప్రదాయాలు, వేడుకలూ ఇప్పటి యంత్రయుగం ఇనుపకోరలలో నలిగిపోకుండా గ్రామాలలో ఇంకా పాటిస్తున్నారు. భావితరాలకు మన సంప్ర దాయసంపదను వారసత్వంగా అందిస్తున్నారు.

సంక్రాంతి ఉత్సవాలలో మరొక ముఖ్యమైన దృశ్యం హరికీర్తన. హరిదాసులు శిరస్సుపై బంగారంవంటి కలశాన్ని పెట్టుకుని హరికీర్తనలు ఆలపిస్తూ పల్లెంతా తిరుగుతూ ఉంటే, అందరూ ఇచ్చే బియ్యాన్ని కీర్తన కొనసాగిస్తూనే వంగి కలశంలోకి అందుకుంటూంటారు. చేతిలో చిడతలు, కాళ్ళకు గజ్జెలు ఘల్లుఘల్లుమని మ్రోగగా భక్తి పారవశ్యంతో 'హరిగోవిందా' అంటూ భక్తిని ప్రచారం చేస్తారు. ఈ గానానికి తన్మయులైన గృహస్థులు ఆనందంగా క్రొత్తపంటలతో వచ్చిన ధాన్యాన్ని లేక బియ్యాన్ని దానంగా దోసిటితో పోస్తారు. ధర్మమార్గంలో జరిగే ఈ ప్రక్రియ అద్భుతంగా ఉంటుంది. ఇది భిక్షాటన కాదు. రామదాసుల వారు ఈ మనోహర దృశ్యాన్ని ఆచంద్రార్కం నిలిచి ఉండేలా తన కృతులలో కీర్తించారు మనోహరంగా.

**హరిదాసు వెడలే, ముచ్చట గని ఆనందమాయె! దయాళో!**
**రామ ధ్యానముతో మంచి గానముతో మేను దానమొసంగుచు**
**హరిదాసులు వెడలే, ముచ్చటగ! ఆనందమాయె! దయాళో**
**చక్కని హరి చేత చిక్కితిమని సొక్కుచు....**

అంటూ పాడే హరిదాసులను భక్తితో గౌరవించే నిండుగుండెలు నేడు కరువైనాయి. మకరసంక్రాంతినాటి "మకరం"లోని అధిదేవతార్చన ప్రధానం. అందుకే పోతన గారు మనసార హరికీర్తన చెయ్యని వాని జన్మవ్యర్థమని --

**నోరు నొవ్వంగ హరికీర్తి నుడువదేని**
**కలుగనేటికి? తల్లుల కడుపు చేటు!**

ఆ జన్మ వ్యర్థం అని తల్లి కడుపు బరువని నిరసన తెలిపాడు. జన్మసార్థక్యం కొరకు హరికీర్తన గావించుమని పరోక్ష వచనం.

కనుమ విశేషాలు తెలుసుకుందాం. తెలుగులోగిళ్ళు వ్యవసాయప్రధానప్రాంతాలు. కనుమపండుగ వ్యవసాయదారుల పండుగ. సంప్రదాయాన్ని గౌరవించే ప్రతివారు పల్లెలకు తరలిపోతారు. ఆ నాటి అందచందాలు పల్లెటూళ్ళకు పట్టుగొమ్మలు. దీనినే అల్లుళ్ళపండుగ అని కూడా అంటారు. పంట చేతికొచ్చిన సందర్భంలో అల్లుళ్ళు అత్తవారింట తిష్ఠవేస్తారని ఛలోక్తి.

వ్యవసాయప్రక్రియలో పశువులు ప్రధానం కనుక వాటిని అలంకరించి ఊరి పొలిమేరల చుట్టూ తిప్పటం జరుగుతుంది. భూతప్రేతాదులు తమ పంటలను పాడుచేయ రాదనే భావంతో ఈ పొలిని చల్లే ఆచారం వచ్చింది.

ఈ విధంగా మూడురోజులు నూతనవస్త్రాలు ధరించి, యథాశక్తి పూజలు, హోమాలు సలిపి, దానాలు చేసి, పశువులను అలంకరించి అందరితో కలసి యథాశక్తి పిండివంటలు భుజించి అత్యంత ఆనందంగా గడుపుకుని, సంవత్సరమంతా పండుగలా గడవాలని కోరుకుంటారు.



అజ్ఞానం అమాయకత్వం కాదు; అదో పాపం



# సందేహాలు - సమాధానాలు

- డా॥ సముద్రాల లక్ష్మణయ్య

**1) ధర్మాన్ని నమ్ముకొని రామాయణంలో శ్రీరాముడు, భారతంలో పాండవులు చివరివరకు కష్టాలుపడ్డారు. ఇది గ్రహించిన మానవులు ధర్మాన్ని ఎంతవరకు అనుసరించగలరు?** *-డా॥ యస్.రామజోగి, పిఠాపురం.*

ఈ ప్రశ్న చాలా ఆసక్తిదాయకమైనది. సావధానంగా దీనికి సమాధానం గ్రహించాలి. ధర్మాత్ములు కష్టాలపాలయినట్లు పురాణకథలు వివరిస్తున్నాయి. 'రామో విగ్రహవాన్ ధర్మః' - రాముడు మూర్తీభవించిన ధర్మంగా ప్రసిద్ధి వహించాడు. అట్టి రామునికి కష్టాలు ఎందుకు వచ్చాయి అన్నది సందేహం. ఒకవేళ రాముడు దేవుడు కాబట్టి బుద్ధిపూర్వకంగానే కష్టాలపాలయ్యాడు అంటే ధర్మరాజాదులైన ఇతరుల సంగతి ఏమిటి? వారు ధర్మమయులుగా వర్ణించబడినారు గదా! ఒక వ్యక్తి ఏ కష్టం లేకుండా జీవితమంతా హాయిగా గడిపితే అతని ధర్మనిష్ఠ ఎట్టిదో లోకం గుర్తించదు. అలాంటి వారెందరో కాలగర్భంలో కలిసిపోయారు.

కష్టాలలో ధైర్యం కోల్పోక ధర్మం విడనాడక ఉన్నవారే మహనీయులుగా చరిత్రలో నిల్చిపోయారు. రాముడు పితృవాక్యపరిపాలన అనే ధర్మం ఆచరించకుండా తండ్రిపై తిరుగుబాటు చేసి అయోధ్యానగరాన్ని చేజిక్కించుకొని ఉంటే మన మీనాడు ఆయనను దేవునిగా పూజిస్తామా? హరిశ్చంద్రుడు ఎట్టి పరిస్థితులలోనూ సత్యం తప్పలేదు కాబట్టే ఈరోజు 'గాంధీ'వంటి మహాత్ములకు ఆదర్శమైనాడు. ప్రహ్లాదుడు తండ్రిచే పెక్కుకష్టాలు పడడంవల్లనే భక్తాగ్రేసరుడుగా ప్రశస్తికెక్కాడు. సీత, సావిత్రి, దమయంతి మున్నగువారి చరిత్రలు ఇట్టివే. అందుచే ధర్మాత్ములకు 'బాధే సౌఖ్యమనే భావన' ఉంటుంది. ఆపదల్లో ధైర్యం వీడని వాడే ధీరుడు.

భాగవతంలో విష్ణువు బ్రహ్మతో ఇలా అంటాడు. 'ఎవ్వని గరుణింప నిచ్ఛించితిని వాని, యఖిలవిత్తంబు నేన పహరింతు' - అంటే ధర్మాత్ముడైన భక్తుణ్ణి ధనహీనుణ్ణి చేసి భగవంతుడు పరీక్షిస్తాడు. ఆ పరీక్షలో నెగ్గడమే ధర్మరహస్యం.

ధర్మాత్ములు తాత్కాలికంగా బాధపడినా చివరికి ఇహపరలోకాలలో తరగని ప్రతిష్ఠను ఆర్జిస్తారు. ఈ సత్యాన్ని పురాణకథలు మనకు బోధిస్తున్నాయి. కష్టపడడం కూడా ధర్మాచరణలో ఒక భాగమే. అందుచేత నాటి మహనీయుల ధర్మాచరణ మానవాళికి ఎప్పటికీ అనుసరణీయంగానే ఉంటుంది.

ఇందులో మరొక రహస్యమున్నది. ధర్మాత్ముడైనవాడు ఎంత పుణ్యం చేసినా, అతడు పూర్వకర్మఫలితంగా దుఃఖం పూర్తిగా అనుభవించేవరకూ పుణ్యఫలమైన సుఖం కలుగదు. పాపాత్ములు చేసిన పాపం వెంటనే దుష్ఫలం ఇవ్వకున్నా కాలక్రమంలో అతని పుత్రులు, పౌత్రులు మున్నగువారిలో ఆ ఫలం కనిపించవచ్చు. భారతం శాంతి పర్వంలో ఈ సంగతి వివరించబడివున్నది.

**కదాచిత్సుకృతం తాత! కూటస్థమివ తిష్ఠతి,**
**మజ్జమానస్య సంసారే యావద్దుఃఖా ద్విముచ్యతే.**
**పాపంకర్మ కృతం కించిత్ యది తస్మి న్న దృశ్యతే,**
**నృపతే! తస్యపుత్రేషు పౌత్రేష్వపిచ నప్తృషు.**

**(భారతం-12-137-19)**

ఈ వివరణను బట్టి ధర్మాత్ములు కొంతకాలం కష్టపడడం, అధర్మపరులు సుఖపడడం సంభవిస్తాయని స్పష్టమవుతున్నది. ఈ విషయం సూక్ష్మదృష్టితో నిశితంగా చూచిన వారు సత్యం గ్రహించగలరు.

గత
సంచిక
తరువాయి
భాగం..

ధారావాహిక-09

# శ్రీకృష్ణభగవద్విజయం

- డా॥ వుయ్యూరు లక్ష్మీనరసింహారావు, 89198 32285

**చినసాంబయ్య :** అయ్యబాబోయ్! అంత పని మాత్రం చెయ్యకండయ్యా వసంతయ్యగారూ! ఆనాగలి, ఆరోకలి, ఆబాదుడు, ఆమోదుడు... అవన్నీ పగవాళ్లు అందుకోవలసిన విందులు.

**పెదసాంబయ్య:** దివ్యదృష్టితో మావాడికి దిమ్మతిరిగింది. తాగింది దిగింది. ఇక బాగుపడతాడులే వసంతయ్య గారూ!

**చినసాంబయ్య :** అయ్యా వసంతయ్యగారూ! నాకొక చిన్న సందేహం.

**వసంతకుడు :** నీ దేహానికి సందేహం కూడానా? వెడల గ్రక్కు.

**చినసాంబయ్య :** మనప్రభువులు బలరామదేవులు కోటలో మాంచిసరుకు పుచ్చుకుంటారటగా నిజమేనా?

**వసంతకుడు :** ఒరే కుంకా! వారు పుచ్చుకున్నా లోకం మెచ్చుకుంటుందిరా! ఎందుకంటే వారు చేసేపనులన్నీ లోక కల్యాణసంధాయకాలు. అందుకే వారు లోకోత్తర పురుషులు.

**చినసాంబయ్య :** అట్టాగా!

**వసంతకుడు :** మఱి! మనబలరామదేవులు నాగలితో యమునానదిదారినే చీల్చి, ప్రక్కకు తెచ్చి కర్షక భూముల కందించారు. వ్యవసాయాన్ని పెంచి అధి కాహారోత్పత్తిని సాధించారు. కర్షక జీవితాలలో ఆనంద చంద్రికలు కురిపించారు. ఆపాతకథలు అప్పుడే మర్చిపోతే ఎలాగురా? అసలు మనకన్నయ్య ధరించిన వేణువు, చక్రము, బలరామయ్య ధరించిన నాగలి, రోకలి ఇవన్నీ వ్యవసాయ చిహ్నాలు రా! ప్రపంచంలో ఆహారోత్పత్తికి, ఆహార సంరక్షణకు ప్రాధాన్యమివ్వాలని చెప్పటానికే ఆ చిహ్నాలు ధరించారు రా! ఎప్పుడైతే ఆహారానిది అగ్రస్థానమయిందో అప్పుడే ప్రభుత్వ ప్రణాళికలన్నీ వ్యవసాయరంగానికి చుట్టూ తిరగవల సిన అవసరమేర్పడింది. వ్యవసాయరంగాన్ని చిన్న చూపుచూస్తే ప్రభుత్వపతనం తప్పదు. మన బలరామ కృష్ణయ్యలు ముందుచూపు కలిగిన మేధావులు గనుక కర్షకవర్గాన్ని కాపాడుకుంటున్నారు. వారి చల్లని చూపులవల్లనే కదరా మీరు అలా పండించుకుని ఇలా వ్యాపారం చేసుకుంటున్నారు? ఈ విషయాలన్నీ మర్చిపోయి కోటలో బలరాములవారు మంచిసరుకు పుచ్చుకుంటారటగా- అని అడగటానికి సిగ్గులేదురా?

**చినసాంబయ్య :** పొరపాటయింది మన్నించండి వసంతయ్య గారూ!

**వసంతకుడు :** వారు పుచ్చుకుని యమునానదినే చీల్చారు. నీవేమి చీల్చగలవురా పీల్చటం తప్ప. వెఱ్ఱివిమర్శలు మానుకుని బుద్ధిగా వ్యాపారం చేసుకుంటూ వారి అనుగ్రహాన్ని సంపాదించుకోండి! వస్తా.

అని వసంతకుడు గంభీరంగా సాగరతీరంవైపు సాగిపోయాడు.

**చినసాంబయ్య :** జయతాత్ మహాబలః బలరామదేవః ।

**పెదసాంబయ్య:** జయతాత్ పరమాత్మా శ్రీకృష్ణదేవః ॥

అంటూ జయవాక్యాలు పలికేసరికి వీధిలో జనులు కూడా వికసితవదనాలతో శ్రుతి కలిపారు.

\- - - - - - - -

సాల్వరాజు బ్రహ్మదత్తుడు అతని భార్యలు అంతః పురంలో దిగులుగా కూర్చున్నారు. రాజుమిత్రుడు మిత్ర



అజ్ఞానం ఎప్పుడూ మార్పుకు భయపడుతుంది

సహుడు అతనిభార్య ప్రవేశించారు. రాజు చేయి చూపగా ఆసనాలలో కూర్చున్నారు.

**మిత్రసహుడు :** మహారాజా! వెంటనే రమ్మన్నారట!

**బ్రహ్మదత్తుడు :** అవును మిత్రమా! అంబికానాధుణ్ని ఆరాధించటానికి హంసడిభకులు ఆరాజతాద్రికి వెళ్లి అయిదు సంవత్సరాలు కావస్తున్నది. కొడుకుల రాక కోసం చూచి చూచి మా కన్నులుకాయలు కాస్తున్నాయి. వియోగినీవ్రతంలో మా కోడళ్లు కృశించిపోతున్నారు. సాల్వసామ్రాజ్యమంతా నాకు శూన్యంగా గోచరిస్తున్నది మిత్రమా!

**మిత్రసహుడు :** మహారాజా! తమరే ఇలా అధైర్యపడితే ఇక మహారాణులకు ధైర్యం చెప్పేదెవరు? దిగులు దిగమింగి ధైర్యం వహించండి! పార్వతీవల్లభుడు పరమ కరుణాధురీణుడు. త్వరలోనే రాజకుమారుల ననుగ్రహిస్తాడు. నామాట నమ్మండి!

**పెద్దరాణి :** మన రాజధానిలో అడుగడుగునా శివాలయాలున్నాయి. కోటలో ప్రత్యేకమందిరముంది. ఆచేసే తపస్సేదో ఇక్కడ చేస్తే ప్రతిదినం మేము బిడ్డల్ని చూచుకోవటానికి వీలుండేది.

**చిన్నరాణి :** మహాదేవుణ్ణి ఆరాధించటానికి మంచు కొండలకే వెళ్లాలా? ప్రత్యణువులోనూ పరమేశ్వరుడున్నాడని దర్శించిన మహర్షులు ప్రబోధిస్తుంటే ఇలా ఇల్లు విడిచి ఎక్కడికో వెళ్లి తపస్సు చేస్తుంటే మాతృమూర్తుల హృదయాలు విలవిల్లాడవా బ్రాహ్మణోత్తమా! మీ పుత్రుడు జనార్దనుడు మీయింటిలోనే శ్రీమహావిష్ణువు నారాధిస్తుంటే మీరెంత ఆనందిస్తున్నారు? ఆ ఆనందాన్ని మాకందించలేకపోయారు మాకుమారులు.

**మిత్రసహునిభార్య:** అలా అనకండి మహారాణీ! మీకు దూరంగా ఉండటం వారికి మాత్రం సంతోషదాయకమా? కఠోరలక్ష్యాలు సాధించటంకోసం కొంత కాలం కన్నవారికి, కట్టుకున్నవారికి దూరంగా ఉండాలనుకున్నారు రాజకుమారులు. మీరు సహనం వహించటమే వారికి సహకరించటం.

**మిత్రసహుడు :** నిజం నిజం మహారాజా! ప్రత్యేకశక్తులు సాధించటానికి ప్రత్యేక తపస్సుకు పూనుకోవటం సంప్రదాయం. ప్రత్యేక తపస్సుకోసం ప్రత్యేక ప్రదేశాన్ని ఎన్నుకోవటం కూడా అందులో భాగమే. ఎవరికి నచ్చిన ప్రదేశాలను వారు ఎన్నుకోవటం ఋషులలోను, యోగులలోను, గృహస్థులలోను చూస్తూనే ఉన్నాం. రాజకుమారులు రాజశేఖరుణ్ణి గుఱించి రజతాద్రిమీద తపస్సు చేయాలని సంకల్పించుకున్న సంగతి మనకు తెలిసిందే. ఆనాడు మీరు అంగీకరించారు. ఈనాడు ఆలస్యాన్ని భరించలేక ఆవేదనపడుతున్నారు. కన్నవారికి ఇది సహజమే. ఐనా త్వరలో ఆ అన్నదమ్ములు పరమశంకరుని కరుణాకటాక్షాలకు నోచుకుని వచ్చినప్పుడు మీ రీ బాధనంతా మర్చిపోయి వేయింతలు సంతోషిస్తారు మహారాజా!

**బ్రహ్మదత్తుడు :** మీదంపతుల అనునయవాక్యాలు నమ్మే కదా బ్రాహ్మణాగ్రణీ! ఇన్నాళ్లు మాప్రాణాలు నిలుపుకున్నాము. ఈ మధురవాక్యాలు వినటానికే కదా మాటిమాటికి మిమ్మల్ని పిలిపిస్తున్నాము. మీరు మాకు చిరకాలమిత్రులూ, మా పౌరులూ కావటంచేత పదేపదే ఇలా పిలిపించుకుంటూ మీదినచర్యలకు అంతరాయం కలిగిస్తున్నాము మిత్రమా!

**మిత్రసహుడు :** ఎంతమాట మహారాజా! మాకు మిత్రులు, ప్రభువులు అయిన మిమ్మల్ని ఓదార్చటం కూడా మాదినచర్యలో భాగమే. మీరెప్పుడు పిలిస్తే అప్పుడు వచ్చి మాకు తోచిన హితవచనాలు చెప్పటానికి మేము సర్వసన్నద్ధంగా ఉన్నాం. మీ ఆజ్ఞావచనాలు మాకు శిరోధార్యాలు.

**బ్రహ్మదత్తుడు :** ధన్యులం మిత్రమా! ధన్యులం.

**పెద్దరాణి :** కొడుకులు అటు తపస్సుకు వెళ్లి తిరిగి రాలేదన్న చింత, కోడళ్లు ఇటు వియోగినీవ్రతంలో భూశయనం చేస్తూ కృశించి పోతున్నారన్న చింత మమ్మల్ని కలవరపఱుస్తున్నాయి. అయినా అదేమి వింతోగాని మీదంపతులచెంత కొంత ప్రశాంతత లభిస్తున్నది.

*(ఇంకా ఉంది)*

# శ్రీ వైకుంఠవాసా గోవిందా!!

– శ్రీమతి ఈతకోటి మునెమ్మ ముత్తుక్రిష్ణన్
7674893502

కలియుగ వైకుంఠమైన తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠఏకాదశి మహావైభవంగా నిర్వహింప బడుతుంది. ఈ ఏకాదశికి ముందురోజు అనగా దశమినాటి రాత్రి ఏకాంతసేవానంతరం బంగారువాకిళ్లు మూసేస్తారు. పిదప తెల్లవారుజామున వైకుంఠఏకాదశినాడు సుప్రభాతం మొదలుకొని మరునాడు ద్వాదశి రాత్రి ఏకాంతసేవవరకూ శ్రీవారి గర్భాలయానికి ఆనుకొని ఉన్న ముక్కోటిప్రదక్షిణ మార్గాన్ని తెరచి ఉంచుతారు. ఈ ఏకాదశీ, ద్వాదశీ రెండు రోజులూ శ్రీవారి దర్శనానంతరం భక్తులు ముక్కోటి ప్రదక్షిణ మార్గంలో వెళతారు. ఈ ముక్కోటిప్రదక్షిణ ప్రవేశద్వారం పర్వదినంనాడు రంగురంగుల విద్యుద్దీపాలతో, పూలమాలలతో మనోహరంగా అలంకరింపబడుతుంది. శ్రీ స్వామివారికి అత్యంత సమీపంలో ఉన్న ఈ ప్రదక్షిణమార్గంలో దర్శనానంతరం వెళ్లిన భక్తులు, ఒక విశిష్టదివ్యానుభూతిని అనుభవిస్తారు.

**విశేషపూజాదులు:** వైకుంఠఏకాదశినాడు ఉభయనాంచారులతో మలయప్పస్వామి సర్వాలంకారభూషితుడై తిరువీథుల్లో స్వర్ణరథంపై ఊరేగుతారు. ఆనాడు శ్రీవారి సన్నిధిలో "రాపత్తుతొడక్కం" జరిగి, శ్రీనమ్మాళ్వారువారు సాయించిన భగవద్విషయం అనే అపరనామధేయకమైన "తిరువాయ్‌మొళి" అనే దివ్యప్రబంధంలోని నాల్గవ ఆయిరమ్ అధ్యయనం ప్రారంభిస్తారు. ఈ ఉత్సవాన్ని "వైకుంఠద్వారస్థ భగవదాలోకనమహోత్సవం"గా కీర్తిస్తారు. ఆ కోవలో వైకుంఠఏకాదశి ప్రాశస్త్యం తెలుసుకుందాం.

శ్రీహరికి ప్రీతికరమైన వ్రతాలతో ఏకాదశీవ్రతం చాలా శ్రేష్ఠమైనది. వాటిల్లో వైకుంఠఏకాదశి మరింత విశిష్టమైనది. దీన్నే ముక్కోటిఏకాదశి అని కూడా అంటారు. ఈ రోజున వైష్ణవాలయాల్లో ఉత్తరద్వారమును తెరుస్తారు. దీన్నే వైకుంఠద్వారదర్శనమంటారు. తిరుమల శ్రీవారిఆలయంలో ఈ పర్వదినం మహావైభవంగా జరుగుతుంది.

"జంతూనాం నరజన్మ దుర్లభమ్" అన్నారు. 84 లక్షల జీవరాసులలో దుర్లభమైన ఈ నరజన్మ విశిష్టతను గుర్తించి వర్తించాలి. మానవత్వము పూర్ణత్వమును చెందాలి. అందుకు మానవుడు తన జీవితకాలంలో పూర్ణగుణాలను వరించి పూర్ణాకారాన్ని ధరించాలి. ఇటువంటి పూర్ణత్వమునకే 'వైకుంఠము' అని పేరు. కుంఠము అనగా 'లోపించుట' లేదా 'కుంటుపడుట' అని అర్థం. అవిలేని స్థితియే వైకుంఠం.

'ఏకాదశ' అనగా పదకొండు. అవి ఐదు కర్మేంద్రియములు, ఐదు జ్ఞానేంద్రియములు, మనస్సు, ఈ ఏకాదశముల ఏకత్వమే పూరిపూర్ణస్థితి. అందుకే మనము 'వైకుంఠఏకాదశి'ని ప్రతి సంవత్సరం జరుపుకొంటున్నాం.

ఏకాదశీదినం శ్రీమహావిష్ణువుకు మిక్కిలి ప్రీతికరమైనది. కనుకనే ఏకాదశిని 'హరివాసరం' అన్నారు పెద్దలు.

24 ఏకాదశుల్లోనూ – సౌరమాసంలో ప్రశస్తమైన ధనుర్మాసంలో (మార్గశిర పుష్యమాసాల్లో) వచ్చే శుక్ల పక్ష ఏకాదశిని "వైకుంఠఏకాదశి"గా కీర్తిస్తున్నాం. దీన్నే 'ముక్కోటిఏకాదశి' అని అంటారు. సౌరమాసం, ధనుర్మాసం

**2020,
జనవరి 6వ తేదీన
వైకుంఠఏకాదశి
సందర్భంగా...**

కాగా, అందువచ్చే "వైకుంఠఏకాదశి" చాంద్రమానానుసారిణి శ్రీమన్నారాయణునికి సూర్యుడు కుడికన్ను, చంద్రుడు ఎడమకన్ను. కన్నులు వేర్వేరుగా ఉన్నా దృష్టి ఒక్కటే అయినట్లు, సూర్యచంద్రులు వేర్వేరుగా కన్పిస్తున్నా కాంతితత్త్వం ఒక్కటే అనే మహత్తత్త్వాన్ని ఈ పండుగ సూచిస్తుంది.

వైకుంఠఏకాదశి సామాన్యంగా మార్గశిరపుష్య మాసాల్లో వస్తుంది. రావణుని బాధలు తాళలేక దేవతలు బ్రహ్మను వెంటబెట్టుకొని వైకుంఠం చేరి, హరివాసరమైన మార్గశిర శుక్లఏకాదశినాడు శ్రీహరిని ప్రార్థించి, తమ బాధను విన్నవించుకున్నారు. స్వామి బ్రహ్మాదులకు దర్శనమిచ్చి, అభయ మివ్వడం జరిగింది. కాగా దేవతల బాధ నివారణానికి ఈ ఏకాదశియే మార్గం చూపింది.

**మరో వృత్తాంతం:** మధుకైటభులను మహావిష్ణువు సంహరించినపుడు వారు దివ్యరూపాలు ధరించి, దివ్యజ్ఞానాన్ని పొంది, దేవా! వైకుంఠంవంటి మందిరాన్ని నిర్మించి, ఏకాదశీపూజచేసి, నిన్ను దర్శించి, నమస్కరించి, ఉత్తరద్వార మార్గంలో నిన్ను సమీపించేవారికి, శ్రీ'వైకుంఠప్రాప్తి' కల్గించమని ప్రార్థించారు. స్వామి అనుగ్రహించాడు. దీనికి 'మోక్షోత్సవదినం' అని కూడాపేరు. ముక్కోటిదేవతలకు బాధలను నివారించిన ఏకాదశి కనుక 'ముక్కోటి ఏకాదశి' అని పేరు. వైకుంఠదర్శనం కల్గిస్తుంది కనుక 'వైకుంఠ ఏకాదశి', భగవద్దర్శనం కావించేది కనుక 'భగవదవ లోకనదినం' అని పేర్లు.

మార్గశిరమందలి శుక్లఏకాదశి– 'మోక్షదైకాదశి'. పుష్యశుక్ల ఏకాదశి 'పుత్రదైకాదశి'గా పేర్లుగాంచాయి. సకల పాపాలనుండి విముక్తి చెంది, శ్రీకైవల్యప్రాప్తితో జన్మరాహిత్యం చెందడానికి వైకుంఠఏకాదశీవ్రతాన్నిమించిన వ్రతాచరణలేదు.

దేవదానవులు ఈ ఏకాదశిరోజున ఉపవాసంతో రాత్రింబవళ్ళు శ్రమించి, క్షీరసాగరాన్ని మథించగా ద్వాదశినాడు మహాలక్ష్మి సముద్రంనుండి వెలువడివచ్చి, దేవతలకు ప్రత్యక్షమై, వారిని అనుగ్రహించింది. నాటినుండి ఏకాదశినాడు పగలూ, రాత్రి ఉపవాసంతో ఉండి, జాగరణచేసి,



తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

## దేవునికడప శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం

2020, జనవరి 25 నుండి ఫిబ్రవరి 04 వరకు



| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 25-01-2020 | శని | దీక్షా తిరుమంజనం | సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ |
| 26-01-2020 | ఆది | తిరుచ్చి, ధ్వజారోహణం | చంద్రప్రభ వాహనం |
| 27-01-2020 | సోమ | సూర్యప్రభవాహనం | పెద్దశేష వాహనం |
| 28-01-2020 | మంగళ | చిన్నశేషవాహనం | సింహ వాహనం |
| 29-01-2020 | బుధ | కల్పవృక్ష వాహనం | హనుమంత వాహనం |
| 30-01-2020 | గురు | ముత్యపుపందిరి వాహనం | గరుడ వాహనం |
| 31-01-2020 | శుక్ర | కల్యాణోత్సవం | గజ వాహనం |
| 01-02-2020 | శని | రథోత్సవం | ధూళి ఉత్సవం |
| 02-02-2020 | ఆది | సర్వభూపాల వాహనం | అశ్వ వాహనం |
| 03-02-2020 | సోమ | వసంతోత్సవం, చక్రస్నానం | ధ్వజావరోహణం, హంసవాహనం |
| 04-02-2020 | మంగళ | ----- | పుష్పయాగము |

## ఇవే 24 ఏకాదశులు

01) చైత్రశుక్లఏకాదశి- 'కామదా'- కోర్కెలు తీరుస్తుంది.

02) చైత్రబహుళఏకాదశి- 'వరూథిని'- సహస్ర గోదాన ఫలం లభిస్తుంది.

03) వైశాఖశుద్ధఏకాదశి- 'మోహిని'- దరిద్రుడు ధనవంతు డవుతాడు.

04) వైశాఖబహుళఏకాదశి- 'అపరా'- రాజ్యప్రాప్తి.

05) జ్యేష్ఠశుక్లఏకాదశి- 'నిర్జల'- ఆహారసమృద్ధి.

06) జ్యేష్ఠబహుళఏకాదశి- 'యోగినీ'- పాపాలను హరి స్తుంది.

07) ఆషాఢశుద్ధఏకాదశి- 'దేవశయనీ'- సంపత్‌ప్రాప్తి.

08) ఆషాఢబహుళఏకాదశి- 'కామికా'- కోరినకోర్కెలు ఫలిస్తాయి.

09) శ్రావణశుక్లఏకాదశి- 'పుత్రదా'- సత్‌సంతానప్రాప్తి

10) శ్రావణబహుళఏకాదశి- 'అజా'- రాజ్యపత్నీపుత్రప్రాప్తి, ఆపన్నివారణం.

11) భాద్రపదశుద్ధఏకాదశి- 'పరివర్తన'- యోగసిద్ధి.

12) భాద్రపదబహుళఏకాదశి- 'ఇందిరా'- సంపదలు, రాజ్యము ప్రాప్తిస్తాయి.

13) ఆశ్వయుజశుక్లఏకాదశి- 'పాపాంకుశ'- పుణ్యప్రదం.

14) ఆశ్వయుజబహుళఏకాదశి- 'రమా'- స్వర్గప్రాప్తి.

15) కార్తికశుక్లఏకాదశి- 'ప్రబోధిని'- జ్ఞానసిద్ధి.

16) కార్తికకృష్ణఏకాదశి- 'ఉత్పత్తి'- దుష్టసంహారము.

17) మార్గశిరశుక్లఏకాదశి- 'మోక్షదా'- మోక్షప్రాప్తి.

18) మార్గశిరకృష్ణఏకాదశి- 'విమలా' (సఫలా)- అజ్ఞాన నివృత్తి.

19) పుష్యశుక్లఏకాదశి- 'పుత్రదా'- పుత్రప్రాప్తి (ఇదే వైకుంఠ ఏకాదశి)

20) పుష్యకృష్ణఏకాదశి- 'కల్యాణీ' (షట్‌తిలా) ఈతిబాధా నివారణం.

21) మాఘశుక్లఏకాదశి- 'కామదా' (జయా) - శాప విముక్తి.

22) మాఘకృష్ణఏకాదశి- 'విజయా'- సకలకార్యవిజయం. (ఇదే భీష్మైకాదశి)

23) ఫాల్గుణశుక్లఏకాదశి- 'అమలకీ'- ఆరోగ్యప్రదం.

24) ఫాల్గుణకృష్ణఏకాదశి- 'సౌమ్యా'- పాపవిముక్తి.

శ్రీహరిని స్తుతించినవారికి స్వామి కృపవల్ల ముక్తి కరతలా మలకమవుతుంది.

శుక్లఏకాదశినాడు సూర్యునినుండి వెలువడిన పదకొండవకళ చంద్రుణ్ణి ప్రవేశిస్తుంది. బహుళ ఏకాదశి నాడు చంద్రమండలమునుండి పదకొండవకళ సూర్యమండ లాన్ని చేరుతుంది. ఇలా రాకపోకలవల్లనే "ఏకాదశి" అనే పేరు సార్థకమైంది. ఇలా 24 ఏకాదశులున్నాయి.

**ఏకాదశీదేవీజననం:** పూర్వం కృతయుగంలో చంద్రావతీ నగరాన్ని పాలించే 'మురు'డనే రాక్షసుడు దేవతల్ని జయించి, వేధిస్తూండేవాడు. విష్ణువు వానితో వెయ్యేండ్లు యుద్ధంచేసి, అలసి విశ్రాంతికై ఒక గుహలో చేరి నిద్రించాడు. అట్టి శ్రీహరిని సంహరించడానికి మురుడు సిద్ధపడ్డాడు.


ఆ సమయంలో స్వామిశరీరంనుండి దివ్యతేజస్సు లతో ఒక కన్య ఉద్భవించింది. దివ్యాస్త్రాలతో యుద్ధంచేసి, ఆ కన్య మురుణ్ణి సంహరించింది. విష్ణువు మేల్కొని కన్యనూ, మరణించి ఉన్న మురుణ్ణీ చూసి ఆశ్చర్యపడ్డాడు. అప్పుడు ఆ కన్య స్వామికి నమస్కరించి, జరిగిందంతా చెప్పింది. అందుకు సంతోషించిన విష్ణువు ఆమెను వరం కోరుకొమ్మ న్నాడు. ఆమె ఆనందంతో "దేవా! నేను ఏకాదశినాడు నీ

దేహంనుండి ఉద్భవించాను. కనుక నాపేరు ఏకాదశి. నా వ్రతంచేస్తూ ఈనాడు ఉపవాసం ఉండేవారు సంసార బంధాలనుండి తరించేట్లు వరమిచ్చి అనుగ్రహించండి" అని ప్రార్థించింది. అలాగేనంటూ స్వామి వరమిచ్చాడు. నాటి నుండి ఏకాదశీవ్రతం భక్తితో ఆచరించేవారు సకలపాపాల నుండి విముక్తులై విష్ణులోకాన్ని పొందుతారన్న ప్రశస్తి ఏర్పడింది. ఏకాదశీతిథికి అధిదేవత ఏకాదశీదేవి. ఈమె విష్ణుదేహసముత్పన్న. కనుక స్త్రీమూర్తియైన మహావిష్ణువే.

వైకుంఠమంటే పరంధామం. ఏకాదశి అంటే పదకొండుఇంద్రియాలసమూహం. (5 కర్మేంద్రియాలు, 5 జ్ఞానేంద్రియాలు, 1 మనస్సు= 11 ఇంద్రియాలు.) మనస్సు కూడా ఒక ఇంద్రియమే. ఈ 11 ఇంద్రియాలూ వైకుంఠునికి అర్పించి, అర్చించి, సేవించి, ఉపాసించినపుడే అవి పవిత్ర ములై, వాటిద్వారా సుఖానుభూతిని పొందే జీవుణ్ణి వైకుంఠంలో చేరుస్తాయి.

ద్వాదశి పన్నెండవస్థితి. ఇదే ఇంద్రియాతీత దివ్యా నందస్థితి. ఏకాదశినాటి ఉపవాసం సత్త్వగుణానికి సంకేతం! ఒక వస్తువుకు మరొక వస్తువును మిక్కిలి దగ్గరగా ఉంచి నపుడు మొదటివస్తువుయొక్క గుణం, వాసన రెండవదానిపై ప్రభావం చూపుతాయి కదా! ఆ విధంగానే ఏకాదశేంద్రి యాలతో కూడా జీవాత్మ వైకుంఠునికి- ఉప= సమీపంలో, వాస్త= వసించుటవల్ల అత్యంత సారూప్య సాన్నిధ్యప్రభావం కారణంగా జీవాత్మపై పరమాత్మప్రభావం ప్రసరిస్తుంది. జీవుడు శుద్ధుడవుతాడు. ద్వాదశినాడు చక్రస్నానం గావించి, స్వామిప్రసాదాన్ని స్వీకరించడంతో ద్వాదశాక్షరీమంత్రమయ మైన వాసుదేవతత్త్వాన్ని అనుభవిస్తాడు- జీవాత్మ. ఈ అను భవమే కలియుగ వైకుంఠమైన తిరుమల శ్రీపుష్కరిణీ ముక్కోటిఏకాదశి చక్రస్నానఫలం.

ఇది ధనుర్మాసం. ఓంకారమే ధనుస్సు. శ్రీవారిని ప్రణవమూర్తిగా ఉపాసించటమే ధనుర్మాసపూజ. అందు "వైకుంఠఏకాదశి" సర్వసమర్పణరూపమైన త్యాగానికీ, శుద్ధ సత్త్వగుణానికీ సంకేతం. స్వామి "పవిత్రాణాం పవిత్రం, మంగళానాం మంగళం" కదా! అట్టి సుదర్శనరూపుని చేతి దివ్యాయుధం సుదర్శనచక్రం. ఇది కాలచక్రానికీ, దర్శన మాత్ర ముక్తిదాయకత్వానికీ ప్రతీక. సుదర్శనచక్రస్నాన స్పర్శతో కూడిన జలం 'పుష్క రిణీతీర్థం'లో స్నానం చేయడంతో జీవాత్మలు పరి శుద్ధులూ, సుదర్శనులూ అవు తారు. ఇట్టి జీవులకు వైకుంఠ ద్వారాలు- ఒకరోజే కాదు. సర్వదా తెరువబడే ఉంటాయి.



ఇంతటి ప్రభావ సంపన్న మైన.. వైకుంఠఏకాదశినీ, ద్వాదశినీ భక్తిశ్రద్ధలతో... ఆచరించినవారికి పునర్జన్మ ఉండదు.



# ముక్తిప్రదతీర్థం! స్వామిపుష్కరిణి!!

– శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి, 80996 81422


అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు వేంకటాచల పర్వతంపై ఆనందనిలయ విమానంనందు వేంచేసి ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామివారి సన్నిధానానికి ఈశాన్యభాగంలో ముక్తిప్రదములైన సప్తతీర్థాల్లో మొదటిదైన "శ్రీస్వామి పుష్కరిణీతీర్థము' అనే పుణ్యతీర్థం ఉన్నది. ఈ తీర్థము ముల్లోకాల్లోని సమస్త పుణ్యతీర్థాలకు స్వామిని అవటంవల్ల "స్వామిపుష్కరిణీ" అని ప్రఖ్యాతి గాంచింది. అలాంటి ఈ సర్వతీర్థస్వామిని అయిన ఈ "స్వామి పుష్కరిణీతీర్థము" గురించి పురాణాలు, మహర్షులు ఎన్నోవిధాలుగా ప్రశంసించి ఉన్నారు. ఏఏపురాణాల్లో ఏఏ మహర్షులచేత ప్రశంసించబడి ఉందో వాటిగురించి తెలుసుకుందాం.

**1) వామనపురాణం :** పూర్వం మార్కండేయమహర్షి బ్రహ్మను గూర్చి ఘోరమైన తపస్సుచేశాడు. ఆయన తపస్సుకు మెచ్చి బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై కావలసిన వరం కోరుకోమన్నాడు. అందుకు మార్కండేయుడు ఓ దేవా! సృష్టిలో ఉన్న సమస్తతీర్థాలను అన్నింటినీ నేను సేవించాలనుకుంటున్నాను. ఆ శక్తిని ప్రసాదించండి అని అడిగాడు. ఆ మాటలకు బ్రహ్మదేవుడు ఓ మార్కండేయా! నీకోరిక ఎన్ని వేలఏండ్లకైనా తీరదు. కానీ సర్వతీర్థయాత్రాఫలం సిద్ధించేట్లు మార్గముంది. అదేమంటే శ్రీవేంకటాద్రిపర్వతంమీద 'స్వామిపుష్కరిణి' అనే మహత్త్వతీర్థముంది. అది అన్ని పాపాల్ని పోగొడుతుంది. అక్కడ ప్రతిసంవత్సరం ధనుర్మాసంలో అనగా మార్గశిరమాసం శుక్లపక్షంలో ద్వాదశితిథి నాడు ఉషోదయంలో ముల్లోకాల్లోని తీర్థాలన్నీ శ్రీస్వామిపుష్కరిణివద్దకు చేరుకుంటాయి. కాబట్టి ఆ రోజున నీవుకూడా వేంకటాచలం వెళ్లి ఆ తీర్థాన్ని సేవించినట్లైతే సమస్తతీర్థాలను సేవించినఫలితం నీకు దక్కుతుందని చెప్పాడు. అలా బ్రహ్మ చెప్పినట్లే 'స్వామిపుష్కరిణి'ని సేవించి, స్వామిని దర్శించి




కృతార్థుడయ్యాడు. ఈ తీర్థసేవనంవల్ల సర్వతీర్థసేవనఫలం సిద్ధిస్తుంది.

**2) వరాహపురాణం :** 'శంఖు' రాజు మంచి భక్తుడు. పరాక్రమశాలి. చాలా ధార్మికంగా పరిపాలన చేస్తూ ఉండేవాడు. దురదృష్టవశాత్తు ఓసారి ఇతర రాజులందరూ ఏకమై మూకుమ్మడిగా ఇతనిపైకి ఒక్కసారిగా దండెత్తివచ్చి, ఓడించి రాజ్యభ్రష్టుని చేశారు. అప్పుడు ప్రాణాలతో తప్పించుకొని తన గురువులను కలుసుకున్నాడు. తనకు ఏదైనా సలహా ఇవ్వమన్నాడు. అందుకు వారు వేంకటాచలానికి వెళ్లి భగవంతుని ప్రార్థించి, పుష్కరిణిలో స్నానం చేస్తే నీ సమస్యలకు పరిష్కారం దొరికి, నీరాజ్యం నీకు దక్కుతుందని చెప్పారు. ఆ మాటలకు శంఖుడు భక్తిశ్రద్ధలతో వేంకటాచలయాత్రచేసి, శ్రీనివాసుణ్ణి ప్రార్థించి, పుష్కరిణిలో స్నానంచేశాడు. అతని భక్తికిమెచ్చి స్వామి అతడు పుష్కరిణిలో స్నానం చేస్తున్న సమయంలోనే పుష్కరిణి మధ్యలోనే అతనికి దర్శనమిచ్చి అనుగ్రహించాడు. అంతా భగవదిచ్ఛ. శత్రురాజులందరూ వారిలోవారు



పోట్లాడుకొని తిరిగీ శంఖుడికే రాజ్యం ఇచ్చేశారు. అలా 'శంఖు'కు మహాప్రయత్నంచేసినా నిలుపుకోలేని రాజ్యం పుష్కరిణిస్నానంతో తిరిగొచ్చిందనీ, అలా పోయిన స్వామిత్వం తిరిగీ ఇప్పించేశక్తి ఉన్నది కనుక దానికి **"స్వామి పుష్కరిణి"** అనే పేరొచ్చిందని పురాణంమాట. ఈ తీర్థ సేవనంవల్ల మంచి ధైర్యం, శక్తియుక్తులు సిద్ధిస్తాయి.

**3) స్కందపురాణం :** పూర్వం చంద్రవంశంలో నందుడు అనే రాజుకు ధర్మగుప్తుడు అనే కుమారుడు కలిగాడు. ఆ బిడ్డ పెరిగి పెద్దవాడయ్యాక రాజ్యభారాన్నప్పగించి అడవికి వెళ్లిపోయాడు తండ్రి. అతడు రాజ్యాన్ని చక్కగా పరిపాలిస్తు న్నాడు. ఓనాడు అడవికెళ్లాడు ధర్మగుప్తుడు. బాగా చీకటి పడింది. ఆ సమయంలో ఒక సింహం తరుముకుంటూరాగా భయపడి చెట్టుపైకెక్కాడు. కానీ ఆ చెట్టుపై అంతకుముందే ఓ ఎలుగుబంటి ఉంది. దానిని చూసి భయపడ్డాడు రాజు. కానీ ఆ ఎలుగుబంటి రాజుతో మానవభాషలో, ఓ రాజా! మీరేమీ భయపడకండి. ఆ సింహం చెట్టుక్రిందే ఉంది. మీరు కాసేపు నిశ్చింతగా నిద్రపొండి. నేను మీకు కాపలాగా ఉంటాను అన్నది. ఆ మాటలకు ఆ రాజు నిద్రపోయాడు. అప్పుడు సింహం అదిచూసి ఆ రాజును నాకు ఆహారంగా క్రిందకు పడవెయ్యి అన్నది. అందుకు ఎలుగు, నేను అతనికి అభయమిచ్చాను. అతనికి ద్రోహం తలపెట్టలేను. అలా చేసినట్లైతే నాకు నిష్కృతి ఉండదు. నీ దురాశను వదులుకో అన్నది. ఆ తర్వాత రాజు నిద్రలేచాడు. ఆ తర్వాత ఎలుగు నిద్రకుపక్రమించింది. అప్పుడు సింహం రాజుతో నాకు ఆహారంగా ఆ ఎలుగును క్రిందకు పడవెయ్యి అన్నది. ఆ మాటలకు రాజు ఎలుగును కృతఘ్నతతో క్రిందకు తోసే శాడు. అప్పుడు గభాలున ఎలుగు ఒక చెట్టుకొమ్మను పట్టు కొని పైకొచ్చింది. నీవు కృతఘ్నుడివి. నువ్వు పాపపుపని చేశావు కాబట్టి మతిభ్రమించి పిచ్చివాడవై పోదువుగాక అని




శపించింది. ఆ విధంగా పిచ్చిమారాజును తీసుకొని అడవిలో తపస్సు చేసుకుంటున్న అతని తండ్రివద్దకు తీసుకెళ్లారు కొందరు అనుచరులు. అందుకు ఎంతగానో బాధపడి రాజు జైమినిమహర్షి సలహాతో వేంకటగిరిపై ఉన్న స్వామిపుష్కరిణీ తీర్థసేవ చేయించాడు తనకుమారునితో. అప్పుడు తిరిగీ స్వస్థుడై తనరాజ్యం చేరుకొన్నాడు ధర్మగుప్తుడు. ఈ తీర్థ సేవనంవల్ల బ్రహ్మహత్యాదోషంవల్ల కల్గినపాపం నశిస్తుం దని పురాణవాక్కు.

**4) బ్రహ్మపురాణం :** పూర్వం ఒకప్పుడు సరస్వతీదేవి గంగానది మొదలైన నదులకంటె ఉన్నతమైన మహిమాన్విత మైన తీర్థరాజంగా పేరు పొందాలని, గౌరవాలను పొందా లని తలంచి సరస్వతీనదిగా ప్రవహించసాగింది. అప్పుడ క్కడికి పులస్త్యమహర్షి వచ్చాడు. తనను చూసికూడా సరస్వతి గౌరవించలేదని కోపించి నీవు గంగాదినదులకంటె ప్రసిద్ధ రాలిగా ఉండాలనుకున్న నీ కోరిక ఫలించదు. గంగానదే గొప్పదిగా పేరుపొందుతుందన్నాడు. అందుకు సరస్వతి శ్రీమహావిష్ణువుకు అప్రియులైన రాక్షసులతో నీ వంశం వర్ధిల్లుగాక అని ప్రతిశాపమిచ్చింది. అందుకు పశ్చాత్తాప పడుతూ పులస్త్యుడు సరస్వతీదేవిని ఎన్నోవిధాలుగా ప్రార్థిం చాడు. అందుకు సంతసించి నీ వంశంలో చివరివాడు మాత్రం విభీషణుడనే పేరుతో చిరంజీవిగా వర్ధిల్లుతాడు అని వరమిచ్చింది. ఆ తర్వాత మహావిష్ణువుకోసం తీవ్ర తపస్సు చేసింది. అందుకు స్వామి ప్రత్యక్షమై వరం కోరుకో మన్నాడు. అందుకు పులస్త్యుని శాపవిమోచనాన్ని అడిగింది. అందుకు విష్ణువు నదీరూపంలో శ్రేష్ఠత్వాన్ని పొందలేక పోయినా పుష్కరిణిరూపంలో నీవు వరమోన్నతస్థానాన్ని పొందటమేగాక అత్యంత పవిత్రమైన తీర్థరాజంగా విరా



జిల్లేట్లుగా సరస్వతికి వరమిచ్చాడు. అలా వెలసిన తీర్థ రాజమే **'స్వామిపుష్కరిణి'** అన్న ప్రశస్తిని పొందింది. ఈ తీర్థసేవనంవల్ల సకలపాపదోషవిముక్తి కల్గుతుంది.

**5) భవిష్యోత్తరపురాణం :** సీతాపహరణం తర్వాత రామలక్ష్మణులు హనుమంతునితో కలిసి సుగ్రీవునితో



మైత్రిచేసి, వాలిని వధించి, వానరసైన్యంతో రావణుడిలంకకు బయలుదేరారు. అలా మార్గమధ్యంలో శేషాచలానికి వెళ్లారు. అక్కడ అంజనాదేవి రాముడికి నమస్కరించి, నేను, మునులూ అందరూ నీరాకకోసమే ఎదురుచూస్తున్నాం. ఈ కొండపైకి వచ్చి మమ్మల్ని అనుగ్రహించాల్సిందిగా ప్రార్థిం చింది. అందుకు రాములవారు లంకలో పనిపూర్తిచేసుకొని తిరిగి వచ్చేటప్పుడు నీ కోరిక తప్పక తీరుస్తానన్నాడు. అప్పుడు హనుమంతుడు కొన్ని కారణాలతో కొండ ఎక్కేలా చేశాడు రాముణ్ణి. అలా అంజనాదేవి ఆశ్రమం చేరాడు శ్రీరాముడు. అక్కడ ఆమెను అనుగ్రహించి, స్వామిపుష్కరిణికి వెళ్లాడు. అక్కడ స్నానంచేశాడు. ఈ పుష్కరిణి స్వామిత్వం పోయినవారికి స్వామిత్వం ప్రసాదించేది. ఇతర అన్ని రంగాల్లో జయాన్ని ప్రసాదించే ఈ పుష్కరిణిలో స్నానంతో రావణసంహారం, సీతచెరవిమోచన, ఆ తర్వాత రాజ్యపట్టాభి

షేకం విజయం రామునికి సిద్ధించాయని పురాణవాక్కు. ఈ తీర్థసేవనంవల్ల సకలవిజయసిద్ధులు కల్గుతాయి.

## శ్రీస్వామిపుష్కరిణీతీర్థముక్కోటి

శ్రీస్వామిపుష్కరిణీస్నానం, సద్గురుపాదసేవనం, ఏకాదశీవ్రతం ఈ మూడునూ అత్యంత దుర్లభములు. అలాగే మానవునిగా జన్మించడం, మానవునిగా మనుగడ సాగించడం, ఈ మానవజీవితంలో శ్రీస్వామిపుష్కరిణిలో స్నానంచెయ్యడం అనే కార్యాలు లభ్యం కావడం చాలా దుర్లభమైనవని వరాహపురాణం చెప్తోంది.

తీర్థాల్లోకెల్లా పరమపావనమైనది తిరుమలలోని **"స్వామిపుష్కరిణి"**. ఈ పుష్కరిణిని దర్శించడంవల్లనూ, ఈ తీర్థాన్ని సేవించడంవల్లనూ, స్మరించడం వల్లనూ, ఇందులో స్నానం చెయ్యడంవల్లనూ సమస్తపాపాలు నశిస్తాయి. సర్వసుఖాలు కల్గుతాయి. దీనికిదే సాటి.

శ్రీమహావిష్ణువు ఆనతిమేరకు గరుత్మంతుడు వైకుంఠంనుండి క్రీడాద్రితోకూడా ఈ పుష్కరిణిని తెచ్చి ఇక్కడ ఈ క్షేత్రంలో స్థాపించినట్లు పురాణాలు చెప్తున్నాయి. ఈ స్వామి పుష్కరిణి సర్వతీర్థాలకు నిలయం. సర్వపాపహరం. స్నానమాత్రంచేత ఇహపరాలను రెంటినీ ప్రసాదిస్తుంది.

కలియుగవైకుంఠమైన తిరుమల పుణ్యక్షేత్రంలో నెలకొన్న కోనేరుకే **'శ్రీస్వామిపుష్కరిణి'** అని పేరు. బ్రహ్మాండంలోని సర్వతీర్థాలకు 'స్వామి' వంటిది కనుకే 'స్వామిపుష్కరిణి' అనే సార్థకనామధేయంతో తిరుమలక్షేత్రంలోని కోనేరు అలరారుతుంది.

వైకుంఠఏకాదశి మరునాడు ద్వాదశి. ఈ రోజు సూర్యోదయవేళ **"శ్రీస్వామిపుష్కరిణీ తీర్థముక్కోటి"** జరుగుతుంది. వైకుంఠఏకాదశినాడు మూడుకోట్ల యాభైలక్షల పుణ్యతీర్థాలు, పుష్కరిణులూ తిరుమలలోని "శ్రీస్వామి పుష్కరిణి"లో దివ్యసూక్ష్మరూపంలో లీనమై ఉంటాయి. అంటే సర్వదేవతలూ సన్నిధిచేసి ఉంటారు. కనుక ఈ పర్వదినంలో శ్రీవారిఆలయంలో శ్రీవారికి సుప్రభాతం, తోమాల సేవ, అర్చన, నివేదనాదులు యథాక్రమంగా జరుగుతాయి.

పిదప ఆనందనిలయంలో ఉన్న "సుదర్శనచక్రత్తాళ్వార్" పల్లకిని అధిరోహించి, ఊరేగింపుగా తిరుమల తిరువీథుల్లో మహాప్రదక్షిణంగా వచ్చి శ్రీవరాహస్వామి ఆలయప్రాంగణం చేరుకొంటారు. అక్కడ "చక్రత్తాళ్వారు"కు అభిషేకం జరిగిన తర్వాత పుష్కరిణిలో పవిత్రస్నానం చేయిస్తారు. ఇలా చక్రస్నానం జరిగే సమయంలో అసంఖ్యాక భక్తులుకూడా పుష్కరిణిలో మునిగి పవిత్రస్నానం చేస్తారు. పిదప చక్రత్తాళ్వారుకు వస్త్రాలంకారం, నివేదన, హారతులు ఘనంగా నిర్వహిస్తారు. అటునుండి చక్రత్తాళ్వారువారు (సుదర్శనభగవానులు) బయలుదేరి ప్రదక్షిణంగా వేంచేసి శ్రీవారి ఆలయాన్ని ప్రవేశిస్తారు.



అంతటి పరమపావనమైన ఈ పుష్కరిణీతీరంలో, ధనుర్మాసంలో వైకుంఠద్వాదశి అరుణోదయంవేళ సమస్తతీర్థాలన్నీ ఆవహిస్తాయట. అందుకే ఆరోజు **'శ్రీస్వామిపుష్కరిణీ తీర్థముక్కోటి'**గా ప్రసిద్ధిపొందింది. ధనుర్మాసంలో వచ్చే శుక్లపక్షద్వాదశినాడు అరుణోదయవేళలో ఎవరైతే మనః ప్రీతితో స్నానంచేస్తారో వారు వారి సగోత్రులైన దాయాదులు, బంధువులు అన్ని పాపాలనుండి విముక్తులౌతారు. ఇంతటి పరమపవిత్రమైన స్వామిపుష్కరిణి ఎందరో భక్తుల్ని, యాత్రికుల్ని స్నానంద్వారా ముందుగా పునీతుల్ని చేస్తుంది. అలాంటి **'స్వామిపుష్కరిణి'**ని మనం ఒక్కసారైనా దర్శిద్దాం. స్నానం ఆచరిద్దాం. పాపాల్ని పోగొట్టుకొని పునీతులమవుదాం. చేతులెత్తి ఆ కోనేటికి ప్రణామాలర్పిద్దాం.




# అంతా దేవుని లీల!!

– శ్రీ దండుబోయిన రవికుమార్, 99128 78877

నా పేరు దండుబోయిన రవికుమార్. మాది ఖమ్మంజిల్లా. అది 2003వ సంవత్సరం. నేను మెరుగైన ఉద్యోగప్రయత్నంలో ఉంటిని. అప్పుడే నాకు చిత్తూరుజిల్లా లోని నేలవోయ్ అనే ఊరులో ఉన్న సాగర్ షుగర్ ఫ్యాక్టరీ నుండి నాకు ఇంటర్వ్యూ కాల్‌లెటర్ వచ్చినది.

అవి ఆగష్టుమాసం చివరిరోజులు. నేను ఇంటర్వ్యూకి వెళ్ళటానికి డిసైడ్ అయ్యి విజయవాడ నుండి తిరుమల ఎక్స్‌ప్రెస్‌కి రిజర్వేషన్ చేయించుకొని బయలు దేరినాను. మరుసటి దినం ఉదయం 6 గంటలకు తిరుపతి చేరుకున్నాను. ట్రైన్ దిగిన వెంటనే తిరుపతి బాలాజీ బస్సు స్టాండ్‌కి వెళ్లి ఆ శ్రీవేంకటేశ్వరస్వామిదర్శనంకొరకు సుదర్శనం కౌంటర్‌కి వెళ్లి అడగగా వారు అన్నారు దర్శనం మరుసటి దినం అనగా 24 గంటల తర్వాతే అని. అది విన్న నేను చాల నిరుత్సాహంగా కూర్చుని ఉండిపోయినాను. ఎందుకంటే నేను చేసిన పొరపాటు అదే రోజు సాయంత్రం తిరుగు ప్రయాణం రిజర్వేషన్ టిక్కెట్ తిరుమల ఎక్స్‌ప్రెస్‌కి తీసుకుని ఉన్నాను. ఇంక చేసేదేమిలేక, పక్కనే ఉన్న లాడ్జి రూమ్‌కి వెళ్లి రూమ్ తీసుకుని కాలకృత్యములు తీర్చుకుని తిరిగి బస్సుస్టాండ్‌కి వచ్చి నేలవోయ్ వెళ్లే బస్సు ఎక్కి ఇంటర్వ్యూకి వెళ్ళినాను. అప్పుడు సమయం 10గంటలు. కానీ 10.30కి నాకు ఇంటర్వ్యూ అని అక్కడి వారు చెప్పినారు. ఆ శ్రీనివాసుని కృపతో ఇంటర్వ్యూలో సెలెక్ట్ అవ్వటం వెనువెంటనే ఆఫర్ లెటర్ ఇవ్వటం అంత ఒక గంటలో జరిగిపోయినది. తర్వాత ఫ్యాక్టరీ వారే భోజనం పెట్టి బస్సుస్టాండ్ వద్ద దించినారు. మలి బస్సు ఎక్కి తిరుపతి చేరుకునేసరికి సమయం మధ్యాహ్నం 3 గంటలు. ఇంకా ట్రైన్‌కి 5 గంటలు సమయం ఉన్నది. మనసేమో అంతా ఆ శ్రీనివాసునిమయమై ఉన్నది. మనసులో ఆ శ్రీనివాసుని స్మరిస్తూ ఏంటి స్వామిని దర్శనం లేకుండా ఎలా వెళ్తాను అని పదే పదే మనసులో ప్రార్థిస్తూ ఉన్నాను. చివరికి ఒక నిర్ణయంకి వచ్చి ముందు తిరుమల కొండకి వెళ్లాం. వెళ్లాక అక్కడ స్వామి ఆలయం బయట నుండి దండం పెట్టుకుని ఆ స్వామికి బేడీ ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న హారతిపాయింట్ నుండి హారతి ఇద్దాం అని బస్సు ఎక్కి కొండకు చేరుకొని స్వామికి దండం పెట్టుకుని హారతి ఇచ్చినాను.

తర్వాత ఆలా మాడవీధిగుండా నడుచుకుంటూ వెళ్తున్నాను. అప్పుడేమో మాడవీథులు వెడల్పు చేయు పనులు జరుగుచున్నవి. ఆలా నడుచుకుంటూ వెళ్తున్నాను. ఎటు వెళ్తున్నానో నాకే తెలియటం లేదు, అలా నడుస్తూ నడుస్తూ వెళ్తున్నాను. మనస్సులో ఆ స్వామిని తలుస్తూ, అలా ఎంత నడిచానో నాకే తెలియదు. కొంత సమయానికి బిల్డింగ్స్ కనిపించాయి. అవి ఏంటో తెలియక దగ్గరికి వెళ్ళాను. ఇంతలో ఒక 6 లేదా 7 గురు నన్ను దాటుకుని ముందుకి వెళ్ళుతున్నారు. నేను వాళ్లలో ఉండిపోయా. ఇంతలో వారిని చూసి సెక్యూరిటీ అతను తలుపు తీసి వాళ్ళను వాళ్ళతో పాటు నన్ను లోనికి పంపించివేసినారు. అప్పుడు అర్థం అయినది అది క్యూ కాంప్లెక్స్ అని. అప్పుడు స్వామి కళ్ళముందే కనిపించినట్లు అయ్యి ఇది కలయా నిజమా అనిపించి కళ్ళనీరు వచ్చినది. అలా వెళ్లిన నేను 10నిమిషాలలో ఆ స్వామిదర్శనం చేసుకుని బయటకు వచ్చినాను. అప్పుడు సమయం 6గంటలు. నాకు అప్పుడు అనిపించింది. ఆ స్వామియే నన్ను అలా నడిపించి దర్శనంకి దారి చూపించారు అని. స్వామికి కృతజ్ఞతలు చెప్పుకుని ఆనందంగా మా ఊరికి బయలుదేరినాను.

# తిరుమలకు తొలిగడప దేవుని కడప

– శ్రీ పంతుల నాగాంజనేయులు, 9885506765

రాష్ట్రంలో ఎన్నో ఆధ్యాత్మికక్షేత్రాలున్నాయి. వాటిలోని ప్రముఖప్రాంతాలలో కడప జిల్లాకు చెందిన దేవునికడప శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం ఒకటి. విశేషఖ్యాతిగల, పురాణ ప్రసిద్ధిగల పర్యాటకప్రాంతంగా ఈ ఆలయానికి ఎంతో పేరుంది. దీన్ని తిరుమలకు తొలి గడపగా భావిస్తారు. తిరుమల క్షేత్రపాలకుడు వరాహస్వామి అయితే, ఈ క్షేత్రపాలకుడు హనుమంతుడు. ఇలాంటి మరెన్నో విశేషాలున్నాయి. దీని గురించి కడప కైఫీయత్తులలో సమాచారం ఉంది.


## జనమేజయుని ప్రతిష్ఠ

దేవునికడప శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ మూలవిరాట్‌ను సాక్షాత్తు జనమేజయుడు ప్రతిష్ఠించాడని కడప కైఫీయత్తులో ఉంది. ఇందులోని సమాచారం ప్రకారం ఈ ప్రాంతానికి దేవుని కడపగా పేరుండేది. కాలక్రమంలో కడప గడపగా మారింది. జనమేజయుడు పుణ్యక్షేత్రాలను దర్శించుకుంటూ తిరుమల వచ్చాడని, స్వామిని దర్శించుకుని ఆ రాత్రి అక్కడే నిద్ర చేశాడని, కలలో శ్రీవేంకటేశ్వరుడు కనిపించి తిరుమలలోని చెరువుకట్టపై తవ్వితే విగ్రహం కనిపిస్తుందని, దాన్ని ఫలానాచోట ప్రతిష్ఠించుమని సూచించినట్లు తెలుస్తోంది. తెల్లవారాక ఆయన చెరువుకట్టపై దాదాపు పూడిపోయి ఉన్న శ్రీవేంకటేశ్వరుని విగ్రహాన్ని గమనించి ప్రతిష్ఠ చేసేందుకు సరైన ప్రాంతం కోసం అన్వేషించాడు.

తిరుమలకు వాయవ్యంగా పది ఆమడల (ఆమడ అంటే పదిమైళ్లు) దూరాన పుష్కరిణి సహితంగా వాయుపుత్రుడైన ఆంజనేయుని క్షేత్రం ఉన్నట్లు తెలుసుకుని, ఈ విగ్రహాన్ని అక్కడ ప్రతిష్ఠించడం మంచిదని భావించాడు. ఇందుకు నిదర్శనంగా నేటికీ కడపరాయని మూలవిరాట్ వెనుక పదిఅడుగులకు పైగా ఎత్తుగల ఆంజనేయుని విగ్రహం ఉంది. తొలుత ఈ స్వామిని కడప వెంకటేశ్వర్లు అని పిలిచేవారు. ఆంజనేయుడు శివుని అంశ గనుక శ్రీవారి ఆలయంతో పాటు ఆ ప్రక్కనే శివాలయాన్ని నిర్మించారు.

ఈ ఆలయ ముఖమండపం అద్భుతమైన శిల్ప సోయగంతో కనులవిందు చేస్తోంది. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ రంగమండపం, ఆ ప్రాంగణంలోని ఇతర మందిరాలు కనువిందు చేస్తాయి. రంగ మండపంలో నాటి కళారూపాల ప్రదర్శనను గుర్తు చేస్తూ నృత్య సంగీతాలకు సంబంధించిన శిల్పాలు కనిపిస్తాయి. అటు క్షేత్రపాలకుడైన హనుమంతుడు, ఇటు దశావతారాలు, మహర్షుల శిల్పాలుకూడా మండపం స్తంభాలపై చూడవచ్చు.

**26-01-2020 నుండి 03-02-2020 వరకు**
**దేవునికడప శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామివారి**
**బ్రహ్మోత్సవం సందర్భంగా...**





దేవునికడప శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పలు శాసనాలున్నాయి. ఆలయ చరిత్రను తెలుపుతూ నాటి రాజుల ఆధ్యాత్మికచింతన, ఆలయపోషణల గురించి తెలుపుతూ నేటికీ నిలిచి ఉన్న ఆ శాసనాలు ఆలయ విశిష్టతను చాటుతున్నాయి. ఈ శాసనాలగురించి ఇంతకుముందు పెద్దగా ప్రచారం లేదు. కడపజిల్లా శాసనాలు గ్రంథంతోపాటు కడప కైఫియత్తులలో వీటి గురించిన క్లుప్తమైన ప్రస్తావన ఉంది.

## అపరవైకుంఠం

అపర వైకుంఠంగా అలరారుతున్న శ్రీనివాసుని ప్రతిరూపం కడపరాయడు శ్రీలక్ష్మివేంకటేశ్వరుడు. ఆ బ్రహ్మాండ నాయకుడి క్షేత్రం అపర వైకుంఠమే. దేవుని కడప శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయప్రాంగణం వైకుంఠాన్ని తలపిస్తోంది. తిరుమలకు తొలిగడపగా భావిస్తున్న ఈ పవిత్రక్షేత్రంలో కొలువై ఉన్న కడపరాయడిని పూజిస్తే సాక్షాత్తు తిరుమలేశుడిని పూజించినట్లేనని చెబుతారు. తిరుమలకు వెళ్లే ముందుగా ఈ ప్రాంతానికి చెందిన భక్తులు స్వామిని దర్శించుకోవడం ఆనవాయితీ. ఉత్తరప్రాంతంనుంచి తిరుమలకు వెళ్లే భక్తులు కడపనగరంలోని ఈ క్షేత్రంలో విశ్రమించి అనంతరం స్వామిని దర్శించుకుని తిరుమలేశుని సన్నిధికి బయలు దేరేవారని తెలుస్తోంది. ఏ కారణాలచేతనైనా తిరుమలకు వెళ్ళలేక ఆగినవారు ఇక్కడే మొక్కులు తీర్చుకుంటారు. నేటికీ ఆ ఆనవాయితీ కొనసాగుతోంది.

## ఆలయంలో...

గర్భాలయం ఎదురుగా రంగమండపం పూర్తిస్థాయి శిల్పసంపదతో అలరారుతోంది. భక్తులు కొద్దిసేపైనా ఆ ప్రాంగణంలో కూర్చొని ప్రశాంతత పొందాలని ఆశిస్తుంటారు. ఆలయంలో ఉత్తరంవైపున ప్రహరీకి దగ్గరగా చెట్టుక్రింద నాగుల విగ్రహాలున్నాయి. ఆ ప్రక్కనే స్వామికి సర్వసేనాని విష్వక్సేనునిమందిరం, శ్రీగణపతి మందిరం ఉంది. ఈ రెండు దక్షిణముఖంగా ఉన్నాయి. తర్వాత ఉత్తరద్వారం దగ్గరగా శ్రీఆండాళ్‌తాయారు అమ్మవారి మందిరం పడమరముఖంగా ఉంది. ఈ మందిరాల మండపాలు, గోడలు శిల్పమయమై కనువిందు చేస్తున్నాయి. స్వామిని దర్శించుకునే ముందు భక్తులు ఈ మందిరాలలో కూడా పూజలు నిర్వహిస్తారు.

## పాదమండపం

రాజగోపురంనుంచి ఆలయంలోకి అడుగు పెట్టగానే ఎదురుగా పాదమండపం కనిపిస్తుంది. ఇందులో శ్రీవారి పాదాలున్నాయి. ఈ పాదాలపై ప్రస్తుతం ఇత్తడి



తొడుగు ఉంది. భక్తులు తొలుత పాదాలను దర్శించుకుని ప్రదక్షిణలు చేసి ఆ వెనుకే గల బలిపీఠం వద్ద కొబ్బరి కాయలు సమర్పిస్తారు. ఆ వెనుక రంగమండపం ఎదుటగల జ్యోతిమందిరంలో దీపం వెలిగించి మొక్కుకుంటారు. ఆలయానికి దక్షిణగోపురం వద్ద ప్రహరీకి ఆనుకుని పెద్ద హాలులో దాదాపు పది ఆళ్వార్ల విగ్రహాలు ఉన్నాయి. ఇదే మందిరంలో అత్యంత పురాతనమైన శ్రీచెన్నకేశవస్వామి మూర్తి ఉంది. స్వామిని దర్శించుకున్న అనంతరం భక్తులు చెన్నకేశవునితోపాటు ఆళ్వార్లకు పూజలు నిర్వహిస్తారు. ఉత్తరద్వారంవైపు పురాతన జమ్మిచెట్టు ఉంది. భక్తులు దీనికి ప్రదక్షిణలు చేసి సంతానం, ఇతర కోర్కెలు తీరడం కోసం మొక్కుకుంటారు.

## బంగారుబల్లి

కంచి ఆలయానికి వెళ్లిన వారు అక్కడి బంగారు బల్లిని తాకి దోష నివారణ చేసుకుంటారు. ఆ తర్వాత అలాంటి అవకాశం కడపరాయనిఆలయంలో మాత్రమే ఉంది. ఇక్కడి అమ్మవారిఆలయం ద్వారంవద్ద పైకప్పులో రెండు రాతిబల్లులు ఇత్తడి తొడుగుతో కనిపిస్తాయి. కంచికి వెళ్ల(లే)ని వారు, వెళ్లినా అక్కడి ఆలయంలో బల్లులను తాకని వారు కడపరాయని ఆలయంలోగల బల్లులను తాకి తృప్తి పొందుతారు. అమ్మవారి దర్శనానంతరం భక్తులు తప్పక ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు.



## పుష్కరిణి (కోనేరు) ...

ఆలయం ఎదుట పెద్ద పుష్కరిణి ఉంది. జిల్లాలోని ఇతర అన్ని పుష్కరిణిలకంటే ఇది పెద్దది. ఇది ఇటు శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం అటు ఎదురుగా గల శ్రీసోమేశ్వరస్వామి ఆలయానికి కూడా చెందినదనీ ఈ ఆలయాలు రెండూ ఈ పుష్కరిణిని పూజాదికాలకు వాడ వచ్చునని అర్చకులు చెబుతున్నారు. ముఖ్యంగా



తెప్పోత్సవాలు, బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా చక్రస్నానం ఈ పుష్కరిణిలోనే నిర్వహిస్తారు. ఈ పుష్కరిణి నిర్మాణ వివరాలుగల శాసనం కడపరాయని ఆలయ రంగమండపం పరుపుబండగా ఉండేదనీ, పగిలిపోవడంతో దాన్ని అక్కడి నుంచి తీసేశారనీ తెలుస్తోంది. కానీ ఆలయ గోడలపై గల ఇతర శాసనాలతోబాటు శాసనపాఠం కూడా రికార్డుల్లో ఉంది.

## నాలుగు గడపలు

ఈ ప్రాంతంలో తొలుత దేవరగడప (దేవుని కడప) మాత్రమే ఉండేది. ఆలయానికి పెన్నానదికీ మధ్యలోగల భూమిలో వ్యవసాయం చేసే క్రమంలో నదీతీరంలో కాపు (రైతు)లు నివాసాలు ఏర్పరచుకున్నారు. అది కాపు కడప అయింది. ఓ మారు నదికి భారీగా వరదరాగా ఆ గ్రామం కొట్టుకుపోయింది. దానితో గ్రామస్థులు ఆలయానికి ఫర్లాంగుదూరంలో నివాసం ఏర్పరచుకున్నారు. నవాబులు

ఈ ప్రాంత పాలకులయ్యాక ప్రస్తుతం కడపనగరం గల ప్రాంతాన్ని 'కడప షహర్'గా నిర్మాణాలు చేశారు. తమ సైనికులు మినహా ఇంకెవ్వరూ లేకపోవడంతో గల లోటు, అసౌకర్యాలను గమనించిన నవాబు స్థానికుల సూచన మేరకు దేవర కడపలోని అర్చక కుటుంబాలను 'కడప షహర్'కు రమ్మని ఆహ్వానించారు.

సంప్రదాయాల అంతరం కారణంగా రాలేమని అర్చకులు చెప్పగా, వారి సంప్రదాయాలకు అన్ని సౌకర్యాలూ కల్పిస్తామని హామీ ఇచ్చి షహర్‌లో కోట సమీపంలో ఆంజనేయస్వామి ఆలయం కట్టించి వారికి ప్రత్యేకంగా నివాసాలు ఏర్పాటు చేయించారు. ఆ ప్రాంతం తర్వాత బ్రాహ్మణవీధిగా మారింది.

కడపనగరానికి ఉత్తరాన దేవునికడప రెండుమైళ్ళ దూరంలో ఉండగా, దేవునికడప, పాతకడప దాదాపు కలిసే ఉన్నాయి. అందుకే బ్రహ్మోత్సవాలలో ఒక రోజున దేవుని కడపలోను, మరో రోజు కడప నగరంలోను గ్రామోత్సవం నిర్వహిస్తారు.



## ఉత్సవాలు

వైకుంఠ ఏకాదశినాడు స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఉత్తర (వైకుంఠ) ద్వారం వద్ద ఉంచి భక్తులకు ఉత్తరంవైపునుంచి దర్శించుకొనే భాగ్యం కల్పిస్తారు. తెలుగు సంవత్సరాది ఉగాది సందర్భంగా ఆలయంలో స్వామి అమ్మ వార్ల ఆస్థానం, పండితుల పంచాంగశ్రవణం నిర్వహిస్తారు.

## బ్రహ్మోత్సవాలు

ఏటా మాఘశుద్ధ పాడ్యమినుంచి నవమివరకు కడపరాయని బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. 2020 సంవత్సరం జనవరి 25 నుంచి ఈ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. తొలిరోజు అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమౌతాయి. ఆలయఅర్చకులు, తిరుమల తిరుపతి దేవస్థానాల వేదపండితులు దీక్షా తిరుమంజనం కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. తొలుత విశ్వక్సేనునికి పూజచేసి పుణ్యాహవాచనం, రక్షా కంకణధారణ నిర్వహించిన అనంతరం పల్లకీలో ఊరేగింపుగా పుష్కరిణివద్దకు తీసుకువస్తారు. అక్కడ అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి మృత్సం గ్రహణం కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. దాన్ని పల్లకీలో ఊరేగింపుగా ఆలయానికి చేర్చి అంకురార్పణ చేస్తారు. ప్రత్యేక విద్వాంసుల నాదస్వర, మంగళవాద్యాల విన్యాసాలు ఉత్సవాలకు భక్తులను ఆహ్వానిస్తాయి. ఈ ఉత్సవాలలో హనుమ, గరుడవాహనాల అలంకారాల రోజుల్లో గ్రామోత్సవానికి భక్తులు విశేషసంఖ్యలో వస్తారు.

కల్యాణోత్సవం, పుష్పయాగాన్ని కూడా వైభవంగా నిర్వహిస్తారు. వేసవిలో ఐదురోజుల పాటు ఆలయ పుష్కరిణిలో తెప్పోత్సవం నిర్వహిస్తారు. 2007 సంవత్సరం నుంచి ఈ క్షేత్రం తిరుమల తిరుపతి దేవస్థానాల పరిధిలోకి చేరింది. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు విశేషసంఖ్యలో హాజరవుతారు. ఈ సంవత్సరం ఫిబ్రవరి ఒకటోతేదీన రథసప్తమినాడు రథోత్సవం వైభవంగా నిర్వహిస్తారు.



అర్థంలేని నిలకడ అజ్ఞానానికి సంకేతం



**జనవరి 2020** శ్రీవేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళం!!

| ఆదివారం | సోమవారం | మంగళవారం | బుధవారం | గురువారం | శుక్రవారం | శనివారం |
|---|---|---|---|---|---|---|
| | | | 1 | 2 | 3 | 4 |
| 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 |
| 12 | 13 | 14 | 15 | 16 | 17 | 18 |
| 19 | 20 | 21 | 22 | 23 | 24 | 25 |
| 26 | 27 | 28 | 29 | 30 | 31 | |

**ఫిబ్రవరి 2020** శ్రీవేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళం!!

| ఆదివారం | సోమవారం | మంగళవారం | బుధవారం | గురువారం | శుక్రవారం | శనివారం |
|---|---|---|---|---|---|---|
| | | | | | | 1 |
| 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 |
| 9 | 10 | 11 | 12 | 13 | 14 | 15 |
| 16 | 17 | 18 | 19 | 20 | 21 | 22 |
| 23 | 24 | 25 | 26 | 27 | 28 | 29 |

**మార్చి 2020** శ్రీవేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళం!!

| ఆదివారం | సోమవారం | మంగళవారం | బుధవారం | గురువారం | శుక్రవారం | శనివారం |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 15 | 16 | 17 | 18 | 19 | 20 | 21 |
| 22 | 23 | 24 | 25 | 26 | 27 | 28 |
| 29 | 30 | 31 | | | | |

## జనవరి 2020


01. నూతన ఆంగ్లసంవత్సరం.
06. వైకుంఠ ఏకాదశి.
07. స్వామిపుష్కరిణీ తీర్థముక్కోటి
14. భోగి, భోగి తేరు.
15. సంక్రాంతి పండుగ.
16. కనుమ,
శ్రీగోదాదేవి పరిణయోత్సవం.
24. శ్రీపురందర దాసుల ఆరాధన.
26. భారతగణతంత్ర దినోత్సవం.

## ఫిబ్రవరి 2020

01. రథసప్తమి.
05. భీష్మఏకాదశి.
09. శ్రీరామకృష్ణతీర్థ ముక్కోటి.
14 నుండి 22 వరకు శ్రీనివాసమంగాపురం
శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం.
14 నుండి 23 వరకు తిరుపతి
శ్రీకపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం.
21. మహాశివరాత్రి.

## మార్చి 2020

02 నుండి 10 వరకు తరిగొండ
శ్రీలక్ష్మీనరసింహస్వామివారి బ్రహ్మోత్సవం.
05 నుండి 09 వరకు తిరుమల శ్రీవారి తెప్పోత్సవం.
09.కుమారధారతీర్థముక్కోటి.
10.శ్రీలక్ష్మీజయంతి.
21. అన్నమాచార్య వర్ధంతి.
23 నుండి 31 వరకు తిరుపతి
శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవం.
23 నుండి 27 వరకు నాగులాపురం
శ్రీవేదనారాయణస్వామివారి తెప్పోత్సవం.
25. శ్రీ శార్వరి నామ సంవత్సరం... ఉగాది.



**ఏప్రిల్ 2020** శ్రీవేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళం!!

| ఆదివారం | సోమవారం | మంగళవారం | బుధవారం | గురువారం | శుక్రవారం | శనివారం |
|---|---|---|---|---|---|---|
| | | | 1 | 2 | 3 | 4 |
| 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 |
| 12 | 13 | 14 | 15 | 16 | 17 | 18 |
| 19 | 20 | 21 | 22 | 23 | 24 | 25 |
| 26 | 27 | 28 | 29 | 30 | | |

**మే 2020** శ్రీవేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళం!!

| ఆదివారం | సోమవారం | మంగళవారం | బుధవారం | గురువారం | శుక్రవారం | శనివారం |
|---|---|---|---|---|---|---|
| 31 | | | | | 1 | 2 |
| 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| 10 | 11 | 12 | 13 | 14 | 15 | 16 |
| 17 | 18 | 19 | 20 | 21 | 22 | 23 |
| 24 | 25 | 26 | 27 | 28 | 29 | 30 |

**జూన్ 2020** శ్రీవేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళం!!

| ఆదివారం | సోమవారం | మంగళవారం | బుధవారం | గురువారం | శుక్రవారం | శనివారం |
|---|---|---|---|---|---|---|
| | 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 |
| 14 | 15 | 16 | 17 | 18 | 19 | 20 |
| 21 | 22 | 23 | 24 | 25 | 26 | 27 |
| 28 | 29 | 30 | | | | |

## ఏప్రిల్ 2020

02 నుండి 10 వరకు ఒంటిమిట్ట
శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవం.
02. శ్రీరామనవమి.
03. తిరుపతి శ్రీకోదండరామస్వామివారి
కల్యాణోత్సవం.
05 నుండి 07 వరకు తిరుమల
శ్రీవారి వసంతోత్సవం.
07. తుంబుర తీర్థముక్కోటి.
14 తమిళ నూతన సంవత్సరాది,
డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి.
25. పరుశురామ జయంతి. 26. అక్షయ తృతీయ.
27. శంకర జయంతి. 28. రామానుజ జయంతి.

## మే 2020

01 నుండి 03 వరకు తిరుమల
శ్రీపద్మావతిశ్రీనివాసుల పరిణయమహోత్సవం.
05 నుండి 08 వరకు తిరుచానూరు
శ్రీపద్మావతిఅమ్మవారి వసంతోత్సవం.
05 నుండి 13 వరకు నాగులాపురం
శ్రీవేదనారాయణస్వామివారి బ్రహ్మోత్సవం.
06. నరసింహ జయంతి, తరిగొండ వెంగమాంబ జయంతి.
07. కూర్మ జయంతి. 08. అన్నమాచార్య జయంతి.
12. తిరుపతి గంగజాతర.
15 నుండి 23 వరకు కార్వేటినగరం
శ్రీవేణుగోపాలస్వామివారి బ్రహ్మోత్సవం.
17. హనుమ జయంతి.
28 నుండి జూన్ 05 వరకు తిరుపతి
శ్రీగోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవం.

## జూన్ 2020

01 నుండి 05 వరకు తిరుచానూరు
శ్రీపద్మావతీఅమ్మవారి తెప్పోత్సవం.
02 నుండి 10 వరకు హృషీకేష్ / నారాయణవనం
శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం.
02 నుండి 10 వరకు అప్పలాయగుంట
శ్రీ ప్రసన్నవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం.
04 నుండి 06 వరకు తిరుమల శ్రీవారి జ్యేష్టాభిషేకం.
25 నుండి 27 వరకు శ్రీనివాసమంగాపురం
శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి సాక్షాత్కార వైభవం.



## జూలై 2020

శ్రీవేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళం!!

| ఆదివారం | సోమవారం | మంగళవారం | బుధవారం | గురువారం | శుక్రవారం | శనివారం |
|---|---|---|---|---|---|---|
| | | | 1 | 2 | 3 | 4 |
| 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 |
| 12 | 13 | 14 | 15 | 16 | 17 | 18 |
| 19 | 20 | 21 | 22 | 23 | 24 | 25 |
| 26 | 27 | 28 | 29 | 30 | 31 | |

## ఆగష్టు 2020

శ్రీవేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళం!!

| ఆదివారం | సోమవారం | మంగళవారం | బుధవారం | గురువారం | శుక్రవారం | శనివారం |
|---|---|---|---|---|---|---|
| 30 | 31 | | | | | 1 |
| 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 |
| 9 | 10 | 11 | 12 | 13 | 14 | 15 |
| 16 | 17 | 18 | 19 | 20 | 21 | 22 |
| 23 | 24 | 25 | 26 | 27 | 28 | 29 |

## సెప్టెంబరు2020

శ్రీవేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళం!!

| ఆదివారం | సోమవారం | మంగళవారం | బుధవారం | గురువారం | శుక్రవారం | శనివారం |
|---|---|---|---|---|---|---|
| | | 1 | 2 | 3 | 4 | 5 |
| 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 |
| 13 | 14 | 15 | 16 | 17 | 18 | 19 |
| 20 | 21 | 22 | 23 | 24 | 25 | 26 |
| 27 | 28 | 29 | 30 | | | |

### జూలై 2020

01 నుండి 03 వరకు తిరుపతి
శ్రీగోవిందరాజస్వామివారి జ్యేష్టాభిషేకం.
01 నుండి 04 వరకు తిరుపతి
శ్రీకపిలేశ్వరస్వామివారి పవిత్రోత్సవం.
05. ఆషాడ పూర్ణిమ, గురుపూర్ణిమ, వ్యాస జయంతి.
15 నుండి18 వరకు తిరుపతి
శ్రీకోదండరామస్వామివారి పవిత్రోత్సవం.
16. తిరుమల శ్రీవారి ఆణివర ఆస్థానం.
24. నాగచతుర్థి. 25. గరుడ పంచమి.
29 నుండి ఆగష్టు 01 వరకు తిరుమల శ్రీవారి పవిత్రోత్సవం.
31. వరలక్ష్మీ వ్రతం.

### ఆగష్టు 2020

03. శ్రీ విఖనసాచార్య జయంతి, శ్రీహయగ్రీవ జయంతి.
04. గాయత్రీ జపం.
12. గోకులాష్టమి.
15. స్వాతంత్ర్యదినోత్సవం.
20. బలరామ జయంతి. 21. శ్రీ వరాహ జయంతి.
22. వినాయకచవితి.
30 నుండి సెప్టెంబరు 02 వరకు తిరుచానూరు
శ్రీపద్మావతిఅమ్మవారి పవిత్రోత్సవం.

### సెప్టెంబరు 2020

01. అనంతపద్మనాభవ్రతం.
05. ఉపాధ్యాయుల దినోత్సవం.

19 నుండి 27 వరకు తిరుమల
శ్రీవేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవం.
23. తిరుమల శ్రీవారి గరుడసేవ.
24. తిరుమల శ్రీవారి సువర్ణ రథరంగడోలోత్సవం.



**అక్టోబరు 2020** శ్రీవేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళం!!

| ఆదివారం | సోమవారం | మంగళవారం | బుధవారం | గురువారం | శుక్రవారం | శనివారం |
|---|---|---|---|---|---|---|
| | | | | 1 | 2 | 3 |
| 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 |
| 11 | 12 | 13 | 14 | 15 | 16 | 17 |
| 18 | 19 | 20 | 21 | 22 | 23 | 24 |
| 25 | 26 | 27 | 28 | 29 | 30 | 31 |

**నవంబరు2020** శ్రీవేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళం!!

| ఆదివారం | సోమవారం | మంగళవారం | బుధవారం | గురువారం | శుక్రవారం | శనివారం |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 15 | 16 | 17 | 18 | 19 | 20 | 21 |
| 22 | 23 | 24 | 25 | 26 | 27 | 28 |
| 29 | 30 | | | | | |

**డిసెంబరు2020** శ్రీవేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళం!!

| ఆదివారం | సోమవారం | మంగళవారం | బుధవారం | గురువారం | శుక్రవారం | శనివారం |
|---|---|---|---|---|---|---|
| | | 1 | 2 | 3 | 4 | 5 |
| 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 |
| 13 | 14 | 15 | 16 | 17 | 18 | 19 |
| 20 | 21 | 22 | 23 | 24 | 25 | 26 |
| 27 | 28 | 29 | 30 | 31 | | |

## అక్టోబరు 2020

02. గాంధీ జయంతి.
16 నుండి 24 వరకు తిరుమల
శ్రీవేంకటేశ్వరస్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవం.
20. తిరుమల శ్రీవారి నవరాత్రి గరుడ సేవ.
21. తిరుమల శ్రీవారి పుష్పక విమానము. సరస్వతి పూజ
23. తిరుమల శ్రీవారి స్వర్ణరథోత్సవం.
24. దుర్గాష్టమి, మహర్నవమి, 25. విజయదశమి.

## నవంబరు 2020

11 నుండి 19 వరకు తిరుచానూరు
శ్రీపద్మావతీఅమ్మవారి బ్రహ్మోత్సవం.
14. నరక చతుర్దశి, దీపావళి అమావాస్య.
బాలలదినోత్సవం.
15. శ్రీకేదారగౌరీవ్రతం.
20. తుంగభద్రానదీ పుష్కర ప్రారంభం.
21. తిరుమల శ్రీవారి పుష్పయాగం.
25 నుండి 29 వరకు నారాయణవనం
శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి తెప్పోత్సవం.
27. కైశికద్వాదశి ఆస్థానం.

## డిసెంబరు 2020

03. తిరుపతి శ్రీకపిలేశ్వరస్వామివారి లక్ష బిల్వార్చన.
12. ధన్వంతరీ జయంతి.
16. ధనుర్మాస ప్రారంభం.
25. వైకుంఠ ఏకాదశి, గీతాజయంతి.
25 నుండి 29 వరకు తిరుపతి
శ్రీకపిలేశ్వరస్వామివారి ఆలయంలో తెప్పోత్సవం.
26. స్వామిపుష్కరిణీ తీర్థముక్కోటి.
29. శ్రీ దత్త జయంతి.

*గత సంచిక తరువాయి భాగం...*

## వైకుంఠాన్ని వీడిన లక్ష్మీదేవి

ఎల్లప్పుడు తాను వీడకుండా ఉండే విష్ణువుహృదయ స్థానాన్ని తన్ని అపవిత్రం చేసిన భృగుమహర్షిపై కోపించ కుండా, శిక్షించకుండా, ఆదరించి, పంపడం శ్రీమహాలక్ష్మికి ఏమాత్రం నచ్చలేదు. వివరీతమైన కోపంతో అలిగింది. విష్ణువు బ్రతిమాలినా వినకుండా లక్ష్మీదేవి వైకుంఠాన్ని వీడి పాతాళలోకంలోని కపిలమహాముని ఆశ్రమం చేరుకొని తపస్సు చేస్తూ ఉండింది. మళ్లీ కొంతకాలానికి దేవతల కోరికపై భూలోకంలో కొల్హాసురుడు, కరవీరుడు అనే రాక్షసులను సంహరించి కొల్హాపురక్షేత్రంలో "శ్రీమహాలక్ష్మి"గా నిలిచి ఉంది.



ఆ తర్వాత లక్ష్మీదేవి లేని వైకుంఠంలో ఉండలేని విష్ణువు కూడా ఆమెను వెదుకుతూ చివరకు ఆమె కనపడక భూలోకంలోని ఆదివరాహక్షేత్రం చేరుకొన్నాడు. ఆకలిదప్పులతో అలమటిస్తూ నిలువ నీడలేక తిరుగుతున్న విష్ణువునకు ఈ క్షేత్రంలో "స్వామిపుష్కరిణీతీర్థం", దానికి దక్షిణాన చింతచెట్టూ, దాని కింద ఒక పెద్దపుట్ట కనపడ్డాయి. పెద్ద గుహలాగా ఉన్న ఆ పుట్టతొర్రలో తలదాచుకున్నాడు విష్ణుదేవుడు.

పుట్టలో దాక్కొన్న పరంధాముని దీనావస్థను చూచారు బ్రహ్మదేవుడు, పరమశివుడు. వారు ఇరువురూ కొల్హాపుర క్షేత్రం చేరుకొని శ్రీమహాలక్ష్మికి, స్వామివారి పరిస్థితిని వివరించి, ఆయనను చేరుకోమని చెప్పారు.

కాని ఆమె ఏమాత్రం వినడే లేదు. కనీసం ఆయన ఆకలిదప్పులైనా తీర్చడానికి ఆమెను ఒప్పించారు. ముగ్గురూ వరాహక్షేత్రప్రాంతానికి చేరుకొన్నారు. బ్రహ్మదేవుడు గోవుగా, శివుడు దూడగా, లక్ష్మీదేవి గోపాలికగాను మారారు. గోపాలిక వాటిని ఆ ప్రాంతపు పాలకుడు చోళరాజుకు విక్రయించి వెళ్లిపోయింది.

రాజుగారి పసులమందలో కొత్తగా చేరిన ఈ ఆవూ దూడా ప్రతిరోజు పసులకాపరి కన్ను గప్పి వరాహక్షేత్రంలోని పుట్టలో ఉన్న దేవుడికి పాలు కారుస్తూ ఆకలి తీరుస్తుండేవి. ప్రతిరోజు పుట్టలో ఉన్న స్వామివారికి




05

# దివ్యక్షేత్రం... తిరుమల

- శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, 99856 70152

పాలు కారుస్తున్నందువల్ల, ఇంటివద్ద ఆవు పాలు ఇచ్చేది కాదు. ఇలా ఎందుకు జరుగుతోందో తెలుసుకోవాలన్న ఆసక్తితో పసులకాపరి మాటు వేశాడు.



అంతే! మరునాడు కొండపైన పుట్టలో పాలను కారుస్తున్న ఆవును చూచి మండిపడ్డాడు గొల్లవాడు. కోపంతో ఆవుపైకి గొడ్డలిని విసిరాడు. ఆవు బెదిరి పక్కకు తొలగింది. ఈ అలజడికి పుట్టనుండి పైకి లేచిన శ్రీనివాసుడికి గొడ్డలి బలంగా నుదురుపైన తాకి గాయమై నెత్తురు కారింది. ఉన్నపళంగా నెత్తురు కారుతూ ఉన్న దివ్యపురుషుడు కనపడడంతో దిగ్భ్రమతో ఆ గొల్లవాడు మరణించాడు.

ఈ విషయాన్ని తెలుసుకున్న చోళరాజు పుట్ట దగ్గరికి వచ్చి జరిగిన పొరపాటుకు క్షమించమని శ్రీనివాసుణ్ణి వేడుకొన్నాడు. చేసిన పాపానికి శిక్ష తప్పదు అంటూ శ్రీనివాసుడు చోళరాజును పిశాచివి కమ్మని శపించాడు.



ప్రాధేయపడిన రాజుపై కరుణతో, త్వరలోనే ఆకాశరాజు పుత్రిక పద్మావతిని వివాహమాడుతాననీ ఆ సందర్భంలో రాజు కానుకగా తనకు ఒక బంగారుకిరీటాన్ని ధరింపచేసిన వెంటనే శాపవిముక్తి అవుతుందని వరమిచ్చాడు శ్రీనివాసుడు.

పిదప ఈ భూలోకంలో మొదట దర్శించిన గొల్లవాని సంతతివారికి స్వామివారు కలియుగాంతం వరకు ప్రతిరోజు తొలిదర్శనాన్ని వరంగా ప్రసాదించాడు.

ఆ తర్వాత అక్కడే తిరుగుతున్న శ్రీనివాసునికి వరాహస్వామి కనపడ్డాడు. తన గాథనంతా వినిపించి, తాను ఉండడానికి నూరు అడుగుల స్థలాన్ని దానంగా ఇవ్వవలసిందని అడిగాడు. అందుకు ప్రతిఫలంగా కలియుగాంతం వరకు, భక్తులు మొదట వరాహస్వామిని దర్శించిన తరువాతే తనను దర్శించాలని, అలాగే ప్రతిరోజు తొలిపూజ, తొలినివేదన వరాహస్వామికి జరగాలన్న కట్టడి చేశాడు శ్రీనివాసుడు.



అందుకు అంగీకరించిన వరాహస్వామి కూడ ఆ దానంతోపాటు, శ్రీనివాసుని సేవలో "వకుళమాత"ను నియోగించాడు.

వకుళమాత ఎవరు? ఆమెనే వరాహస్వామి శ్రీనివాసుని సేవకు ఎందుకు నియోగించాడో మనకు అర్థం కావాలంటే మాత్రం ద్వాపరయుగంనాటి కథను తెలుసుకోవాల్సిందే.

*(ఇంకా ఉంది)*




కొద్దిపాటి జ్ఞానంతో మిడిసిపడటం కన్నా అజ్ఞానమే మేలు

# కైంకర్యమే.. తనువు దాల్చితే....

44

– డా॥ కంపల్లె రవిచంద్రన్, 98487 20478



( కంబర్ మహాశయుడు నమ్మాళ్వార్ల దివ్యప్రభావాన్ని స్తుతించారు. ఇందుకు ఎంతో సంతోషపడ్డ మధురకవులు శ్రీనమ్మాళ్వార్లవారి దివ్య వైభవాన్ని, వారు అనుగ్రహించిన దివ్యప్రబంధాలను తలచుకొని మైమరచి 'కణ్ణినుణ్ శిఱుత్తాంబినాల్' గానం చేయడం ఈ సంచికలో చదువవచ్చు.)

నావినాల్ నవిత్తు ఇన్బమెయ్‌దినేన్,
మేవినేన్ అవన్ పొన్నడి మెయ్‌మ్మైయే,
తేవు మఱ్ఱు అఱియేన్ కురుగూర్ నమ్బి,
పావి నిన్నిశై పాడి త్తిరివనే. 2

నావినాల్ నవిత్తు = కురుకూర్‌నమ్బి అయిన నమ్మాళ్వార్ల తిరునామాన్ని నోటితో పల్కి, ఇన్బమ్ ఎయ్‌ది నేన్= గొప్ప ఆనందాన్ని పొందాను, అవన్ పొన్ అడి= బంగారువలె భోగ్యమైన ఆ ఆళ్వార్ల శ్రీచరణాలను, మెయ్ మ్మైయే మేవినేన్= ఇహలోక, పరలోకాలు రెండిటిలో ఉద్దేశ్యంగా ఆశ్రయించాను, తేవు మఱ్ఱు అఱియేన్= (ప్రాపకంగా ఉండే) వేఱొక దైవాన్ని తెలియను, కురుకూర్ నమ్బి= కురుకూర్‌లోని పూర్ణులైన ఆళ్వార్ల యొక్క, పావిన్ ఇన్ ఇశై= పాశురాలలోని భోగ్యమైన రాగాన్ని, పాడి త్తిరివనే= ఆనందంతో పాడి, అదే జీవనధారంగా జీవిస్తాను.

మొదటి పాశురంలో– నమ్మాళ్వార్లు తమకు మధురంగా ఉండే సంగతిని గూర్చి మధురకవులు తెలిపారు. ఈ పాశురంలో– వారి సూక్తే తమకు జీవితమంతా ప్రాణాన్ని నిలిపే ధారకంగా ఉండే రీతినిగూర్చి తెల్పుతున్నారు.

(నావినాల్ నవిత్తు ఇన్బమ్ ఎయ్‌దినేన్) నా నోటితో కురుకూర్ నమ్బియొక్క తిరునామాన్ని పల్కి మహానందాన్ని పొందాను. "తెన్‌కురుకూర్ నమ్బి ఎన్ఱక్కాల్ అణ్ణిక్కుమ్" (దక్షిణదిక్కులో గల తిరుక్కురుకూర్‌లోని గుణ పూర్ణులైన నమ్మాళ్వార్లను భావిస్తే, వారి నామాన్ని పల్కితే మధురంగా ఉంటుంది) అని అంటూ గడచిన పాశురంలో పల్కిన దానినే ప్రేమాతిశయంచేత మళ్లీ పల్కుతున్నారు. "నావిల్ నవిత్తు"– అని అంటున్నారు. మనఃపూర్వకంగా పలుకకుండా, నోటితో పల్కినంతమాత్రంలోనే గొప్ప ఆనందం కల్గినందున, తిరిగి పల్కడం అపరిహారణీయం (మానలేనిది) కదా!


(నావినాల్ నవిత్తు)– భగవానునిగూర్చి లోకానికి తెలిపి ఉపకారం చేసిన ఆచార్యుని స్తుతించడంకోసమే సృష్టింపబడిన జిహ్వతో దానిని కల్గి ఉన్నందున తగిన ఫలాన్ని పొందాను– అనే అర్థాన్ని కూడా గ్రహించవచ్చు. "ప్రత్యక్షే గురవః స్తుత్యాః పరోక్షే మిత్రబాంధవాః, కార్యాంతే దాస భృత్యాశ్చ న కదాచన పుత్రకాః" (ప్రత్యక్షంలో ఆచార్యులు స్తుతించదగినవారు. స్నేహితులు, బంధువులు పరోక్షంలో స్తుతించదగిన వారు. వారు చేయవలసిన కార్యాలను పూర్తిచేసిన తరువాత, పనిచేసేవారు, సేవకులు స్తుతించదగ్గవారు. మన పుత్రులు మాత్రం ఏనాడూ పొగడ దగ్గవారు కారు) అనే రీతిలో ఆచార్యుని ప్రత్యక్షంలో స్తుతించడం కర్తవ్యం కదా! భగవానుడు జిహ్వను సృష్టించడం ఎందుకు? అంటే, ఆచార్యుని స్తుతించడం కోసమే. ఆప్రయోజనాన్ని పొందిన వాడను నేను ఒక్కడనే– అని అంటున్నారు.

**(ఇన్బమ్ ఎయ్‌దినేన్) - "వీవిల్ ఇన్బమ్ మిక ఎల్లై నికళ్‌న్దనన్ మేవియే"** (తిరువాయ్-4-5-3) (అనుభవించి, అంతంలేని ఆనందం యొక్క చరమావధిలో నిలచాను) అని అంటూ నమ్మాళ్వార్లు భగవానుని చేరి తాము పొందిన మహానందాన్ని- నేను ఆళ్వార్లను ఆశ్రయించినందువల్లనే పొందాను-అని అంటున్నారు. **"శిన్దైయాలుమ్ శొల్లాలుమ్ శెయ్‌కైయినాలుమ్ దేవపిరానైయే తన్దై తాయ్ ఎన్ఱడైన్ద వణ్ కురుకూర్ శడకోపన్"** (తిరువాయ్-6-5-11) (తమ మనస్సుతో, వాక్కుతో, కృత్యాలతో నిత్యసూరినాయకుడే తమ తల్లి తండ్రి-అని భావించి ఆశ్రయించిన గొప్ప తిరుక్కురుకూర్‌లోని శఠకోపులు) అని త్రికరణాలతో భగవానుణ్ణి ఆశ్రయించి, ఆళ్వార్లు పొందిన మహానందాన్ని ఆళ్వార్లనుగూర్చి నేను పల్కడం వల్లనే పొందాను - అని అంటున్నారు.

ఆ రీతిలో కాకుండా, నోటితో అనేక పాపాలను చేసినందువల్ల, ఆ పాపాల ఫలాన్ని అనుభవించడం కోసం నిరంతరం నరకంలోనే జనన, మరణాలు సంభవించే రీతిలో పాపాలను చేసిన తమ జిహ్వతో మహానందాన్ని పొందడాన్ని గమనించి, ఆశ్చర్యంతో పల్కుతున్నారని కూడా చెప్పవచ్చు.

**(మేవినేన్ అవన్ పొన్నడి)** బంగారంవలె ఆశ పడదగిన ఆళ్వార్ల శ్రీచరణాలను ఉద్దేశ్యంగా ఆశ్రయించాను. **"తానహం ద్విషత క్రూరాన్ సంసారేషు నరాధమాన్, క్షిపామ్యజస్ర మశుభాన్ ఆసురీష్వేవ యోనిషు"** (గీత-16-19) (నన్ను ద్వేషించేవారు, క్రూరులు, మానవులలో అధములు, పాపకారులు అయిన వారిని సంసారంలో, అందులోను, అసురజాతిలోనే ఎల్లప్పుడు పడదోస్తాను) అనే రీతిలో సహజసంబంధాన్ని కల్గిన భగవానుడుకూడా నన్ను చేయివిడచినదశలో నన్ను పరిగ్రహించిన ఆళ్వార్ల గొప్ప శ్రీచరణాల వద్ద పొందికగా చేరగలిగాను.

*(ఇంకా ఉంది)*



### వైకుంఠపాళి
### :: 49- సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 ఋ | | 2 కా | ల | 3 కే | తు | 4 దు | | 5 కు |
| ష్య | | శి | | తు | | లి | | బే |
| 6 మూ | ర్తి | | 7 శ్యా | మ | ల | | 8 సౌ | రు |
| క | | 9 ఫ | | తి | | 10 కా | | డు |
| 11 ప | ద్మా | ల | య | | 12 పు | ళిం | ది | |
| ర్వ | | ము | | 13 దే | | ది | | 14 కం |
| 15 త | పం | | 16 ర | వ | ము | | 17 చా | కు |
| ము | | 18 ఉ | | సే | | 19 వా | | డు |
| | | 20 ష | డా | న | ను | డు | | |



నిజమైన మతాన్ని నమ్మేవాడు అణకువతో ఉంటాడు

ఆయుర్వేదం

# అపార ఔషధ గుణాల నిధులు వ్యర్థపదార్థాలు

- డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ, 90007 61390

'అమంత్రమక్షరం నాస్తి నాస్తి మూల మనౌషధం, అయోగ్యః పురుషోనాస్తి యోజకస్తత్ర దుర్లభః' - అంటుంది మన వేదవాఙ్మయం.

అక్షరం కాని మంత్రం, ఔషధం కాని మొక్క, ఏదో ఒక నిపుణత, యోగ్యత లేని పురుషుడు ఈ లోకంలో ఉండరని స్థూలంగా అర్థం చెప్పుకోవచ్చు.

విశ్వంలో ప్రకృతిలో మనకు లభ్యమయ్యే, వ్యర్థపదార్థాలుగా భావించబడుతున్న పదార్థాలలో కూడా సృష్టి కర్త అపారమైన, అత్యంత శక్తివంతమైన రసాయన అంశాలను, ఔషధశక్తులను, ఔషధ గుణాలను నిక్షిప్తీకరించి మానవాళి ఆరోగ్య పరిరక్షణకు ప్రకృతి ద్వారా ప్రసాదించాడు.

వాటిపై అవగాహనాలోపం, నిర్లక్ష్యం ఇత్యాది కారణాలచేత వాటిని సక్రమంగా సద్వినియోగం చేసుకోలేక ప్రకృతి కల్పించే సహజసిద్ధ ఆరోగ్యభాగ్యాన్ని పొందే అవకాశాన్ని కోల్పోతున్నాం.

ఈ నేపథ్యంలో వ్యర్థపదార్థాలుగా మనం భావించే ఇలాంటి ప్రకృతి సిద్ధ ఔషధాలను సద్వినియోగం చేసుకుంటే మెండైన ఆరోగ్యాన్ని మనం పొందిన వారమవుతాము. వ్యర్థపదార్థాలు మన ఆరోగ్య పరిరక్షణకు ఎలా ఉపయోగపడతాయో ప్రస్తుతం తెలుసుకుందాం...

## అరటి

**చర్మ రోగాలు–** ముక్కలుగా కత్తిరించిన అరటిపండు తొక్కలు, కొబ్బరినూనె సమానంగా తీసుకొని సన్నని మంటపై తొక్కలు నల్లగా అయ్యేంతవరకు నూనెను మరిగించి, దించి, చల్లార్చి, వడగట్టి, నిల్వ ఉంచుకొని పై పూత మందుగా లేపనం చేస్తుంటే తామరలాంటి చర్మ వ్యాధులు, కాలి పగుళ్ళు తగ్గిపోతాయి.



**మొటిమలు, దద్దుర్లకు–** అరటిపండు తొక్క లోపలివైపున ఉన్న తెల్లని పదార్థంతో ఆయా ప్రాంతాల్లో రుద్దుతుంటే మొటిమలు, దద్దుర్లు లాంటి సమస్యలేకాక పులిపిర్లు, నోటిపూత లాంటివి కూడా తగ్గిపోతాయి.

**తెల్లమచ్చలు–** ఎండిన అరటి ఆకులను కాల్చి, బూడిదచేసి, చల్లార్చి, జల్లించిన పొడి స్వచ్ఛమైన పసుపు పొడి సమానంగా కలిపి వుంచుకొని రోజు రెండు పూటలా పూటకు ఒక గ్రాము ఔషధాన్ని తగినంత తేనెతో కలిపి సేవిస్తుంటే తెల్లమచ్చలు లేదా తెల్లపొడ లేదా తెల్లబొల్లి అని చెప్పబడే వ్యాధి త్వరగా తగ్గిపోతుంది.

**దగ్గుకు–** ఒక చిటికెడు అరటి ఆకు బూడిదను తగినంత తేనెతో కలిపి చిన్న పిల్లలకు, ఒక గ్రాము బూడిదను తగినంత తేనెతో కలిపి పెద్దలకు ఇస్తుంటే వివిధ రకాల దగ్గులు చాలా త్వరగా తగ్గిపోతాయి.



## కమలా పళ్ళ తొక్కలు

**పెదాలు నలుపు తగ్గేందుకు-** ఎండిన కమలా తొక్కల్ని మెత్తగా చూర్ణించి, జల్లించి ఉంచుకొని రోజు ఒకసారి తగినంత పొడిలో తగినంత తేనె కలిపి పై పూత మందుగా లేపనం చేస్తుంటే త్వరగా సమస్య తగ్గుతుంది.

## మామిడి జీడి

**చుండ్రు సమస్య తగ్గేందుకు-** వారంలో రెండుసార్లు తగినంత మామిడి జీడి పొడిలో తగినన్ని నీళ్ళు చేర్చి పేస్టులా చేసి తలకంత పట్టించి అరగంటాగి కుంకుడు లేదా శీకాయతో తలస్నానం చేస్తుంటే చాలా చక్కటి ఫలితం కలుగుతుంది.

**పైల్స్-** మామిడి జీడిని ముక్కలుగా చేసి ఎండించి చేసిన చూర్ణాన్ని రోజు ఉదయం, సాయంత్రం పూటకు 1-2



గ్రాముల వంతున 100 మి.లీ. తాజా మజ్జిగలో కలిపి సేవిస్తుంటే రక్తస్రావంతో కూడిన మొలల వ్యాధి తగ్గుతుంది.

**దగ్గు, ఉబ్బసం, కడుపులో మంట-** మామిడి జీడి పొడిని పూటకు 1-2 గ్రాముల వంతున రెండు పూటలా తగినంత పంచదార కలిపి సేవిస్తుంటే కడుపులో మంట, తగినంత తేనెతో కలిపి సేవిస్తుంటే వివిధ రకాల దగ్గులు తగ్గుతాయి. అంతేకాదు. ఈ ఔషధ సేవన వల్ల స్త్రీల తెల్లబట్ట సమస్య కూడా తగ్గిపోతుంది.

## కొబ్బరి పీచు- చిప్పలు

**దీర్ఘకాలిక విరేచనాలు తగ్గేందుకు-** రోజు రెండుపూటలా పూటకు 200 మి.లీ. నీటిలో కొబ్బరికాయను వలిచేటప్పుడు రాలిన పొట్టును 15 గ్రాములు కలిపి 100 మి.లీ. నీరు మిగిలేలా మరిగించి, చల్లార్చి, వడగట్టి సేవిస్తుండాలి.



**కడుపులో మంటకు-** కొబ్బరి పీచును కాల్చి బూడిద చేసి చల్లార్చి, జల్లించి ఉంచుకొని ఉదయం, సాయంత్రం పూటకు ఒక గ్రాము బూడిదను 200 మి.లీ. తాజా మజ్జిగలో కలిపి సేవిస్తుండాలి.

**ఎగ్జిమా, తామరలాంటి చర్మవ్యాధులకు-** కొబ్బరి చిప్పలని బాగా ఎండించి ముక్కలుగా చేసి కాల్చి బూడిద చేసి చల్లార్చి, జల్లించి ఉంచుకొని రోజు ఒకసారి తగినంత బూడిదలో తగినంత కొబ్బరి నూనె చేర్చి పల్చటి పేస్టులా చేసి లేపనం చేస్తుంటే ఎగ్జిమా, తామరలాంటి చర్మవాధ్యులు త్వరగా తగ్గిపోతాయి.

# తిరుమల శ్రీవారికి శాత్తుమొఱసేవ

- ఆచార్య కోదండరామయ్య

తిరుమల దేవాలయాన్ని 11వ శతాబ్ది ఆరంభంలో శేషాంశగా అవతరించిన రామానుజాచార్యులవారు శ్రీ వేంకటాచలపతిని పూర్వసూరులు స్తుతించిన విధంగా శ్రీమన్నారాయణునిగా శంఖచక్రలాంఛనములతో అలంకరించి తిరుమల తిరుపతి దేవాలయ ఆచారవ్యవహారాలను తమ శిష్యుల ద్వారా ఎట్టి ఏమరుపాటు కలుగకుండా సకలవిధకైంకర్యములు నిర్వహింపజేసినారు. శ్రీ వైఖానసభగవచ్ఛాస్త్ర విధానంతో స్వామివారికి అర్చనలు, ఆళ్వారులదివ్యప్రబంధానుసంధానంతో సేవలు జరిగేలా కట్టుబాట్లు చేశారు. అందులోనిదే ఈ శాత్తుమొఱసేవ. మన దేశంలోని 108 దివ్యతిరుపతుల్లో ఈ సేవ ప్రతినిత్యమూ జరుగుతున్నాకూడా **"తిరుమల శాత్తుమొఱ"** సేవకు ఉన్న విశేషం చెప్పనలవి కాదు.

**"శాత్తుమొఱై"** అంటే **"మంగళాశాసనం"** లేదా **"దివ్యపరిసమాప్తి"** అని అర్థం. ద్రవిడవేదాలు శ్రీనివాసుణ్ణి గర్భాలయంలో ప్రతినిత్యం **"తోమాలసేవ"** దివ్యపరీమళపుష్పసేవలో అనుసంధానించబడతాయి. తోమాలసేవ తరువాత శ్రీనివాసునికి అర్చన చేయబడుతుంది. ఈ అర్చనలో పఠించే నామాలచివర "శ్రీవేంకటేశాయనమః" అని ప్రతినామానికి అష్టోత్తరశతనామావళిలో ఉచ్ఛరించడం ఒక ప్రత్యేకమైన అనుభూతి. అర్చనానంతరదర్శనంతో స్వామివారికి ప్రాతఃకాల (దివ్యార్చనలు) తిరువారాధన పూర్తవుతుంది. వెంటనే శుద్ధి, ఆరగింపుసేవ. ఈ ఆరగింపుసేవ ఎన్నిగంగాళములతో జరుగుతుందో చెప్పలేము. బహుశా ప్రతి నిత్యం ఇన్ని విధాల ఆరగింపుసేవను మనదేశంలో ఏ దేవాలయంలోనూ చూడము. చూడలేము కూడ. ఈ అన్నప్రసాదాలు ఏమేమి చేయాలో, ఎంతెంత చేయాలో, ఏయే పరిమాణంలో చేయాలో అన్నీకూడా నిర్దేశింపబడినవే. ఇవికాక భక్తులు కోరిన ప్రసాదములూ చేస్తారు. ఇక తిరుమలలడ్డూ గురించైతే చెప్పక్కరలేదు. నిరంతరము లక్షలాదిగా వచ్చే మహాభక్తుల ఆకలి శాంతించటానికై ఈ విధమైన నియమాలను ఆచార్యులవారే కల్పించారట. ఈ ఆరగింపుసమయంలో రెండు పెద్దపెద్ద గంటలు (కంచువి) మ్రోగిస్తారు. వీటి నాదము చంద్రగిరి కోటవరకు వినిపిస్తుందట. అలాగే తిరుమలకొండల్లో ఉన్న చుట్టూ దేవాలయములు, తీర్థాల్లోని భగవన్మూర్తులకు ఇదే ఆరగింపు గుర్తు. ఈ ఘంటానాదము తిరుమలగిరుల్లో ప్రతిధ్వనించటం గమనించొచ్చు. దీనికే **"శాత్తుమొఱఘంట"** అనిపేరు. ఈ ఘంటను మ్రోగించేపద్ధతి ఆశ్చర్యంగా ఉంటుంది. రెండుచేతుల్లో ఘంటలనడుమ కూర్చొని ఈ ఘంటలు బలంగా మ్రోగించాలి. వీటిని ఈ సమయంలో తప్ప వేరొకసమయాల్లో మ్రోగించరు. వీటిని మ్రోగించటానికి "ఘంటాపాణి"గా పూర్వం ఒక భాగవతుడు ఉండెడివాడట. స్వామివారికి మహానివేదన(తళిహ) పూర్తియైన పిదప దేవాలయంలోను, చుట్టుమందిరముల బలిపీఠములకు బలిహరణ వేయబడుతుంది.

పిమ్మట భగవద్రామానుజ సన్నిధిలో వ్రేలాడే ఘంటను "శాత్తుమొఱసేవ" సూచకముగా మ్రోగిస్తారు. అప్పుడు భగవద్రామానుజాచార్యులచే సకలవిధ కైంకర్యములను అవిచ్ఛిన్నముగా

**05-01-2020న చిన్నశాత్తుమొఱ మరియు 15-01-2020న పెద్దశాత్తుమొఱ సందర్భంగా...**

జరిపించటానికి ఏర్పరచిన తిరుమల తిరుపతుల జియ్యం గార్లు అనాది పరంపరకు చెందినవారు వస్తారు. తిరుపతి– తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామివారికి ప్రాతఃకాల సేవల నుండి రాత్రి ఏకాంతసేవల వరకు సమస్తసేవలను అత్యంత భక్తిశ్రద్ధలతో, ద్రావిడవేదాధ్యయనంతో జరిపించటానికే ఈ జీయరుస్వాములు, మఠాధిపతులు నియమింపబడ్డారు. వీరు తప్పక సన్యాసము స్వీకరించి కేవలము తిరుమల తిరుపతి దేవస్థానముల కైంకర్య ధురంధరులుగా అంకితము కావలసి ఉంటుంది. తిరుపతి జియ్యంగార్లు కైంకర్యమే ప్రధానంగా కలవారు. వీరు ఈ క్షేత్రాన్ని విడిచి వెళ్లరు. ఈ సేవలన్నిం టిని జరిపించటానికై పెద్ద, చిన్నజియ్యంగార్లు వేంచేసి ఉంటారు. వీరు ఉభయ వేదాంతములను చక్కగా తెలిసిన వారై నిరంతరము శ్రీనివాసుని శాత్తుమొఱసేవాకైంకర్యం లోనూ, సేవాకాలములోనూ పాల్గొనే భాగవతులకు ఆతిథ్యం సమకూరుస్తారు. వీరు కాషాయంబరధారులై, ఊర్ధ్వపుండ్ర ములు ధరించినవారై, తులసితామర పూసలను ధరించి, చేతిలో త్రివిధతత్త్వములను సూచించు త్రిదండమును ధరించి అపరరామానుజులవలె వేంచేసి ఈ శాత్తుమొఱసేవ జరిపిస్తారు.

ప్రస్తుతము ఈ శాత్తుమొఱసేవ ఉదయం 6 గంటల 30 నిముషములలోపుగా జరుగుతోంది. ఈ సందర్భమున భారతదేశంలోని శ్రీవైష్ణవశాఖాసంబంధితస్వాములను ఈ గోష్ఠికి అనుమతిస్తారు. వీరు గర్భచక్రాంకితులుగానో, తప్త చక్రాంకితులుగానో ఉండాలి. శుద్ధమైన వైదికవేషము తప్పనిసరిగా కల్గిఉండాలి. ఈ శాత్తుమొఱసేవలో స్వాములు శ్రీవారికి ఎదురెదురుగా రెండువరుసలలో నిలబడతారు. తిరుపతిదేవస్థాన యతీశ్వరులు (జీయంగారు) శ్రీనివాసుని గడపదాటి లోపలనుండి అక్కడ అర్చనకు సిద్ధంగా ఉన్న అర్చకస్వాములకు దోసిలినిండా తులసిని తీసి అందిస్తారు. వారు ఆ సమయమున స్వామిపాదాలకు తులసి సమర్పి స్తారు. ఈ సందర్భంగా ప్రాతఃకాలంలో అనుసంధానంచేసిన మహాప్రబంధము చివరిపాశురములను అనగా తిరుప్పావై (గోదాదేవి విరచితము)లోని 29, 30 పాశురాలను రాగ భావయుక్తముగా పరవశముతో గానము కైంకర్యముగా సమర్పిస్తారు. ఒక్కొక్క పాశురము రెండుపర్యాయాలు పఠిస్తారు. అందు మొదటిపాశురము

**"శిత్తం శిరుకాలే... మాత్తే లొరెంబావాయ్"**

అంటూ పాడతారు. అంటే ఓ గోవిందా! దాసులమైన మేము నీకు ఈ మంగళాశాసనము ఈ తెల్లవారుజామున చేసినది నీవిచ్చే వాద్యవిశేషమునకు కాదు సుమా! ముల్లోకమున అవతరించిన నీవు మాకు అంగరంగకైంకర్యమును ఇచ్చి మమ్ము అంగీకరించుము స్వామీ! వేంకటాచలపతీ! సర్వ కాలాల్లోనూ, ఎన్ని జన్మలెత్తినా నీ సంబంధము గలవారమై నీ కైంకర్యములోనే దాసులుగా ఉండేట్లు సంకల్పించుము. దీనికి భిన్నమైన మాకోర్కెలు మాకు పోగొట్టు. విషయాం తరములలో మాకు వాసన కలుగకుండునట్లు అనుగ్రహిం చుము. ఇదియే మా అభిప్రాయము అంటూ మరల తిరు ప్పావైలోని 30వపాశురము గానం చేస్తారు.

**"వంగకడల్ కడైన్ద మాదవనై కేశవనై....**
**ఎంగుం తిరువరుల్పైత్తు ఇమ్బురువ రెమ్బావాయ్"**

అంటూ దీన్నికూడా రెండు పర్యాయాలు రాగంతో భావయుక్తంగా ముగిస్తారు. అంటే గోకులంలో చంద్రబింబ సదృశాననులై ఉన్న గోపబాలికలు గోదాదేవి పాలకడలిని చిలికిన మాధవుడు కేశవుడైన శ్రీనివాసునిసన్నిధికి పోయి తాము పొందిన పురుషార్థప్రకారము గురించి పెరియా ళ్వారుల (శ్రీవిష్ణుచిత్తుల) కుమార్తె ద్రావిడములో అనుగ్ర హించిన ఈ ముప్పైపాశురాలను క్రమముతప్పక ఈ లోకములో ఎవరు గానము చేస్తారో వారు శ్రీ వేంకటా చలపతి సంపూర్ణకృపకు పాత్రులై బ్రహ్మానందమును పొందు తారు అని రెండుమార్లు గానంచేసి ముగిస్తారు. అనగా ద్రవిడవేదాధ్యయనం ఆనాటిఉదయానికి పరిసమాప్తి. దీనినే శాత్తుమొఱగా భావిస్తారు.

ఆ తర్వాత ముద్దకర్పూరం వెలిగించి ద్రవిడవేదము నకు ఓంకారస్వరూపంగా ఉన్న "పల్లాండు పల్లాండు పల్లాయి రత్తాండు" అంటూ కర్పూరహారతిని జీయరుస్వామి



నమ్రత తనను తాను అంచనా వేసుకోవటానికి ఒక సాధనం

వెలిగించి అందించగా అర్చకస్వాములు శ్రీ వేంకటేశ్వర స్వామికి ఆపాదమస్తకమునకు, పాంచజన్యశంఖమునకు, శ్రీసుదర్శనచక్రమునకు, వక్షఃస్థలంలోని అలమేల్మంగై తాయార్లకు, భోగశ్రీనివాసునకు ఈ పల్లాండుపాశురము ముగిసేవరకు ఇస్తారు. స్వామికి ఇచ్చే కర్పూరహారతులలో ఇదే విశిష్టమైన హారతి. పల్లాండు- పల్లాండు అంటే రక్ష రక్ష, వర్ధిల్లు - వర్ధిల్లు అని ప్రేమాతిశయముతో పది వేలుగా వర్ధిల్లుమని మంగళాశాసనం చేయటం. స్వామిని వర్ధిల్లు అని వారి భక్తులుకాక మరెవ్వరు చెప్పగలరు? ఈ పల్లాండును శ్రీవిష్ణుచిత్తులవారు తమ గజారోహణ సమయంలో గరుడవాహనారూఢుడై ఆవిర్భవించిన శ్రీమన్నారాయణునకు చేసిన మంగళాశాసనము. ఈ పాశురము ఓంకారంతో సమానమైనది. ప్రతి శ్రీవైష్ణవ దేవాలయంలో ఈ పాశురంతోనే మంగళాశాసనం చేస్తారు. పరమభాగవతోత్తములు చిన్నవారిని పల్లాండు పల్లాండు అని దీవిస్తారు. ఆళ్వారులు మనస్వామి వైభవమునకు దిష్టి తగులుతుందేమో అని భావించి తల్లిభావనపొంది చేసిన ఈ పాశురము ద్రవిడవేదమునకు తలమానికము. ఇది శాత్తుమొఱ హారతి.

శాత్తుమొఱసేవలో పాల్గొన్న స్వాములకు స్వామివారిసన్నిధిలో చందనము, తీర్థము, తులసి, దివ్యశఠారి అనుగ్రహిస్తారు. ఆ సమయంలో సర్వదేశ సర్వకాలము లందూ తిరుగులేని భగవద్రామానుజాజ్ఞ నిరాఘాటముగా వర్ధిల్లుగాక అనీ, అది దిగంతములకు వ్యాపించి, లోక హితము కలుగచేయాలని శ్రీరంగమునకు శ్రీమహాలక్ష్మికి మంగళమనీ, భక్తిసంప్రదాయముతో యావద్భారతమున శ్రీమన్నారాయణుని తత్త్వమును ప్రచారముచేసిన ఆళ్వారులకు, వరవరమునీంద్రులకు, దివ్యప్రబంధములకు, నూట ఎనిమిది తిరుపతులకు తిరునామములు వర్ధిల్లాలని గానము చేస్తారు.

శ్రీ వేంకటేశ్వరునిసన్నిధిలో ఏకాంతముగా జరిగే శాత్తుమొఱసేవ, అదే సమయంలో శ్రీ భాష్యకార్లుసన్నిధిలో బహిరంగంగా యావన్మందికి దర్శనయోగ్యంగా మరలా జరుగుతుంది. ఈ సేవలో పాల్గొన్న స్వాములకు కదంబ



ప్రసాదంతోపాటు శ్రీమన్నారాయణరామానుజ పెదజీయరు స్వామివారు ఏర్పాటుచేసిన దధ్యోదనమును కూడా ప్రసాదంగా ఇస్తారు.

ఇంతటి మహామహిమోపేతమైన ఈ శాత్తుమొఱ సేవ అంటే ఈ తిరుమలరాయడికి ఎనలేని ప్రీతికరము. ఈ సేవ ఒక్కటే వేంకటాచలపతికి విశ్రాంతి కలిగించి తన భక్తులు ఆళ్వారుల దివ్యప్రబంధము పాశురములను తనివి తీరా వినగలిగేసేవ. ఈ సేవ ముగిసిన పిదప సర్వదర్శనము ప్రారంభమవుతుంది. ఇదీ తిరుమల శ్రీస్వామివారి "శాత్తుమొఱసేవ" వైభవం మరియు ప్రసిద్ధి.

వచ్చే సంచిక నుండి

కొత్త శీర్షిక

# సంస్కృతం నేర్చుకుందాం..!!

నిర్వహణ - మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య & కిరణ్ భట్

## పదునాలుగు మాహేశ్వరసూత్రాలు

మానవులలో పరస్పరం అభిప్రాయం ప్రకటించడానికి శబ్దరూపమైన భాష ముఖ్యమైన సాధనంగా ఉన్నది. అక్షరాలూ, పదాలూ, వాక్యాలుగా ఉన్న భాషతో వ్యవహరించి మనం మన నిత్యవ్యవహారాన్ని నిర్వహించుకుంటున్నాం. అక్షరాల కలయికతో పదాలు, వాటి కలయికతో వాక్యాలు ఏర్పడుతున్నాయి.

ఇందులో భాషకు అతిముఖ్యమైన మూలం అక్షరాలే! వాటిని అచ్చులనీ, హల్లులనీ రెండు రకాలుగా విభజించారు. అక్షరాల ఉత్పత్తినీ, వాటి సంఖ్యనూ, వాటి స్వరూపాన్నీ నిరూపించినవారిలో అగ్రగణ్యుడు పాణిని.

క్రీస్తుకు పూర్వం ఐదవ శతాబ్దికి చెందిన పాణిని సంస్కృతభాషకు రూపొందించిన వ్యాకరణం లోకోత్తరమైనదని ప్రపంచంలోని భాషాశాస్త్రజ్ఞులందరూ ముక్తకంఠంతో అంగీకరించారు. ఈ అక్షరాలకు మూలం మాహేశ్వర సూత్రాలు. ఈ సూత్రాలకు సంబంధించిన క్రింది వృత్తాంతం గమనించదగి ఉన్నది.

నృత్తావసానే నటరాజరాజో ననాద ఢక్కాం నవపంచవారమ్।
ఉద్ధర్తుకామః సనకాదిసిద్ధాన్ ఏతద్విమర్శే శివసూత్రజాలమ్॥

సనకాదిమహర్షులు మహేశ్వరుని సన్నిధికి వెళ్లి నమస్కరించి 'స్వామీ! భాషాసారమైన తత్త్వం మాకు తెలియజేయండి', అని సవినయంగా ప్రార్థించారు. అందుకు సమాధానంగా శివుడు తన చేతిలోని డమరుకాన్ని తన నృత్తం పూర్తి అయిన తరువాత పదునాలుగుసార్లు మ్రోగించాడు. ఆ మ్రోతలు పదునాలుగు సూత్రాలుగా రూపొందాయి. మహేశ్వరుని నుండి వచ్చిన సూత్రాలు కాన వాటికి 'మాహేశ్వర సూత్రాలు' అన్న వ్యవహారం కలిగింది.

పాణిని ఎనిమిది అధ్యాయాలలో రచించిన వ్యాక రణశాస్త్రానికి మూలం ఈ మాహేశ్వరసూత్రాలే. ఆ సూత్రాలివి-1)అఇఉణ్ 2)ఋఌక్ 3)ఏఓఙ్ 4)ఐఔచ్ 5)హయవరట్ 6)లణ్ 7)ఞమఙణనమ్ 8)ఝభఞ్ 9)ఘఢధష్ 10)జబగడదశ్ 11)ఖఫఛఠథచటతవ్ 12)కపయ్ 13)శషసర్ 14)హల్.

ఇందులో మొదటి నాలుగు సూత్రాలు అచ్చులనూ, తరువాతి పదిసూత్రాలూ హల్లులనూ నిర్దేశిస్తున్నాయి. అచ్చులను స్వరాలనీ, హల్లులను వ్యంజనాలనీ కూడా అంటారు. 'స్వేన రాజతే ఇతి స్వరః'- స్వయంగా ప్రకాశించేది స్వరం. ఇతరాక్షరాల సాయం లేకుండానే పలకబడేదని అర్థం. 'స్వరేణ వ్యజ్యతే ఇతి వ్యంజనమ్' - స్వరం సాయంతో పలికేది వ్యంజనం.

ఇంగ్లీషులోని అక్షరక్రమంలో అచ్చులు, హల్లులు కలగాపులగంగా కలిసి ఉంటాయి. సంస్కృతంలో అలా కాక అచ్చులు, హల్లులు విడివిడిగా పేర్కొనబడ్డాయన్న విషయం గ్రహించాలి. అక్షరాలకు అచ్చులు, హల్లులు అనే పేర్లు రావడానికి కూడా కారణం మాహేశ్వరసూత్రాలే. ఇప్పుడు మనం

'ప్రైమ్ మినిష్టర్' అనడానికి 'పి.యం.' అనీ, 'ఛీఫ్ మినిష్టర్' అనడానికి 'సి.యం' అనీ సంక్షిప్తంగా వ్యవ హరిస్తాం. ఈ పద్ధతికి హేతువు గూడా సంస్కృతమే!

పదునాల్గు సూత్రాలలో మొదటి సూత్రంలోని మొదటి 'అ' అనే అక్షరాన్నీ, నాలుగవసూత్రంలోని చివరి దైన 'చ్' అనే చకారాన్నీ కల్పి ఈ మధ్యలోని వర్ణాలు అచ్చులని చెప్పడమయింది. అట్లే, ఐదవ సూత్రంలోని మొదటి అక్షరమైన 'హ' వర్ణాన్నీ, 14వసూత్రంలో చివరిదైన 'ల్' కారాన్నీ కలిపి హల్లులు అని చెప్పడమయింది. ఈ విధంగా సంక్షిప్తంగా చెప్పే ప్రక్రియకు మాహేశ్వరసూత్రాలే శ్రీకారం చుట్టాయని చెప్పవచ్చు. పై వివరణను బట్టి అక్షరసంఖ్య, అక్షరక్రమం, అచ్చులు, హల్లులు అనే పేర్లు ఎలా రూపొందాయో తెలుసుకోవచ్చు.

ప్రపంచభాషలలో గొప్పభాషగా అందరూ అంగీకరించిన భాష సంస్కృతం. సంస్కృతం నుండి ఎన్నో భాషలు ఆవిర్భవించాయి. సంస్కృతం ప్రాచీన భాష మాత్రమే కాదు సమృద్ధ భాష కూడ. ప్రపంచ భాషలలో సాటిలేని, పోటీలేని భాష సంస్కృతం. 'సంస్కృతం' అంటే సంస్కరించబడ్డది అని అర్థం. అత్యంత వైజ్ఞానికభాషగా మన్ననలు అందుకొంటున్న భాష ఇది. ఎంతో ఘనత గలిగిన ఈ భాష కొంత కాలం నిరాదరణకు గురియైనా ఇప్పుడు ప్రపంచ మంతటా భారీగా ఆదరణను పొందుతున్నది. ఈ కంప్యూటర్‌యుగంలో సంస్కృతమే అనువైన భాష అని శాస్త్రవేత్తలు ప్రపంచభాషలన్నింటినీ పరిశీలించి నిర్ణయించారు. ఈ భాష భారతీయుల నిధి. ఈ నిధిని సంరక్షించుకోవడం మనందరి కర్తవ్యం. మన తెలుగు భాషలో చాలా పదాలు సంస్కృతంలోనివే. మన భాషను సమృద్ధం చేయడంలో సంస్కృతం ఎంతగానో తోడ్పడింది. మనం చదివే స్తోత్రాలు, మంత్రాలు సంస్కృతంలోనే ఉన్నాయి. వాటిని సరియైన క్రమంలో ఉచ్చరించడానికి కొంతైనా సంస్కృత జ్ఞానం అవసరం.

సంస్కృతం నేర్చుకోవాలనే తపనగలవారు సమాజంలో ఎందరో ఉన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఈ భాష అభివృద్ధికి ఎంతగానో పాటు బడుతోంది. ఈ క్రమంలో శ్రీవేంకటేశ్వరభక్తి ఛానల్‌లో 'సంస్కృతం నేర్చుకుందాం" అనే కార్య క్రమం జనాదరణను పొందింది.

ఆ పాఠాలను 'సప్తగిరి' పత్రికలో ప్రచురిం చండి అని పాఠకులు కొందరు అడగడంతో మన పత్రికలో కూడ ఈ ప్రయత్నం ప్రారంభిస్తున్నాం. సంభాషణ అభ్యాసం మాత్రమే కాకుండ 'వర్ణ మాల'ను కూడా నేర్పిస్తే బాగుంటుందనే ఆలోచనతో అక్షరాలను కూడ నేర్పించే ప్రయత్నం చేస్తున్నాం.

అక్షరాల దగ్గర నుండి సంభాషణ వరకు ఈ భాషను ఒక వరుసక్రమంలో పాఠకులకు అందిం చాలనే ప్రయత్నంలో భాగంగా మొదట అక్షరాలతో (వర్ణమాల) ప్రారంభమవుతుంది. సంస్కృతాన్ని దేవ నాగరిలిపిలో వ్రాయడం ఆనవాయితి. హిందీ మొదలైన ఎన్నో భారతీయభాషలు ఈ లిపినే అను సరిస్తున్నాయి.


ఒక క్రమపద్ధతిలో నెలనెల ప్రచురించబడే ఈ పాఠాలను చదువుకొని సంస్కృతభాషను నేర్చు కొని మా ఈ ప్రయత్నాన్ని ప్రోత్సహిస్తారని భావి స్తున్నాం.

***- ప్రధానసంపాదకుడు.***

బాలవాక్కు

# ఏకలవ్యుడు

మహాభారతంలో ఏకలవ్యుడు గురుభక్తిని చాటే గొప్ప పాత్ర. గిరిజనకులానికి చెందిన వాడైన ఏకలవ్యునికి ద్రోణాచార్యుని గురుకులంలో విలువిద్యను నేర్చుకావాలనే కోరిక ఉండేది. కాని ద్రోణుడు అంగీకరించకపోవటంతో బంకమట్టితో అతని విగ్రహాన్ని ప్రతిష్ఠించుకుని ఆ ప్రతిమనే తన గురువుగా భావించి తనే స్వయంగా విద్యనేర్చుకోవటం ప్రారంభించాడు. ఈ విధంగా అకుంఠితదీక్ష, శ్రద్ధలతో విద్యనభ్యసించిన ఏకలవ్యుడు అసాధ్యమైన ప్రతిభను కూడ గట్టుకొని ద్రోణుడి ప్రియశిష్యుడైన అర్జునుని మించి పోయాడు. ఇలా ఉండగా ఏకలవ్యుడు విలువిద్య నభ్యాసం చేస్తుండగా, ఒకసారి అడవిలో వేటకుక్క ఒకటి వేగంగా ఎక్కడినుంచో ఏకలవ్యుడు ఉన్న ప్రదేశానికి వచ్చింది. అతన్ని




చూస్తూ గట్టిగా అరవసాగింది. నన్ను చూసి అరుస్తావా? అని ఏకలవ్యుడు కుక్క తెరిచిన నోరు మూయకుండా దాని నోటిలోనికి ఏడుబాణాలు కొట్టాడు.

ఆ దారిగా వస్తున్న పాండవకుమారులకు ఆ దృశ్యం కంటబడింది. ఇంతటి ప్రతిభాపాటవాలు కల్గిన వారు ఈ అరణ్యంలో ఎవరా? అని వారు ఆశ్చర్యపోయారు! ఆ విషయం విచారించగా ఆ ప్రాంతంలో ఏకలవ్యుడు అనే అతను, విలువిద్య నేర్చుకుంటున్నాడని తెలిసికొని, ఆ రాత్రి గురువు ద్రోణాచార్యులవారికి సేవచేసేసమయంలో ఇక్కడ నాకన్నా బాగా విలువిద్య చేసేవారు ఉన్నారని అర్జునుడు తెలిపాడు. తర్వాత రోజు ద్రోణాచార్యులవారు



మాస్టర్ కె.సాయిజయంత్,
7వ తరగతి,
భారతీయవిద్యాభవన్స్,
పాలకొల్లు

ఏకలవ్యుని చూడడానికి అతనివద్దకు వెళ్లారు. ఏకలవ్యుడు తన గురువుగారికి ఘనస్వాగతం పలికాడు. ఏకలవ్యుని విలువిద్యను చూసి ఎంతో సంతోషించారు. కాని ఒక కుక్క తనను చూచి అరిచింది అనే చిన్నసాకుతో దానినోటిని ఏడు బాణాలతో బిగించాడు కదా. మరిలా కోపాన్ని అదుపులో ఉంచుకోలేక, మంచి చెడు తేడా తెలియక నైపుణ్యంతో ఉన్న ఇంతటి విలువిద్య అతని వద్ద ఉంటే అది ప్రపంచానికి, ప్రజలకి, తన ప్రియశిష్యుడు అయిన అర్జునుడుకి ప్రమాదం ఏర్పడుతుంది అని రాబోయే ప్రమాదాన్ని పసికట్టాడు ద్రోణుడు. భవిష్యత్తులో ఏకలవ్యుడు విలువిద్య ప్రదర్శించు టకు వీలు కాకుండా అతని కుడిచేతి బొటనవేలు గురు దక్షిణగా ఇవ్వమని కోరాడు ద్రోణాచార్యులవారు. గురువు పట్ల ఎనలేని భక్తిప్రపత్తులు గలిగిన ఏకలవ్యుడు తన భవిషత్తు గురించి ఏ మాత్రం ఆలోచించక, తన కుడిచేతి బొటనవేలిని కోసి గురుదక్షిణగా సమర్పించాడు.

కానీ, ఎంతటి గురుభక్తి ఉన్నా, ఎంతటి నైపుణ్యం ఉన్నా, కోపం, ఆవేశం ఉన్నట్లయితే జీవితంలో ఎదుగు దలకు అడ్డంకి అనే విషయాన్ని ఈ కథ తెలియజేస్తున్నది కదూ!

బాలప్రబోధం

# గురుదక్షిణ

- శ్రీ బలిజేపల్లి సుబ్బారావు,
98667 83954

పూర్వం బదరికాశ్రమంలో శ్రీజ్ఞానానందమహర్షి అనే మహాజ్ఞాని నివసిస్తూండేవాడు. ఆయన వద్ద విజయుడు, విద్యాధరుడు అనే శిష్యులు పదునాలుగు సంవత్సరాలుగా విద్యనభ్యసిస్తున్నారు. వారి విద్యాభ్యాసం చివరిదశకు వచ్చింది.

ఒకసారి శ్రీజ్ఞానానందమహర్షి శిష్యులిద్దరినీ పిలిచి– 'నాయనలారా! ఇక కొద్దిరోజులలో మీ విద్యాభ్యాసం ముగియనున్నది. మరి మీరు త్వరలో మీ స్వగ్రామములకు వెళ్లవచ్చు' అని తెలుపగా శిష్యులిద్దరూ చాలా సంతోషపడ్డారు.

వారు మహర్షితో– 'గురువుగారూ! మాకు ఇన్ని సంవత్సరాలుగా ఎన్నో విద్యలను బోధించారు. కావున, మాకు కూడా గురుదక్షిణ తమకు సమర్పించవలసిన ధర్మం ఉన్నది. అందుచేత మేము మీకు ఈయవలసిన గురుదక్షిణ తెలుప వలసినదిగా అర్థిస్తున్నాము' అని గురువుని ప్రార్థించారు. దానికి మహర్షి ఆ విషయాన్ని మీకు త్వరలో తెలియపరుస్తాను అని పంపించివేశాడు.

కొద్దిరోజులు గడిచాయి. అకస్మాత్తుగా శ్రీజ్ఞానానంద మహర్షిపత్నికి సుస్తీ చేసింది. ఆమె ప్రాణాపాయస్థితిలో ఉన్నదని మహర్షి గ్రహించారు. ఆ పరిస్థితిలో మహర్షి తన శిష్యులిద్దరినీ పిలిచి, 'శిష్యులారా! ఇపుడు మీరు గురుదక్షిణ సమర్పించవలసిన సమయం వచ్చినది. అదేమంటే మీలో ఎవరో ఒకరు మీ ప్రాణాల్ని త్యాగం చేయవలసిన అవసరం వచ్చినది. ఎందుకంటే మీ గురుపత్ని ఇప్పుడు ప్రాణాపాయస్థితిలో ఉన్నది. మీ ప్రాణాల్ని ఇస్తే తప్ప ఆమె తిరిగి యథాతథస్థితికి చేరుకోలేదు' అని అనగానే శిష్యులిద్దరూ చాలా ఆశ్చర్యపడ్డారు.

ముందుగా మహర్షి విజయుని తన ఉద్దేశాన్ని తెలుపవలసినదిగా ఆదేశించాడు. దానికి విజయుడు 'గురువు గారూ! నన్ను ఇన్ని సంవత్సరాలుగా పెంచి నాకు విద్యలెన్నో నేర్పించారు. ప్రస్తుతం నేను ఆ విద్యలతో ఎన్నో కార్యాలను సాధించవలసిన ఆవశ్యకత ఉన్నది. అంతేకాకుండా ఎన్నో సంవత్సరాల అనంతరం నా యొక్క ఉన్నతిని నా తల్లిదండ్రులు చూసి ఆనందిస్తారు. నాకు కూడా వారి వద్దకు వెళ్లవలెనని కుతూహలంగా ఉన్నది. కావున, నాకు గురుదక్షిణ సమర్పించుటకు వేరే ఏదైనా ఉపాయాన్ని తెలుప వలసినదిగా' కోరాడు.

తర్వాత మహర్షి విద్యాధరుని పిలిచి అతనియొక్క ఉద్దేశాన్ని కూడా తెలుపమని ఆదేశించాడు. దానికి విద్యాధరుడు ఏ మాత్రం ఆలస్యం చేయకుండా, గురుదేవా! నేను గురుపత్ని ప్రాణాలకోసం నా ప్రాణాల్ని సమర్పించడానికి సిద్ధంగా ఉన్నాను' అని తెలుపగానే గురువు ఎంతో సంతోషించాడు.

'సరే నాయనా! వచ్చే పౌర్ణమినాడు నీవు నీ యొక్క ప్రాణత్యాగానికై సిద్ధంగా ఉండు' అని పంపించివేశాడు.


పౌర్ణమి వచ్చింది. 'నాయనా! విద్యాధరా! ఈ కమండలంలోని నీరు సేవించు. అవి సేవించిన వెంటనే నీవు మృత్యుముఖంలోనికి వెళతావు. వెంటనే మీ గురుపత్ని ప్రాణాపాయస్థితినుండి బయటపడుతుంది' అని మహర్షి తెలుపగానే, గురువుపాదాలకు నమస్కరించి ఆయన అనుజ్ఞతో ఆ కమండలంలోని జలాన్ని సంతోషంతో స్వీకరించాడు. వెనువెంటనే నేలకొరిగిపోయాడు.

ఇదంతా చూస్తున్న విజయుడు, అయ్యో! విద్యాధరా! నీవు ఎంత దురదృష్టవంతుడివి. నీవు సముపార్జించిన విద్యాఫలాలు అనుభవించకుండానే ప్రాణాలను కోల్పోయావు. అయినా, అన్ని విద్యలలోను నాతో సరితూగగల

నీవు మరణించడం కూడా నాకూ మంచిదే! ఎందుకంటే, నాతో సమానమైన విద్యావంతుడు ఇకపై ఉండడు అని అను కున్నాడు.

ఇంతలో గురుపత్ని మంచంపై నుండి లేచి నిల బడింది. వెంటనే జ్ఞానానందమహర్షి నేలపై ఒరిగిపోయిన విద్యాధరుడిపై నీళ్లుచల్లాడు. వెంటనే విద్యాధరుడు లేచి నిలబడ్డాడు. వెంటనే అతడు గురువు కాళ్లకు నమస్కరించి గురుదేవా! మరలా నేను ఎలా బ్రతికాను? అని ఆశ్చర్యంగా అడిగాడు.

దానికి మహర్షి నాయనా! విద్యాధరా! నీవు నిజంగా మృతి చెందలేదు. కేవలం స్పృహను కోల్పోయావు. అంతే! కేవలం మిమ్ములను పరీక్షించడానికే ఈ నాటకాన్ని ఆడవలసివచ్చినది. ఈ పరీక్షలో నీవు విజయం సాధించావు. అందుచేత ఎవ్వరికీ సాధ్యపడని కొన్ని రహస్యవిద్యలను నీకు బోధిస్తాను. 'అయినా ప్రాణాలు పోతాయని తెలిసి కూడా నీవు ఆ జలాన్ని ఎలా స్వీకరించగలిగావు?' అని అడిగాడు మహర్షి.



'దానికి విద్యాధరుడు గురుదేవా! ఎవరివైనా ప్రాణాలు కాపాడడానికి నా ప్రాణాలు ఉపయోగపడతా యంటే అంతకంటే నా విద్యకు సార్థకత ఏమున్నది? అందులోనూ గురుపత్ని ప్రాణాలు నా ప్రాణాల వల్ల రక్షిం బడతాయంటే అంతకన్న భాగ్యం ఏమున్నది? అని అనిపిం చింది. అంతేకాదు. ఏ గురువు కూడా తన శిష్యుడి ప్రాణాలు ఏ కారణంచేతనైనా తన ఎదురుగానే పోతుంటే సహింపలేడు. అలాంటిది తామే స్వయంగా నా ప్రాణాల్ని ఎలా హరించగలరు? దీనిలో నాకు తెలియని మర్మమేదో ఉందని ఊహించగలిగాను. అయినప్పటికి ఫలితం ఎలా ఉన్నా ఇది నాకు మంచి అవకాశంగా భావించడంవల్లే నాకు ధైర్యం గలిగింది.'

అని తెలుపగానే విద్యాధరుని సంస్కా రానికి, త్యాగానికి అబ్బురపడ్డాడు జ్ఞానానంద మహర్షి.

'తర్వాత విద్యాధరుణ్ణి సకలవిద్యాపారంగ తునిగా చేసి, వాటిని లోకకల్యాణానికై వినియో గించవలసినదిగా ఆదేశించాడు'.

## - నీతి -

1) శిష్యుని పురోభివృద్ధియే గురుదక్షిణగా భావించేవాడే నిజమైన గురువు.

2) గురువుపై గురి శిష్యుని పురోభివృద్ధికి దారి.

శ్రీ గోవింద! గోవింద! గోవింద!!



దౌర్జన్యాలకు కారణం అజ్ఞానమే

## భగవద్గీత-యువత

# నాయకత్వ లక్షణాలు

- డా॥ వైష్ణవాంఘ్రిసేవకదాసు
9821914642

ప్రతీ మనిషి ఏదో ఒక స్థాయిలో నాయకుడే అయి యుంటాడు. ఒకడు తన ఇంటి పరిధిలో నాయకుడు కావచ్చు, ఇంకొకడు తన వంశపరిధిలో నాయకుడు కావచ్చు, ఇంకొకడు తన చుట్టూ ఉండే సంఘపరిధిలో నాయకుడు కావచ్చు, మరొక్కడు తన జిల్లాస్థాయిలో నాయకుడు కావచ్చు, ఇంకొకడు రాష్ట్రస్థాయిలో నాయకుడు కావచ్చు, మరొక్కడు దేశస్థాయిలో లేదా ప్రపంచస్థాయిలో నాయకుడు కావచ్చు.

కాని, నాయకులైన వారందరిలోను కొన్ని లక్షణాలు సమానంగా ఉంటాయి. వారిలో కొన్ని లక్షణాలు తప్పకుండ ఉంటాయి. ఎవ్వడూ పుట్టుకతోనే నాయకుడు కాలేదు, అయితే అతనిలో నాయకుడు కావడానికి అవసరమైన లక్షణాలు ఉండవచ్చు. అయితే నాయకుడు కాగోరే వ్యక్తిలో నాయకత్వం వహించాలనే తీవ్రమైన లక్ష్యం ఉంటుంది. ఆ తీవ్రమైన లక్ష్యంతోనే అతడు ముందుకు సాగుతూ చక్కని మార్గదర్శనంలో తన లక్ష్యాన్ని సాధిస్తాడు.

భగవద్గీతలో నాయకత్వ లక్షణాలు పన్నెండవ అధ్యాయంలో చెప్పబడ్డాయి. వాటిలో కొన్నింటిని ఇక్కడ చర్చిద్దాం. నాయకత్వ లక్షణాలలో మొట్టమొదటిది ద్వేషం లేకపోవడం. నాయకుడు పదిమందితో కలిసి పనిచేయ వలసి ఉంటుంది. ఎవ్వరిమీద ద్వేషం లేనప్పుడే అతడు వారితో కలిసి పనిచేయగలుగుతాడు.

అంతేకాదు, తమను ద్వేషించనివారి పైననే అను యాయులకు అభిమానం, గౌరవం ఉంటుంది. రెండవ ముఖ్యలక్షణం అందరి పట్ల మైత్రి. ద్వేషం లేకపోవడం మొట్టమొదటి శుభలక్షణమైతే అందరితో చెలిమి చేయ గలగడం రెండవ నాయకత్వ లక్షణము. తర్వాత వచ్చే సద్గుణం కరుణ కలిగి ఉండడం. ఈ విధంగా నాయ కుడికి ఉండే మూడు ముఖ్యమైన లక్షణాలను మూడు రకాలవారి పట్ల ఉపయోగించడం జరుగుతుంది.

శత్రువునైనా నాయకుడు ద్వేషించడు. శత్రువునుండి కూడ ఏదో నేర్చుకోవలసిన మంచి గుణం ఉంటుందనేది నాయకుడి ప్రథమసూత్రం. అతడు సమానులతో కూడ మైత్రి చేస్తాడు. నలుగురి సహాయం లేనిదే ఎవ్వడైనా ముందుకు పోలేడు.

ఇక కరుణ అనే మహద్గుణం అల్పుల మీద ఉంటుంది. అల్పులను నాయకుడు ఏనాడూ చులకన చేయడు, పైగా వారికి కావలసిన సమస్త అవసరాలను తీరుస్తూ అతడు వారిని ఉచ్ఛస్థితికి తీసికొనివచ్చే ప్రయత్నాలు చేస్తాడు. ఛత్రపతి శివాజీ మహారాజు 18వ ఏట దండ యాత్రలు మొదలు పెట్టి 50 ఏళ్ళు నిండేసరికి 400 పైగా కోటలను తన వశం చేసికొన్నాడు.


**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**

**గోదాతలకు విజ్ఞప్తి**

1) **దేశవాళీ గోవులను తిరుపతిలోని తి.తి.దేవస్థానమునకు సంబంధించిన శ్రీవేంకటేశ్వర గోసంరక్షణశాల నందు మాత్రమే ముందస్తు అనుమతితో స్వీకరించబడతాయి.**

2) **ఆరోగ్యవంతమైన దేశవాళీ గోజాతి ఆవులు మాత్రమే స్వీకరించబడుతాయి.**

గోసంరక్షణాధికారి,
తి.తి.దే., తిరుపతి



అందులో చాలా వరకు అతడు గెలిచినవే, మిగితావి స్వయంగా నిర్మించినవి. అయితే ఇక్కడ శివాజీ మహారాజు తన అనుయాయులతో తెలివి గలవారికి, ధైర్యం ఉన్నవారికి పూర్తి ప్రోత్సాహాన్ని ఇచ్చి క్రొత్త క్రొత్త కోటలను జయించడానికి స్వతంత్రంగా పంపేవాడు. వారు ఆ కోటలను జయించగానే వాటికి వారినే అధిపతులుగా చేసేవాడు. ఇదే నాయకత్వ లక్షణం. ఇది చిన్నవారి పట్ల కరుణ ఉంచడం క్రింద వస్తుంది.

ద్వేషం లేనివాడు, సర్వజీవుల పట్ల మైత్రిని కలిగి ఉండేవాడు, కరుణ కలవాడు, మమత్వం లేనివాడు, అహంకారం లేనివాడు, సుఖదుఃఖాలలో సమత్వభావం కలిగి ఉండేవాడు నాకు అత్యంత ప్రియమైనవాడు అని భగవద్గీతలో శ్రీకృష్ణభగవానుడు తెలియజేశాడు.

మొదట చెప్పిన మూడులక్షణాలతో పాటుగా మమత్వం లేక పోవడం, అహంకారం లేకపోవడం కూడ నాయకత్వ లక్షణాలుగానే చెప్పబడ్డాయి. నిజానికి ఈ సద్గుణాలు లేకపోతే అందరితో మైత్రి సాధ్యమే కాదు. మమత్వం ఉన్నవాడు, అంటే లోభియైనవాడు సరియైన ధర్మనిర్ణయం చేయలేడు. అతని దృష్టి సంకుచితంగా ఉంటుంది. ఇక అహంకారం కలవారికి ఎవ్వరైనా ఆమడ దూరంలో ఉంటారు. సుఖదుఃఖాలలో సమభావాన్ని కలిగి ఉండడం. నాయకునికి ఉండవలసిన మరొక ముఖ్యమైన సద్గుణం. ఏ కార్యంలోనైనా జయాపజయాలు, ఎదురీతలు ఉంటాయి. అప్పుడు వాటిని ఎదుర్కోవడానికి నాయకుడే ముందుకు రావలసి ఉంటుంది.

నిజమైన నాయకుడు తాను సాధించే విజయాలకు తన అనుయాయులనే బాధ్యులుగా చెప్పుకుంటాడు, అయితే ఎప్పుడైనా అపజయం కలిగితే అది తన బాధ్యతగా అతడు స్వీకరిస్తాడు.

కాబట్టి, యువత మొదటి నుండే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకునే ప్రయత్నాలు చేయాలి. సాధనతో ఏదైనా ఈ జగత్తులో సమకూరుతుంది కాబట్టి ముందు నుండే నాయకత్వ లక్ష్యాన్ని పెట్టుకుని నాయకత్వ లక్షణాలకై ప్రయత్నిస్తుంటే అవి వాటంతట అవే వచ్చి చేరుతాయి.

నాయకులకు ఉండే ఈ కొన్ని ముఖ్య లక్షణాలను గమనిస్తే అవన్నీ మనస్సుకు సంబంధించినవే అయి ఉండడం స్పష్టంగా కనిపిస్తుంది. అంటే నాయకుడు చేయవలసిన మొట్టమొదటి కార్యం మనస్సును నిగ్రహించడం. ఏ నాయకుడైతే మనోనిగ్రహకార్యాన్ని సాధించగలిగాడో నిశ్చయంగా లోకంలో సుప్రసిద్ధుడౌతాడు. అతడే అందరి మన్ననలను పొందగలుగుతాడు. సాధారణంగా లోకం తమను నడిపించే నాయకుడి కొరకు ఎదురు చూస్తూ ఉంటుంది. కాబట్టి మీరు నాయకుడిగా కావడానికి నిశ్చయించుకుంటే దానికి తగ్గ ధైర్యసాహసాలు ప్రదర్శిస్తే లోకం మీ నాయకత్వానికి జోహార్లు పలుకుతుంది. దానికి కావలసిన లక్షణాలను భగవద్గీత స్పష్టంగా తెలిపింది.

జనవరి, 2020

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం–** కార్యసిద్ధి. క్రమేపి ఇబ్బందులు తొలగుతాయి. బంధువులతో మైత్రిభావము ఏర్పడుతుంది. వస్తుభూషణాదులు లభ్యమవుతాయి. గౌరవం పెరుగుతుంది. రాజగౌరవం మరియు రాజ సంభాషణం, మంచిసౌఖ్యం కల్గుతాయి.



**వృషభం–**తమ స్వగ్రామాల్ని వీడి దూరపు ప్రయాణములు, వినోదములు సాధ్యమైనంత తగ్గించుకోవడం మంచిది. భార్యా సంతతి ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించుట ముఖ్యము. భోజన సౌఖ్యము తగ్గుట, ఇతరులచే అపవాదాలు కల్గుతాయి.



**మిథునం–** క్రొత్తసంవత్సరంలో శుభారంభం చేస్తారు. రాజదర్శనంపై అధికారుల అండ మీకుంటుంది. అన్నివైపులనుండి విజయం మిమ్ములను వరిస్తుంది. భూగృహ స్థిరాస్తులు వృద్ధి చేస్తారు. వస్తువస్త్రలాభములు కలుగుతాయి.



**కర్కాటకం–** ఇరువర్గాల మధ్య మధ్యవర్తిత్వం నెరపి సయోధ్యను సుగమం చేస్తారు. దూర ప్రయాణాలు చేస్తారు. విద్యార్థులు శ్రమించి పరీక్షల్లో ఉత్తీర్ణులౌతారు. కృషి, వాణిజ్యం అనుకూలం.



**సింహం–** పిత్త, వాతాది అనారోగ్యములు, శరీరమున సర్వాంగములయందును ఉష్ణ సంబంధ వ్రణములు, సౌఖ్యం తగ్గటం, వంచనకు గుర్రై పశ్చాత్తాపం చెందటం, పూర్వపు స్నేహితులను కలసివారి సహాయం అర్థించి వ్యవహార జయం పొందుతారు.



**కన్య–**నూతనోత్సాహం ఆవరిస్తుంది. సంతానం విద్యావిషయాలకై అధికధనం ఖర్చు చేస్తారు. వారు వృద్ధిలోనికి వస్తారు. ఇతరదేశాలలో పని చేయువారికి కొన్ని వీసా సంబంధ ఇబ్బందులు తప్పవు. సుబ్రహ్మణ్య ఆరాధన మంచిది.



**తుల–**వృద్ధాప్య వసతిగృహాలకు చేయూత నిస్తారు. సాంకేతికరంగనిపుణులకు ఆదాయ మార్గాలు పెరుగుతాయి. చేతివృత్తులవారికి ఆదాయం మెండుగా ఉంటుంది.



**వృశ్చికం–**అన్నిరంగాలవారికి అదృష్టం కలసి వస్తుంది. దూరపుప్రాంతంలో ఉన్న సంతతి నుండి శుభవార్తలొస్తాయి. విద్యావ్యాసంగ విషయాలలో ఆసక్తి చూపుతారు. శ్రద్ధవహించి పరిశోధనలు చేయగల్గుతారు.



**ధనుస్సు–** ఆర్థిక కార్యకలాపములు అపరిచిత వ్యక్తులతో నెరుపుటచే ఇబ్బందులు. దేశాంతర వాసం, శరీరమున అలసట, వేళదాటి భుజించుట, రుచించకపోవుట, బంధన, అపమృత్యుదోషాలను నివారించుటకు శివ, విష్ణు ఆరాధనలు చేయుట ఉత్తమం.



**మకరం–** దూరప్రాంతాలనుండి బంధుజనం రాకపోకలలో నిత్యోత్సాహం, కీర్తి వర్ధిల్లుతుంది. ఉద్యోగస్తులు అధికారికపనులపై ఇతరప్రాంతాలు సందర్శించుట, అధికారవృద్ధి, జయం గల్గుతాయి. విద్యార్థులు చదువులోనూ, క్రీడల్లోనూ రాణిస్తారు.



**కుంభం–** వర్తకవ్యాపారాలు, వ్యవసాయం ఫలవంతం. అధిక దిగుబడులచేత లాభాలు, సంతృప్తికరమగు జీవనం, సాగులో నూతన పోకడలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుట, నూతన నిర్మాణాలు కలసి వస్తాయి.



**మీనం–** మాసాంతంలో వృత్తి నిర్వహణ బాగుంటుంది. ఆదాయం మెరుగవుతుంది. ధనసమృద్ధి కలుగుతుంది. సమస్తదోషాలు తొలగి సకలైశ్వర్యములు కలుగుతాయి.

అణకువలేని అందం మేలు చేసేది కాదు




భారతీయజీవనవిధానం రామాయణ, భారత, భాగవతాలతో ముప్పేట గొన్న ముత్యాలహారం. మానవత్వం నుండి మాధవత్వానికీ, సగుణంనుండి నిర్గుణానికీ, సంసారంనుండి సాయుజ్యానికి భక్తకోటిని చేర్చడంలో భాగవతం సర్వశ్రేష్ఠం అనడం ఆస్తికులందరూ ఏకగ్రీవంగా అంగీకరించిన అనుభవైక సిద్ధాంతం. వేదవ్యాసభగవానుడు సంతరించిన అష్టాదశ పురాణాలలో భాగవతం "సత్యం పరం ధీమహి" అనే గాయత్రీనామబ్రహ్మస్వరూపంతో, ధర్మవిస్తరణంతో, వృతాసుర వధాదికంతో, సర్వాంగసౌందర్యశోభతో, భక్తిజ్ఞానవైరాగ్యత్రిపుటీ ప్రభావప్రబోధాలతో, శ్రీకృష్ణమూలమై, ఆస్తికులపాలిటి కల్పవృక్షమై అలరారుతోంది. ఇది మహాపురాణం.

పురాణానికి చెప్పిన సృష్టి, ప్రళయం, దేవతాదుల వంశానువర్ణనం, మన్వంతరాల వృత్తాంతం, రాజుల చరిత్ర– అనే అయిదు లక్షణాలే గాక, భగవంతుని అవతారవిశేషాలూ, చతుర్విధమోక్షాలూ, జీవబ్రహ్మల లక్షణాలూ, మున్నగు అనేకవిషయాలు భాగవతంలో భక్తిసూత్రంలో కూర్చబడి ఉన్నాయి.

సాత్త్వికపరమప్రేమభక్తిని ప్రదర్శించడమే భాగవతహృదయం. ఇందలి భక్తి జ్ఞాన వైరాగ్యాల సంపుటి విశ్వమానవప్రేమగా రూపొంది, భక్తిలేని వాళ్ల శుష్కహృదయాల్లో దివ్యజ్యోతిని వెలిగించి, వాళ్ల జీవితాలను రసమయంగా తీర్చిదిద్దుతోంది. భిన్నభిన్న భావాలతో భిన్నులై ఉన్నవాళ్లనందరినీ భాగవతం భక్తిరూపమైన అలౌకిక పరమప్రేమ సూత్రంతో బంధించి, ఒక్క చోటికి చేర్చి, వాళ్లలో పరస్పర ప్రేమభావాన్నీ, మానవత్వంలోని మాధవత్వాన్ని సుప్రతిష్ఠితం చేస్తోంది. కనుకనే మనవాఙ్మయచరిత్రలో భాగవతం సకలమానవభాగవతమై ఒక విశిష్టస్థానాన్ని ఆక్రమించింది. ఇంతటి గొప్పపురాణాన్ని సరళసుందరమైన వచనంలోకి తీసుకువచ్చారు పింగళిపాండురంగారావు.

వ్యాసభాగవతాన్ని, పోతన భాగవతాన్ని శ్లోకాలలో, పద్యాలలో చదివి అర్థం చేసుకోలేని సామాన్యపాఠకులకు పాండురంగారావుగారి రచన సులభగ్రాహ్యంగా ఉంది. ముఖ్యంగా లోతైన ఆధ్యాత్మికవిషయాలు వదలి కథావిషయాలు మాత్రమే చెప్పడంవల్ల ఇది విద్యార్థులకు, యువతకు, సామాన్యగృహిణులకు భాగవత కథాసారాన్ని ఆస్వాదించే వీలు కల్పించిన రసమయ రచన. ఇందులోని కొన్ని కథలను హైస్కూలు, కళాశాలస్థాయి విద్యార్థులకు పాఠ్యాంశాలుగా పెట్టినట్లైతే పిల్లలుహాయిగా చదివి భాగవతాన్ని అర్థం చేసుకోగలరు. ఎవరు ఏ కోణంలో చూసినా అన్ని వైపులా కాంతులు వెదజల్లే మహారత్నం– భాగవతం. భక్తిప్రపత్తులను సమాజానికి అందించడానికి ఈ విధమైన రచనలు ఎంతో ఉపకరిస్తాయి. సనాతన హైందవధర్మానికి నడుం కట్టిన తి.తి.దే.వారు ఈ పుస్తకాన్ని స్వీయ ప్రచురణగా వెలువరించడం, తక్కువధరతో భక్తలోకానికి అందించడం వల్ల ఎంతో మేలు జరిగింది.

పింగళి పాండురంగారావు రచన అత్యంత సులభ శైలిలో, దీర్ఘసమాసాలు లేకుండా సామాన్యవాక్యాలతో సరళంగా ఉండడం ఈ పుస్తకానికి ప్రత్యేకశోభ. ఇలాంటి పుస్తకాలు భక్తిరచనలలో చాలా అరుదు. ప్రవచనకర్తలకు కూడా ప్రవచనం మధ్యలో ఉదహరించడానికి ఈ కథలను స్వీకరించవచ్చు. భాగవతపాఠకులందరూ చదువదగ్గపుస్తకమిది. *–డా॥ కంపల్లె రవిచంద్రన్.*

## శ్రీహరిలీలామృతం

**(సంక్షిప్త భాగవతగాథలు)**

రచన - పింగళి పాండురంగారావు,
సైజు- 1/8 డెమ్మి, పుటలు- 594,
వెల-రూ.105/- (పోస్టేజి అదనం),
ప్రతులకు - తి.తి.దే. పుస్తక విక్రయశాల,
తి.తి.దే. ప్రెస్ కాంపౌండు,
కె.టి. రోడ్డు, తిరుపతి-517 507.
ఇతర వివరాలకు - 0877-2264209.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# సప్తగిరి

(ఆధ్యాత్మిక మాసపత్రిక)



## చందా నమోదు పత్రం

**1.** పేరు మరియు చిరునామా :
(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పని సరి)

సెల్ నెం.

**2.** కావలసిన భాష :
తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐
హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం (సంవత్సరచందా మాత్రమే) ☐

**3.** సంవత్సర/జీవిత చందా :
రూ.60/- ☐ రూ.500/- ☐

**4.** చందా పునరుద్ధరణ :
(అ) చందా నెంబరు :
(ఆ) భాష :

**5.** చెల్లించిన మొత్తం :
డి.డి.నెం. :
తేది :
(చెక్కులు స్వీకరించబడవు)

ప్రదేశం :
తేది :
చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.60/-, జీవితచందా రూ.500/-లు; డి.డి. / ఎం.ఓ.ను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి', తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.

2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులో గానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి, పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప-మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకుడు, సప్తగిరి కార్యాలయం, టి.టి.డి. ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# వైకుంఠపాళి

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | ■ | 2 | | 3 | | 4 | ■ | 5 |
| | ■ | | ■ | | ■ | | ■ | |
| 6 | | ■ | 7 | | | ■ | 8 | |
| | ■ | 9 | ■ | | ■ | 10 | ■ | |
| 11 | | | | ■ | 12 | | | ■ |
| | ■ | | ■ | 13 | ■ | | ■ | 14 |
| 15 | | ■ | 16 | | | ■ | 17 | |
| | ■ | 18 | ■ | | ■ | 19 | ■ | |
| ■ | ■ | 20 | | | | | ■ | ■ |

**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు

### అడ్డం

2)కశ్యపుని వల్ల ధనువుకు జన్మించిన అసురచక్రవర్తి(5); 6)దక్ష పుత్రికల్లో ఒకతె(2); 7)పరాశక్తి అవతారం(3); 8)అందము(2); 11)పద్మమే నివాసంగా కలది(4); 12)ఆటవికుడైన చండకుని భార్య(3); 15)మహర్షులు చేసేపని(2); 16)ధ్వని(3); 17)కత్తి పీటకు బదులు దీన్ని వాడతారు(2); 20)కుమారస్వామి(5)

### నిలువు

1)సుగ్రీవుని నివాసము(8); 2)ఇక్కడ ఉండకుండా వ్యాసుణ్ణి, అన్నపూర్ణ పంపివేసింది(2); 3)రావణుని మంత్రి ప్రహస్తుని తల్లి(4); 4)ఆడతాబేలు(2); 5)ఉత్తరదిక్కునకు అధిపతి(4); 9)పండు(3); 10)కృష్ణుని అష్టభార్యల్లో ఒకతె(3); 13)కుమార స్వామి భార్య(4); 14)విరటుని కొల్వులో కాలం గడిపిన ధర్మ రాజు(3); 18)బాణాసురుని కూతురు(2); 19)సర్వనామం(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు

# తిరుపతిలో గీతా జయంతి ఉత్సవాలు

- డా॥ వైష్ణవాంఘ్రి సేవకదాస్
9821914642

పరమపవిత్రమైన మార్గశిరమాసంలో, మోక్షదఏకాదశిరోజున తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూధర్మప్రచారపరిషత్ మరియు ఇస్కాన్ సంయుక్త ఆధ్వర్యంలో డిసెంబర్ 7వ తేదీన తిరుపతి ఎస్.వి.హైస్కూల్ ప్రాంగణంలో పరమాద్భుతంగా, పరమవైభవంగా గీతాజయంతి ఉత్సవాలు జరిగాయి. ఈ అద్భుతమైన కార్యక్రమానికి గత మూడునెలలనుండి అహర్నిశలు కృషి జరిగింది. ఆ కృషి ఫలితమే వేలాది బాలబాలికలు హైస్కూల్ ప్రాంగణంలో గుంపులు గుంపులుగా వచ్చి పరమోత్సాహంతో గీతాజయంతి ఉత్సవాలలో పాల్గొన్నారు. గీతాజయంతి ఉత్సవాలను ఇంత ఘనంగా తిరుమల తిరుపతి దేవస్థానం వారు నిర్వహించడం ఇదే మొదటిసారి అనడం అతిశయోక్తి కానే కాదు. ఇంతటి అద్భుతమైన కార్యాన్ని నిరంతరము చింతన చేస్తూ, దానికి తగిన సూచనలు ఇస్తూ మొదటినుండి చివరివరకు నడిపించి విజయవంతం చేసింది శ్రీ పి.బసంత్‌కుమార్, ఐ.ఏ.ఎస్., సంయుక్త కార్యనిర్వహణాధికారిగారే. ఆయన నిర్దేశంలో హిందూ ధర్మప్రచార పరిషత్ కార్యదర్శి ఆచార్య కె.రాజగోపాలన్‌గారు అద్భుతమైన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేశారు.



భగవద్గీత జీవనగీత. భగవద్గీత భవిష్యత్తును తీర్చిదిద్దే దివ్యమైన సందేశం. భగవద్గీత సమస్త మానవాళికి మార్గదర్శనం చేసే కులాతీత, మతాతీత, దేశాతీత, ప్రాంతీయాతీత సందేశం. తిరుమల తిరుపతి దేవస్థానం విద్యాసంస్థలు, ఇతర విద్యాసంస్థలలోని 10,000 మంది విద్యార్థినీ విద్యార్థులతో గీతాజయంతి ఉత్సవాలు జరిపించాలని తిరుమల తిరుపతి దేవస్థానంవారు సంకల్పించారు. అన్ని ఏర్పాట్లు 6వ తేదీకి పూర్తయ్యాయి. అయినా 7వ తేదీ ప్రొద్దున్నే చినుకులు పడడం మొదలైంది. అయినా సమస్తభారము శ్రీకృష్ణ భగవానుని మీదనే వేసి అధికారబృందం ముందుకు సాగారు. (వేడిని ఇచ్చేవాడిని నేనే, వర్షాన్ని ఆపేవాడిని నేనే, కురిపించేవాడిని నేనే) అని శ్రీకృష్ణుడు భగవద్గీతలోని తొమ్మిదవ అధ్యాయంలోని పందొమ్మిదవ శ్లోకంలో చెప్పిన విషయాన్ని గుర్తు చేసికొంటూ, వర్షాన్ని ఆపమని ప్రార్థిస్తూ అందరూ కార్యంలో సంలగ్నమయ్యారు. సన్నని వానతుంపరలను లెక్కజేయకుండ వేలాదిమంది పిల్లలు బారులు



బారులుగా హైస్కూల్ ప్రాంగణానికి చేరుకున్నారు. వారందరు పరమోత్సాహంగా గీతాజయంతి ఉత్సవాలకు తరలిరావడం ఎంతో కన్నులపండుగగా అనిపించింది. ప్రాంగణాన్ని ఎంతో వైభవోపేతంగా అలంకరించారు. విద్యార్థినీవిద్యార్థులందరు తమ తమ స్కూళ్ళకు కేటాయించిన స్థానాలలో ఆసీనులయ్యారు. గీతాజయంతి కార్యక్రమం సుమారు 10.30గం॥లకు ప్రారంభ మైంది. ఆ లోపల వేలాదిసంఖ్యలో విద్యార్థినీవిద్యార్థులు తమ తమ స్థానాలలో కూర్చున్నారు.



ఇక వేదిక మీద అద్భుతంగా అన్నమయ్య కీర్తనలతో కళాకారులు అందరిలో భక్తిభావాన్ని నింపారు. కార్యక్రమాన్ని శ్రీమాన్ ఆచార్య కె.రాజగోపాలన్‌గారు నిర్వహణాధికారిగా నిలిచి నడిపించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఇస్కాన్ ప్రతినిధులు డా॥ వైష్ణవాంఘ్రిసేవకదాస్, లీలాపారాయణదాసు మొట్ట మొదలే వేదికమీదకు చేరుకున్నారు. కార్యక్రమానికి విచ్చేసిన వారిలో శ్రీమతి సాయిప్రసన్న, విశాఖపట్నం, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ కులపతి, తితిదే విద్యాశాఖాధికారి, భారతీయ విద్యాభవన్ ప్రతినిధి, రామకృష్ణమఠం ప్రతినిధి, వికాస తరంగిణి ప్రతినిధి, చిన్మయమిషన్ ప్రతినిధి ఉన్నారు. గీతాసందేశాన్ని వినిపించడానికి శ్రీశ్రీశ్రీవిద్యాశంకర భారతీతీర్థస్వామి వచ్చారు. ముఖ్యఅతిథి సందేశాన్ని ఇవ్వడానికి తితిదే పాలకమండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డిగారు వచ్చారు. విశిష్ట అతిథులుగా చంద్రగిరి ఎం.ఎల్.ఏ. శ్రీ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిగారు వచ్చారు. శ్రీఅనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్., కార్యనిర్వ హణాధికారి, తి.తి.దే., శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి అదనపు కార్యనిర్వహణాధికారిగార్లు కూడ గౌరవఅతిథులుగా ఆహ్వానించబడ్డారు.

కార్యక్రమంలో తొలిభాగంగా బ్రహ్మకుమారీసంస్థ ప్రతినిధులద్వారా ఓంకార ధ్యానం చేయించబడింది. తరువాత శ్రీవేంకటేశ్వర నృత్యకళాశాల ప్రతినిధుల ద్వారా ప్రార్థన జరిగింది. వెంటనే వేదికను అలంకరించిన మహనీయులచే జ్యోతి ప్రజ్వలన జరిగింది. జ్యోతి ప్రజ్వలన తరువాత ఆచార్య కె.రాజగోపాలన్‌గారు స్వాగతం పలుకుతూ పేరు పేరున వేదికను అలంకరించినవారిని అందరినీ పరిచయం చేశారు. తరువాత ఎస్.వి. ఉన్నత వేదాధ్యయన సంస్థ ప్రత్యేకాధికారి డా॥ ఆకెళ్ళ విభీషణశర్మగారు సామూహిక గీతాపారాయణ వైశిష్ట్యాన్ని వివరించారు. గీతలోని అనేకమైన ముఖ్యాంశాలను కూడ తెలియజేశారు. ఆ సందేశం పూర్తి కాగానే గీతాజయంతిలోని ముఖ్యఘట్టం ప్రారంభమైంది. అదే వేలాది విద్యార్థినీ విద్యార్థులతో సామూహికంగా భగవద్గీతలోని 15వఅధ్యాయాన్ని పారాయణ చేయడము. శ్రీవేంకటేశ్వర వేదవిశ్వవిద్యాలయం



విద్యార్థులు రాగయుక్తంగా గీతాశ్లోకాలను చదివినప్పుడు వేలాదిమంది బాలబాలికలు అదే స్వరంతో గీతాపారాయణం చేశారు. దాదాపు 10 నిముషాలకు పైగా ప్రాంగణమంతా గీతాశ్లోక ఉచ్చారణతో నిండిపోయింది. అందరి హృదయాలు పరమానందంతో నిండిపోయాయి. ఆ విధంగా గీతాపారాయణం పూర్తి కాగానే ఆ పదిహేనవ అధ్యాయ సారాంశాన్ని శ్రీమతి సాయిప్రసన్నగారు చక్కగా అందరికీ అనేక ఉపమానాలతో వివరించారు. మన హృదయంలో ఉన్న పురుషోత్తముని తెలిసికోవడమే ఆ అధ్యాయపు ఉద్దేశమని ఆమె వివరించారు. భగవంతుడిని తెలిసికోవడం అందరికీ సహజంగానే ఉన్న కళ అని ఆవిడ తెలియజేశారు.

గీతాసందేశాన్ని బాలబాలికలకు వివరించడానికి ప్రత్యేకంగా విచ్చేసిన శ్రీశ్రీశ్రీవిద్యాశంకర భారతీతీర్థ స్వామివారు పదిహేనవ అధ్యాయం సారాంశము అందరికీ అర్థమయ్యేటట్లు వివరించే ప్రయత్నం చేశారు. పుష్పగిరిపీఠానికి అధిపతిగా ఉన్నట్టి ఆయన రాక అందరికీ ఆనందాన్ని కలిగించింది. శ్రీ వై.వి.సుబ్బారెడ్డిగారు తమ ముఖ్యఅతిథిసందేశాన్ని ఇస్తూ హిందూధర్మప్రచారానికి తిరుమల తిరుపతి దేవస్థానం కంకణబద్ధమై ఉన్నదని, హిందూధర్మప్రచారానికి తాము మరింత గట్టిగా కృషి చేస్తామని, దానికి ఈ గీతాజయంతి ఉత్సవమే శంఖారావం వంటిదని ఆయన గట్టిగా చెప్పారు. విశిష్ట అతిథులుగా విచ్చేసిన శ్రీచెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిగారు మాట్లాడుతూ భగవద్గీత అందరికీ జీవనశైలిని తెలియజేస్తుందని చెప్పారు. తాను కూడ ఒకప్పుడు ఇదే స్కూల్‌ప్రాంగణంలో విద్యార్థిలాగా కూర్చున్నానని ఆయన తమ పాతస్మృతులు గుర్తుకు చేసికొన్నారు. సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీమాన్ బసంత్‌కుమార్‌గారు గీతాజయంతి ఉత్సవాలు ఘనంగా జరగడం తమకు ఎంతో ఆనందంగా ఉన్నదని చెప్పారు. తర్వాత ఇస్కాన్ ప్రతినిధులు డా॥వైష్ణవాంఘ్రి సేవకదాస్‌గారు మాట్లాడుతూ జీవితంలో విజయాన్ని సాధించడానికి భగవద్గీతే మార్గమని, దానిద్వారా అందరికీ సంపద, విజయము, అసాధారణశక్తి, నీతి కలుగుతాయని, విజయం వద్దన్నవారికి కూడ విజయం కలిగించేది గీత అని సంబోధించారు. ఆయన చేసిన స్ఫూర్తిదాయకమైన ఉపన్యాసానికి విద్యార్థినీ విద్యార్థులందరు ఎంతో ప్రేరణ పొంది ఆ మాటలకు తగినరీతిగా స్పందించారు. ఇస్కాన్ సంస్థవారి పక్షాన పదివేలమందికి గీతాజయంతి కార్డును పంచడం విశేషం. అందులో గీతావిజయసందేశం లామినేట్ చేసి ఇవ్వబడింది. విద్యార్థులందరు ఆ గీతాజయంతి కార్డును తాము చదువుకునే ప్రదేశంలో గోడమీద అంటించి, అందులో చెప్పబడిన శ్లోకాన్ని ప్రతీరోజు ముమ్మారు ఉచ్చరించాలని డా॥వైష్ణవాంఘ్రిసేవకదాసు తమ సందేశంలో తెలియజేశారు. పిల్లలు తమకు ఇవ్వబడిన గీతాజయంతి కార్డును చూపిస్తూ ఫోటోలు దిగి తమ ఉత్సాహాన్ని ప్రదర్శించారు. రామకృష్ణ మఠం ప్రతినిధి శ్రీఅనుపమానందస్వామి మాట్లాడుతూ గీతలో చెప్పిన విధంగా అందరు ధైర్యంతో





నిలబడి అన్నీ సాధించాలని ప్రబోధించారు. భారతీయ విద్యా భవన్ ప్రతినిధి శ్రీ సత్యనారాయణరాజు, వికాస తరంగిణి ప్రతినిధి డా॥ నాగేంద్రశాయిగారు కూడ తమ గీతాసందేశాన్ని అందించారు. చివరగా ఆదిత్యరామ్‌గారు స్వయంగా రచించి, స్వరపరచి గానం చేసిన గీతా సందేశపాటను రికార్డులో వినిపించడం ద్వారా గీతా జయంతి కార్యక్రమం ముగిసింది. వేదికను అలంకరించిన మహనీయులు తమ తమ అమూల్యమైన సందేశాలను వినిపించగానే శ్రీబసంత్‌కుమార్‌గారు స్వయంగా వారిని శ్రీస్వామివారి ప్రసాదంగా చక్కని శాలువాను కప్పి, లడ్డువడ ప్రసాదాలు అందజేశారు. అందరికీ ఆ ప్రసాదము ఎంతో ఆనందాన్ని కలుగజేసింది. ఆ తరువాత ఆయన కార్యక్రమాన్ని జయప్రదంగా నిర్వహించిన ఆచార్య కె.రాజ గోపాలన్‌గారిని కూడ సత్కరించారు. ఇస్కాన్ సంస్థవారు కూడ వేదికను అలంకరించిన మహనీయులకు గీతాసందేశ ప్రశ్నావళితో కూడిన క్యాలెండర్లు బహూకరించారు.

గీతాజయంతి ఉత్సవాలకు ఉత్సాహంగా విచ్చేసిన విద్యార్థినీ విద్యార్థులకు తిరుమల తిరుపతి దేవస్థానంవారు ఒక ప్యాకెట్టులో మంచినీళ్ళు, బిస్కెట్టు ప్యాకెట్, 15వ అధ్యాయంలోని శ్లోకాలు ముద్రించిన కాగితము, ఇస్కాన్ సంస్థవారు అందజేసిన గీతాజయంతి లామినేషన్ కార్డు అందజేశారు. మొదట్లో కాస్త తుంపరగా వర్షం కురిసినా గీతాపారాయణం వేళకు వాతావరణమంతా పొడిగా తయారైంది. ఆకాశమంతా మబ్బుతో నిండిపోవడం వలన పిల్లలకు ఎండవేడి కూడ తగలలేదు. అంతా శ్రీబాలాజీపద్మావతి వారి ఆశీస్సులుగా భావిస్తూ అందరు గీతాజయంతి ఆనందాన్ని ఆస్వాదించారు. మధ్యాహ్నం పన్నెండుగంటల వరకు ఈ గీతాజయంతి కార్యక్రమాన్ని శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్‌వారు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యక్షప్రసారం చూపించారు. వేలాదిమంది బాలబాలికలు ముక్తకంఠంతో గీతా శ్లోకాలు పఠించడం ప్రపంచాన్నే అలరించింది. ఇంతటి భారీ కార్యక్రమాన్ని ఎటువంటి ఒడిదుడుకులు లేకుండ, చక్కని క్రమశిక్షణతో నిర్వహింపజేసిన పోలీసు సిబ్బందికి, క్యాడెట్లకు, ఇతర సంస్థలకు కార్యనిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. బాలబాలికలు ఎంత క్రమశిక్షణతో వచ్చి స్కూల్ ప్రాంగణాన్ని నింపివేసారో అంతే క్రమశిక్షణతో తిరిగి తమ తమ స్కూళ్ళకు చేరుకోవడం విశేషం. అందరి హృదయాలలో నిండింది ఆ సమయంలో కేవలం భగవద్గీతే. ఈ విధంగా ప్రతియొక్కరిలో భగవద్గీత స్ఫూర్తి నింపిన రోజున ప్రపంచం స్వర్ణతుల్యంగా అవుతుంది. అందుకే డా॥వైష్ణవాంఘ్రిసేవకదాసుగారు









పిల్లలచేత ముక్తకంఠంతో చెప్పించిన చివరి మాటలను మీరు కూడ తెలుసుకోండి, భగవద్గీత సహాయంతో భవిష్యత్తును తీర్చిదిద్దుకోండి.

విద్యల కెల్ల రాజు భగవద్గీత
విజయసంపదలు చేకూర్చేది భగవద్గీత
విధిరాతను మార్చేది భగవద్గీత
విజయం వద్దన్నా కట్టబెట్టేది భగవద్గీత
అందుకే, భగవద్గీతను ఒక చేత పట్టుకుందాం!
ఇంకొక చేత విజయపతాకాన్ని ఎగురవేద్దాం!!

# భక్తుల సేవలో....



నవంబరు 23, 2019న తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారికి జరిగిన కార్తికబ్రహ్మోత్సవంలో శనివారం జరిగిన ధ్వజారోహణ కార్యక్రమంలో తి.తి.దే. పాలక మండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి గారు, తి.తి.దే. కార్య నిర్వహణాధికారి శ్రీఅనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్.లు పాల్గొన్నారు.

డిసెంబరు 01, 2019న తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో కడపటిరోజైన పంచమీ తీర్థం వేడుక సందర్భంగా అమ్మవారికి రాష్ట్రప్రభుత్వం తరపున ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో తి.తి.దే. పాలక మండలి అధ్యక్షులు శ్రీ వై.వి. సుబ్బారెడ్డి దంపతులు కూడా పాల్గొని శ్రీపద్మావతి అమ్మవారికి కంఠాభరణం మరియు పట్టువస్త్రాలను సమర్పించారు.






డిసెంబరు 8, 2019న తమిళనాడు రాష్ట్రంలోని ప్రముఖ వైష్ణవక్షేత్రమైన శ్రీరంగంలోని శ్రీరంగనాథస్వామి ఆలయంలో తి.తి.దే. పాలక మండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డిగారు, తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్.లకు శ్రీరంగనాథ ఆలయ అధ్యక్షులు శ్రీవేణుశ్రీనివాసన్, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం వీరు పట్టువస్త్రాలను తలపై పెట్టుకొని ఊరేగింపుగా వెళ్ళి స్వామివారికి సమర్పించారు. దర్శనానంతరం ఆలయాధికారులు శ్రీరంగనాథస్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.


Edited and published on behalf of T.T.Devasthanams by **Dr. K.Radha Ramana,** M.A., M.Phil., Ph.D., Chief Editor, T.T.D. and printed at T.T.D. Press by **Sri R.V.Vijaya Kumar,** B.A., B.Ed., Dy. E.O., (Publications & Press), T.T.D. Press, Tirupati - 517507.

## అమ్మవారి పంచమీతీర్థం, చక్రస్నాన దృశ్యం




23-11-2019 నుండి 01-12-2019 వరకు జరిగిన
తిరుచానూరు శ్రీపద్మావతీఅమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవ
దృశ్యమాలిక




తి.తి.దే. ఫల,పుష్పప్రదర్శన శాలను ప్రారంభిస్తున్న తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు
శ్రీ వై.వి.సుబ్బారెడ్డి గారు, తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఎ.ఎస్., గారు



అమ్మవారి సేవలో.....



తి.తి.దే. తరపున అమ్మవారికి సారె ను సమర్పించడానికి బయలుదేరిన బృందం



కళాప్రదర్శనల దృశ్యాలు

SAPTHAGIRI (TELUGU) ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams
printing on 25-12-2019. Regd. with the Registrar of Newspapers under "RNI" No.10742, Postal Regd.No.TRP/10 - 2018-2020
Licensed to post without prepayment No.PMGK/RNP/WPP-04/2018-2020



అలమేలుమంగ
హరి అంతరంగా - అన్నమయ్య